బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు:140
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

**కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ ఎప్పటికవుతుంది?**

హుజూరాబాద్ నియోజకవర్గంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద చెక్కుల పంపిణీ ఎప్పటికి అవుతుం దని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. హుజూరాబాద్ నియోజక వర్గంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఎంపి కైన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీని కావాలని జాప్యం చేస్తున్నారంటూ ఆ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని మంగళవారం జస్టిస్ సూరేపల్లి నంద విచారించారు.

సంపుటి 07, సంచిక: 205 | బుధవారం | 26-06-2024 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

# స్పీకర్ పదవిపై ఉత్కంఠ

అధికార పక్షం నుంచి ఓమ్ బిర్లా, ప్రతిపక్షం నుంచి సురేష్ పోటీ

నేడు ఎన్నిక

50ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే



**న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్ పదవిపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. అధికార బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ స్పీకర్ పదవికి మరోసారి ఓమ్ బిర్లాను పోటీకి దింపింది. అయితే సభాపతి పదవిని ఏకగ్రీవం చేసేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రయత్నించినా విపక్షాలతో ఏకాభిప్రాయం కుదరలేదు. ప్రతిపక్షాలు కూడా ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ ఎంపి కె.సురేశ్ బరిలోకి దింపింది. ఓమ్ బిర్లాకు మద్దతు ఇవ్వాలంటే తమకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని ఇండియా కూటమి షరతులకు బిజెపి సీనియర్ నేత అంగీకరించకపోవడంతో చివరి నిమిషంలో ప్రతిపక్షాలు కూడా తమ అభ్యర్థిని రంగంలోకి దింపాయి. దాదాపు 50ఏళ్ల తర్వాత స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుండటం మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలతో లోక్ సభలో తమ బలాన్ని పెంచుకున్న ప్రతిపక్షాలు ఈసారి ఉప సభాపతి పదవికి పట్టుబట్టాయి. స్పీకర్ పదవి అధికార పక్షం తీసుకుంటే.. డిప్యూటీ స్థానాన్ని తమకు ఇవ్వాలని డిమాండ్ చేశాయి. లేదంటే సభాపతి పదవికి తాము అభ్యర్థిని నిలబెడతామని హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో ఏకాభిప్రాయం సాధించేందుకు పార్లమెంట్‌లోని రాజ్‌నాథ్‌సింగ్ కార్యాలయంలో ప్రతిపక్షాల తరు పున కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్, డిఎంకె నేత టిఆర్ బాలు, అధికార పక్షం తరుపున కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, నడ్డాలు చర్చలు జరిపారు. ఏకాభిప్రాయం కుదరకపోగా, తరువాయి 2లో



జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌పై

# హైకోర్టుకు కెసిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, కొత్త థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలని బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. ఆ కమిషన్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తూ మంగళవారం కెసిఆర్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఏర్పాటు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉందని కెసిఆర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. నిబంధనల మేరకే విద్యుత్ కొనుగోలు జరిగిందని కెసిఆర్ పునరుద్ఘటించారు. జస్టిస్ నరసింహారెడ్డి మీడియా సమావేశాలు నిర్వహించి మరీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కెసిఆర్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ కేసులో కమిషన్, జస్టిస్ నరసింహారెడ్డి, ఇంధనశాఖ విభాగాలను ప్రతివాదులుగా ఉన్నారు. కాగా, తెలంగాణలో గత పదేండ్ల కాలంలో జరిగిన విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, కొత్త థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణంపై విచారణ జరిపేందుకు గత మార్చి 14న రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఏకసభ్య విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్ 1952 కింద ఏర్పాటైన ఈ కమిషన్ ఇప్పటికే తరువాయి 2లో



బెయిల్ పిటిషన్లపై విచారణను

# అనవసరంగా వాయిదా వేయొద్దు

**న్యూఢిల్లీ :** బెయిల్ అంశాలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వాటిని అనవసరంగా వాయిదా వేయకూడదని ఢిల్లీ హైకోర్టును ఉద్దేశిస్తూ పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ బెయిల్ విజ్ఞప్తిపై తదుపరి విచారణలో నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై స్టే విధించడం అసాధారణంగా పరిగణించిన తరువాయి 8లో



ఎన్‌హెచ్‌ఎం బకాయిలు

# విడుదల చేయండి

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డాకు సిఎం రేవంత్ విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద తెలంగాణ రాష్ట్రానికి రావల్సిన రూ.693.13 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డాను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని మంగళవారం సిఎం కలిశారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య రంగంపై తెలంగాణ ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక శ్రద్ధను సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనలన్నీ తాము ఈ ఏడాది జనవరి నుంచి అమలు చేస్తున్నామని వివరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకుగానూ 5,159 బస్తీ దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు) సమర్థంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నందున కేంద్ర ప్రభుత్వం సహకరించాలని, ఎన్‌హెచ్‌ఎం బకాయిలు విడుదల చేయాలని కేంద్ర మంత్రి నడ్డాను రేవంత్ రెడ్డి కోరారు. ఎన్‌హెచ్‌ఎం 202324 మూడు, నాలుగు త్రైమాసికాల నిధులు రూ.323.73 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే 202425 మొదటి త్రైమాసిక గ్రాంట్ రూ.138 కోట్లను మంజురు చేయాల్సి ఉన్నదని, తరువాయి 2లో

## ఢిల్లీలో పర్యటనలో సిఎం బిజీ బిజీ

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజుల ఢిల్లీ పర్యటన బిజీబిజీగా కొనసాగింది. ఒక వైపు రాష్ట్రానికి చెందిన పలు సమస్యలు, అంశాలపై కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయడంతో పాటు మరోవైపు పార్టీ సంస్థాగత వ్యవహారాలకు సంబంధించిన విషయాలపై కాంగ్రెస్ అధిష్టానం నాయకులతో వరుస భేటీలు జరిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి ముగ్గురు కేంద్ర మంత్రులతో సమావేశం కావడంతో పాటు తెలంగాణ నుంచి ఎంపికైన లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. కేంద్రంలో కాంగ్రెస్‌కు వైరి పక్షమైన బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కొలువుదీరినప్పటికీ తెలంగాణ ప్రజల ప్రయోజనాలే ప్రాధాన్యంగా సమాఖ్య స్ఫూర్తిని అనుసరించి కేంద్ర మంత్రులను కలిసి సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తులు చేశారు. తొలిరోజు తరువాయి 2లో

## 'రక్షణ' ఉద్యోగులతో కేంద్రం ఆటలు

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్

ఆర్డనెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగుల నిర్ణయానికి ఎఐటియుసి మద్దతు



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వ, రక్షణ శాఖ పౌర ఉద్యోగులను ఏడు కొత్త కంపెనీలలో చేరేందుకు ఐచ్ఛికం(ఆప్షన్) ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం వారి సర్వీసుతో ఆటలాడుతోందని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ అన్నారు. ఆప్షన్ ఇవ్వడం ద్వారా వారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ హోదాను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అఖిల భారత రక్షణ శాఖ ఉద్యోగుల సమాఖ్య (ఎఐడిఇఎఫ్) నేతృత్వంలో దేశంలోని 41ఆర్డనెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు ఆప్షన్ ఇవ్వకూడదని తీసుకున్న నిర్ణయానికి ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆమె మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ రక్షణ శాఖ ప్రయోజనాల దృష్ట్యా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, అందులో పని చేసే ఉద్యోగులను రక్షించేందుకు తరువాయి 2లో



లోక్‌సభలో తెలంగాణ ఎంపిలు

# ప్రమాణ స్వీకారం

వివాదాస్పదంగా మారిన అసదుద్దీన్ నినాదం

రికార్డుల నుంచి తొలగించిన ప్రొటెం స్పీకర్

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ సమావేశాల మొదటి రోజున సోమవారం ప్రధాని మోడీ, కేబినెట్ మంత్రులు సహా 262 మంది కొత్త సభ్యులతో ప్రొటెం స్పీకర్ మహతాబ్ ప్రమాణం చేయించారు. మంగళవారం మిగతా ఎంపిలు ప్రమాణస్వీకారం చేశారు. కొత్త లోక్‌సభలో తెలంగాణ ఎంపిలు ప్రమాణ స్వీకారం చేశారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల్లో ప్రమాణాలు ప్రతిధ్వనించాయి. కాంగ్రెస్ ఎంపిలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, బలరాం నాయక్, కడియం కావ్య, సురేశ్ షెట్కార్ తెలుగులో ప్రమాణం చేయగా, వంశీకృష్ణ, రామసహాయం రఘురాంరెడ్డి ఇంగ్లీష్‌లో ప్రతిజ్ఞ చేశారు. బిజెపి ఎంపిలు ఈటల రాజేందర్, డికె అరుణ తెలుగులో ప్రమాణంచేయగా,రఘునందన్‌రావు, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇంగ్లీష్‌లో, గోడం నగేశ్ హిందీలో ప్రమాణం చేశారు. ఎం ఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసి ఉర్దూలో ప్రమాణం చేశారు. అనంతరం ఆయన జై పాలస్తీనా నినాదం ఇవ్వడంతో పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో నిబంధనలు పరిశీలించి అసదుద్దీన్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామని ప్రొటెం స్పీకర్ స్పష్టం చేశారు.

**తెలుగులో ప్రమాణ స్వీకారం చేసిన తమిళనాడు ఎంపి**

గత నెలలో దేశం మొత్తం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా తమిళనాడులోని కృష్ణగిరి లోక్సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గోపీనాథ్ గెలిచారు. మంగళవారం జరిగిన పార్లమెంటు సమావేశంలో 40 మంది ఎంపిలు ప్రమాణ స్వీకారం చేశారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తమిళనాడు ఎంపిలు ఒక్కొక్కరిగా ప్రమాణస్వీకారం చేశారు. ఇందులో తరువాయి 2లో

# రైతు భరోసాపై ప్రజాభిప్రాయం



గత ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నిలిపేసిన పథకాలు..కారణాలేంటి

జిడిపి అధికంగా వచ్చే రంగాలపై దృష్టి సారించాలి

బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

"రైతు భరోసాకు సంబంధించి రైతుల అభిప్రాయం ఎలా ఉంది. ఏ విధంగా ముందుకు పోతే మంచిది అనే విషయాలను రైతుల ద్వారానే తెలుసుకుంటే మంచిది. రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయ సేకరణ చేసి రైతులను భాగస్వాములను చేయాలి. అందులో మంత్రులు కూడా పాల్గొంటే కార్యక్రమం మరింత ప్రయోజనాత్మకంగా ఉం టుంది" అని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టివిర్కమార్క తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా పథకాలకు ఇప్పటివరకు చేస్తున్న ఖర్చు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రానున్న రోజుల్లో పెరుగుతున్న బడ్జెట్‌పై డిప్యూటీ సిఎం ఆరా తీశారు. వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల అధికారుల తో వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో నిలిపివేసిన వ్యవసాయ పథకాలు ఏమిటి, అందుకు గల కారణాలు ఏమిటని వ్యవసాయ అధికారులను ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంతో మ్యాచింగ్ ద్వారా వచ్చే పథకాలు, నిధులు తరువాయి 2లో

అసలైన రైతులు, సాగు భూములకే

## రైతు భరోసా ఇవ్వాలి

గరిష్ట పరిమితిని విధించి పారదర్శకంగా అమలు చేయాలి

రైతు నేస్తంలో పలువురు అన్నదాతల అభిప్రాయం

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని అసలైన రైతులు, సాగవుతున్న భూములకు మాత్రమే వర్తింపజేయాలని, ఇందులోను గరిష్ట పరిమితిని విధించాలని రాష్ట్ర రైతాంగం ప్రభుత్వానికి సూచించింది.రైతులకు వర్తింపచేసే పథకాల విధివిధానాలలో ప్రత్యక్షంగా రైతుల అభిప్రాయాలు తీసుకోవడం శుభపరిణామని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేయనున్న 'రైతు భరోసా'కు సంబంధించి రైతు నేస్తంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 110 గ్రామీణ నియోజకవర్గాల్లో ఉన్న రైతువేదికలో పాల్గొన్న రైతుల నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తమ ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతుభరోసా తరువాయి 2లో

# బొగ్గు గనులపై ప్రైవేటు పడగ



ప్రశ్నార్థకమవుతున్న సింగరేణి భవితవ్యం

గొంతు నులుముతున్న పాలకులు

బొగ్గు బ్లాకుల వేలంలో కేంద్రం

కుచించుకుపోతున్న 137 సంవత్సరాల సింగరేణి

ప్రజాపక్షం/ ఖమ్మం

సింగరేణి భవితవ్యం ప్రశ్నార్థకమవుతుంది. ప్రభుత్వాల వైఖరి సింగరేణి గొంతు నులుముతుంది. బొగ్గు గనులపై ప్రైవేటు పడగ పడడంతో 1.20లక్షల మంది ఉద్యోగులు, కార్మికులు కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీలతో అలరారిన సింగరేణి చరిత్ర మసకబారి ఇప్పుడు మనుగడకే ప్రమాదంలో పడింది. సింగరేణి శోధించిన బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం వేలంవేసి ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్న నేపథ్యంలో సింగరేణి భవితవ్యం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రపంచ స్థాయి పేరెన్నిక గన్న సింగరేణిది 137 సంవత్సరాల చరిత్ర. ఖమ్మంజిల్లా కొత్తగూడెం, ఇల్లందు పట్టణాల మధ్య దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రయాణికులు వంట చేసుకునేందుకు పెట్టిన పొయ్యి రాళ్లు మండడంతో బొగ్గు అన్వేషణ ప్రారంభమైంది. 1871లో బ్రిటిష్ భూగర్భ పరిశోధన అధికారి విలియం కింగ్ బొగ్గు అన్వేషణ ప్రారంభించాడు. 16 ఏళ్ల ఆయన తరువాయి 8లో

# టెన్షన్ పడొద్దు..ఆగండి

మీకు భవిష్యత్‌లో మంచి స్థానం...

ఆ ఐదుగురు ఎమ్మెల్యేలపై వేటు తప్పదు..

ఎంఎల్‌ఎలు, ముఖ్యనేతలకు 'భరోసా'నిస్తున్న బిఆర్ఎస్ అధినేత

ఎర్రవెల్లిలో కొందరు శాసనసభ్యులు, ముఖ్యనేతలతో కెసిఆర్ సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



పార్టీ ఫిరాయింపులను కట్టడి చేసేందుకు బిఆర్ఎస్ బుజ్జగింపుల పర్వానికి తెర లేపింది. ఏ మాత్రం ఆలస్యం చేసినా అసలుకే ఎసరు పడుతుందని గుర్తించిన బిఆర్ఎస్, తమ ఎంఎల్‌ఎలు, ముఖ్యనేతలతో కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఒక వైపు సిట్టింగ్ ఎంఎల్‌ఎలను 'కారు' దిగకుండా చూడడం, మరోవైపు ఇది వరకే పార్టీ ఫిరాయించిన ఎంఎల్‌ఎలపై అనర్హత వేటు పడేలా చూడాలని బిఆర్ఎస్ యోచిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కొందరు ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఎర్రవెల్లిలో మంగళవారం సమావేశమయ్యారు. పార్టీ ఫిరాయింపులకు అవకాశాలు ఇవ్వకుండా ఎంఎల్‌ఎలతో పాటు ముఖ్యనాయకులతో సమావేశం కావాలని బిఆర్ఎస్ నిర్ణయించింది. ఈ క్రమంలోనే ముఖ్యనేతలు, ఎంఎల్‌ఎలకు ఫోన్ చేసి 'ఎర్రవెల్లి'కి ఆహ్వానించినట్టు తెలిసింది. త్వరలోనే మరి కొంత తరువాయి 2లో



## ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అందరికీ మార్గదర్శకులు

ప్రజాపక్షం/హదరాబాద్

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కాంగ్రెస్ లో సీనియర్ నాయకులని, అతను మా అందరికీ మార్గదర్శకులని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.మంగళవారం ఆయన మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో ఆయన ఇంట్లోనే చర్చలు జరిపారు. జగిత్యాల బిఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరడంతో జీవన్‌రెడ్డి పార్టీ అధిష్టానంపై అసంతృప్తి వెల్లగక్కడం, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తారని, పార్టీ కూడా మారబోతున్నారనే వార్తలు వెలువడడంతో ఈ భేటీకి ప్రాధాన్యాత తరువాయి 8లో

# స్పేస్ వాక్ రద్దు




**వాషింగ్టన్:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని వ్యోమగాములు ట్రేసీ డైసన్, మైక్ బారట్ స్పేస్ వాక్ను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' రద్దు చేసింది. వీరిద్దరి స్పేస్ సూట్ లీక్ కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. స్పేస్ సూట్ శీతలీకరణ వ్యవస్థ నుంచి నీరు లీక్ అవుతున్నట్టు డైసన్ నాసా అధికారులు తెలియచేసింది. బ్యాటరీ పవర్ను మార్చినప్పుడు ఈ లీకేజీని గమనించినట్టు అమె పేర్కొంది. సమాచారం అందుకున్న వెంటనే, అంతరిక్ష నడకను నాసా తాత్కాలికంగా రద్దు చేసింది. వ్యోమగాములకు ఎలాంటి ప్రమాదం జరగలేదని నాసా ఒక ప్రకటనలో పేర్కొంది. ముందుగా నిర్ధారించిన షెడ్యూల్ ప్రకారం కక్ష్యలో ఉన్న ప్రయోగశాల నుంచి బయటకు వచ్చి, వెలుపల ఉన్న సూక్ష్మ జీవుల నమూనాలను వ్యోమగాములు సేకరించాల్సి ఉంది. దాదాపు ఏడు గంటల పాటు అంతరిక్ష నడకను ప్లాన్ చేశారు. కానీ, లీకేజీని కనుగొన్న తర్వాత, కేవలం అరగంటకే స్పేస్ వాక్ను నిలిపివేశారు. ప్రస్తుతం స్పేస్ స్టేషన్లో భారత మూలాలు ఉన్న సునీతా విలియమ్స్ కూడా ఉన్న విషయం తెలిసిందే.

# 'చెత్త' వివాదం!




**సియోల్ (దక్షిణ కొరియా):** ఉత్తర కొరియా బెలూన్ల ద్వారా చెత్త సంచులను సరిహద్దుల్లో పడవేయడాన్ని దక్షిణ కొరియా ఖండించింది. ఇటీవల కాలంలో ఇది ఐదో సంఘటనగా ఒక ప్రకటనలో పేర్కొంది. ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య దశాబ్దాలుగా 'ప్రచ్ఛన్న యుద్ధం' కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రాజకీయ కరపత్రాలను దక్షిణ కొరియాకు చెందిన కొంత మంది సామాజిక కార్యకర్తలు బెలూన్ల సాయంతో ఉత్తర కొరియాలోకి వెదజల్లారు. దీనికి ప్రతీకారంగా ఉత్తర కొరియా ఈ ఏడాది మే మాసం నుంచి పదుల సంఖ్యలో చెత్త మూటలను బెలూన్ల ద్వారా దక్షిణ కొరియా సరిహద్దుల్లో జారవిడుస్తున్నది. మంగళవారం మరోసారి 'చెత్త' బెలూన్లు తమ భూభాగంలోకి రావడంపై దక్షిణ కొరియా ఆగ్రహం వ్యక్తం చేసింది. సరైన సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించింది. మొత్తం మీద 'చెత్త' వివాదం ఉభయ కొరియాల మధ్య చిచ్చు రాజేస్తున్నది.

## ఉక్రేన్‌కు యుఎస్ ఆయుధాలు

**వాషింగ్టన్:** రష్యా లేదా రష్యా ఆధీనంలో ఉన్న భూభాగాలపై దాడికి అమెరికా నుంచి అందిన ఆయుధాలను ఉక్రేన్ ఉపయోగిస్తున్నదన్న వాదన చాలాకాలంగా వినిపిస్తున్నది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా పలు సందర్భాల్లో ఈ ఆరోపణలు చేశారు. అవి కేవలం ఆరోపణలు కావని తాజా వార్తలు స్పష్టం చేస్తున్నాయి. ఉక్రేన్‌కు అదనంగా 150 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను అమెరికా పంపనుందని సమాచారం. ఏ క్షణంలోనైనా దీనికి సంబంధించిన ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మాస్కోలోని అమెరికా రాయబారిని సోమవారం పిలిపించి, అంతకు ముందు ఆదివారం రోజున క్రిమియాపై జరిపిన దాడిలో అమెరికా తయారు చేసిన అధునాతన క్షిపణులను ఉక్రేన్ ప్రయోగించడాన్ని రష్యా ప్రస్తావించింది. ఉక్రేన్‌కు ఆయుధ సరఫరాలపై నిరసన వ్యక్తం చేసింది. ఈ దాడిలో తమ దేశానికి చెందిన నలుగురు మృతి చెందారని, 150 మంది గాయపడ్డారని వివరించింది. 2014లో ఉక్రేన్ నుండి క్రిమియాను రష్యా స్వాధీనం చేసుకోవడాన్ని అప్పట్లో పలు దేశాలు వ్యతిరేకించాయి. అదే అంశాన్ని ప్రస్తావిస్తూ, ఉక్రేన్ తన భూభాగాన్ని తిరిగి పొందడానికి, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి చేస్తున్న యుద్ధానికి మద్దతునిస్తామని అమెరికా అంటున్నది. ఆక్రమంలోనే ఉక్రేన్‌కు భారీగా ఆయుధాలు సరఫరా చేస్తున్నది. ప్రపంచదేశాల మధ్య యుద్ధ వాతావరణాన్ని సృష్టించడం, యుద్ధం మొదలైతే, అది నిరంతరం కొనసాగేందుకు వ్యూహరచన చేయడం అమెరికా అలవాటు. ఆయుధ వ్యాపారాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా ఈపంథాను ఎన్నో దశాబ్దాలుగా అనుసరిస్తునే ఉంది. రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రేన్ ఆయుధ సంపద క్షీణించగా, అమెరికా వాటిని భర్తీ చేస్తున్నది. తాజాగా మరో విడత ఆయుధ సాయాన్ని అందించనుంది.



## భూమికి తిరిగి వచ్చిన చాంగ్'ఎ6 మాడ్యూల్

### చంద్రుడి ఆవలివైపు నుంచి మట్టి, ధూళి సేకరణ
### ఈ ప్రయోగం చేసిన తొలి దేశంగా చైనా రికార్డు

**బీజింగ్:** చైనా చంద్రయాన పరిశోధనలు కొత్త శిఖరాలకు చేరుకున్నాయి. చంద్రుడి ఆవలపైన నుంచి మట్టి, ధూళిని సేకరించిన చాంగ్'ఎ6 మాడ్యూల్ మంగళవారం స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:07 నిమిషాలకు భూమిపైకి దిగింది. మంగోలియాకు సమీపంలోని స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాంతం వద్ద మాడ్యూల్ దిగిన తర్వాత, చంద్రుడి పైనుంచి సేకరించిన సాంపిల్స్‌ను చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (సిఎన్ఎస్ఎ)కు పంపుతారు. అక్కడ పరిశోధనలు జరుగుతాయి. ఆతర్వాత అంతర్జాతీయంగా శాస్త్రవేత్తలకు ఈ సమూనాలు అందుబాటులో ఉంచుతామని సిఎన్ఎస్ఎ ప్రకటించింది. చాంగ్'ఎ6 ప్రయోగం విజయవంతంకావడం, చంద్రుడి నుంచినమూనాలను తీసుకొని మాడ్యూల్ సురక్షితంగా తిరిగి రావడం పట్ల చైనా అధ్యక్షుడు క్సిజిన్‌పింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈప్రాజెక్టులో భాగస్వాములైన ప్రతి ఒక్కరూ ప్రశంసలకు అర్హులని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, చంద్రుడికి ఒకవైపు మాత్రమే మనం చూడగలుగుతాం. మనకు ఎప్పటికీ కనిపించని రెండోభాగం, అంటే దక్షిణ భాగం పైకి రోవర్‌ను పంపిన ఘనతను 2023లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఇస్రో' దక్కించుకున్న విషయం తెలిసిందే. అయితే, భూమికి చాలాదూరంగా ఉన్న, చంద్రుడి ఆవలవైపు పరిశోధనా శకటాన్ని చైనా 2019లో పంపింది. భూమికి సుదూరంగా ఉండడంతోపాటు, అగడ్తలతో నిండిఉంటుంది. రోవర్ దిగడానికి చదునైన ప్రదేశం చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి, అక్కడికి వ్యోమనౌకను పంపడం అత్యంతకష్టం. అయితే, ఆప్రయోగాన్ని సుమారు నాలుగేళ్ల క్రితమే పూర్తి చేసిన చైనా, ఇప్పుడుఏకంగా అక్కడి నుంచి మట్టిసహా శాంపిల్స్‌ను సేకరించి, ఈప్రయోగం చేసిన తొలి దేశంగా చరిత్ర సృష్టించింది. చంద్రుని రెండో వైపు, చివరిగా ఉన్న ప్రాంతం నుంచి




సుమారు 2గ్రాముల నమూనాలను భూమికి తీసుకొచ్చి, చంద్రయాన ప్రయోగాల్లో కొత్త అధ్యాయాన్ని లిఖించింది. చైనీయుల పౌరాణిక చంద్ర దేవత పేరుమీద ఈ ప్రాజెక్టును 'చాంగ్' అనే పేరు పెట్టారు. ఆర్బిటర్, రిటర్నర్, ల్యాండర్, యాక్సెండర్‌తో కూడిన చాంగ్'ఎ6ను ఈఏడాది మే3న ప్రయోగించారు. ముందుగా ఉంచిన కాక్వియావొ2 రిలేఉపగ్రహం మద్దతుతో, రోవర్, ల్యాండర్. యాక్సెండర్ జూన్ 2న చంద్రునికి అవతలి వైపున ఉన్న దక్షిణ ధ్రువ ఐట్కెన్(ఎస్‌పిఎ) బేసిన్‌లోని నిర్దేశిత ల్యాండింగ్ ప్రాంతంలో దిగాయి. అప్పటి నుంచి నమూనా సేకరణ ప్రారంభమైంది. ఈనెల 4న, ఆరోహకుడు చంద్రుడి నుండి నమూనాలతో బయలుదేరిన లాండర్ చంద్రుడి కక్షలోకి ప్రవేశించింది. 6న ఆర్బిటర్ రిటర్న్ కలయికతో రెండెజౌస్, డాకింగ్‌ను పూర్తి చేసింది. అనంతరం ఆ నమూనాల మాడ్యూల్‌ను వ్యోమనౌకకు చేరసేఇంది. ఇది భూమికి తిరిగిరావడానికి సరైన అవకాశం కోసం చంద్రకక్షలో 13రోజులు గడిపింది. శాస్త్రవేత్తలు ముందుగా వేసుకున్న అంచనాల మేరకే, సరిగ్గా నిర్ణీత సమయానికి భూమిపైకి చేరుకుంది. ఈ ప్రయోగం మానవుడు జరుపుతున్న చంద్ర అన్వేషణలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని చైనీస్ జియాలజీ, జియోఫిజిక్స్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకుడు యాంగ్ చీ అన్నారు. యుగయుగాలుగా చంద్రుడు చైనీయుల సంస్కృతిలో ఒక భాగమని గుర్తుచేశారు. చంద్రుడిపైకి చేరుకొని, అక్కడే నివాసం ఉన్న మహిళ చాంగ్ పౌరాణిక కథనమే ఇందుకు నిదర్శమన్నారు. చైనాశాస్త్రవేత్తలు విజ్ఞానశాస్త్రానికి దోహదపడే చంద్రుడికి సంబంధించిన వివరాలను పరిశోధించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇలావుంటే, ఈ నమూనాలను పరిశీలించేందుకు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల నుంచి దరఖాస్తులు చైనాకు అందాయి.

## లండన్ జైలు నుంచి అమెరికాకు..

### వికీలీక్స్ వ్యవస్థాపకుడు
### అసాంజేకు విడుదల ఎప్పుడో?

**బ్యాంకాక్:** అమెరికా రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసిన వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే ఐదేళ్ల తర్వాత లండన్ జైలు నుంచి విడుదలయ్యాడు. అతనిని ప్రత్యేక విమానంలో అమెరికాకు తరలిస్తున్నారు. అక్కడ అతను తన తప్పులను అంగీకరించే అవకాశం ఉందని అంటున్నారు. అయితే, అమెరికా కోర్టు అతనికి క్షమాభిక్ష పెడుతుందా? అన్నది ప్రశ్న. ప్రస్తుతానికి మాత్రం అసాంజే విడుదల ఎప్పుడనేదని ఎవరూ చెప్పలేకపోతున్నారు. కేసు వివరాల్లోకి వెళితే, ఇరాక్, అఫ్గానిస్థాన్‌లపై అమెరికా యుద్ధం జరిపినప్పుడు, రక్షణ శాఖకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను సేకరించిన అసాంజే, వాటిని వికీలీక్స్‌లో పోస్టు చేశాడు. దేశ భద్రతకు సంబంధించిన కీలకమైన డాక్యుమెంట్లను బహిర్గతం చేసినందుకు అమెరికా గూఢచర్య చట్టం కింద అతనిపై కేసు నమోదైంది. అయితే, బ్రిటన్‌కు 2019లో బ్రిటన్ వెళ్లిన అసాంజేపై అక్కడ లైంగిక వేధింపుల కేసు నమోదైంది. దీనితో లండన్ కోర్టులో కేసు దాఖలైంది. అనంతరకాలంలో పోలీసులు ఆ కేసును ఉపసంహరించుకున్నారు. కాగా, అసాంజేను తమకు అప్పగించాలని అమెరికా పలుమార్లు కోరగా, బ్రిటిష్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. కానీ, అమెరికాలో తనకు ప్రాణహాని పొంచి ఉందని, కాబట్టి, తప్పగించవద్దని కోరుతూ అసాంజే కోర్టును ఆశ్రయించాడు. అతని వాదనలు విన్న తర్వాత, అమెరికా వెళితే, అక్కడి జైళ్లలోని పరిస్థితులు, పోలీసులు వ్యవహరించే తీరుతో అసాంజే ఆత్మహత్య చేసుకునే అవకాశం ఉందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. అసాంజేను అమెరికాకు అప్పగించడానికి వీల్లేదని తీర్పునిచ్చాడు. అయితే, అతని పట్ల కరకుగా వ్యవహరించబోమని బ్రిటిష్ ప్రభుత్వానికి అమెరికా లిఖితపూర్వక హామీ ఇచ్చింది. అంతేగాక, అతను నేరాన్ని అంగీకరించి, క్షమాభిక్ష కోరితే, శిక్ష లేకుండా విడుదల చేస్తామని పేర్కొంది.



అమెరికా ఇచ్చిన హామీ మేరకు, అసాంజేను పంపించడానికి కోర్టు అనుమతించింది. అవసరమైన లాంఛనాలన్నీ పూర్తికావడంతో, లండన్ జైలు నుంచి సుమారు ఐదేళ్ల తర్వాత అసాంజే విడుదలయ్యాడు. అమెరికా ప్రత్యేక విమానంలో అతనిని తరలిస్తున్నది. మార్గమధ్యంలో, బాంకాక్‌లో ఈ విమానం ఆగింది. ఈ విషయాన్ని డాన్ మ్యూయాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులు ధ్రువీకరించారు. పసిఫిక్ సముద్రంలోని నార్తర్ మరియానా ద్వీపానికి అతనిని తీసుకెళుతున్నారని, అక్కడే కోర్టులో హాజరు పరుస్తారని పేర్కొన్నారు. ఇలావుంటే, ఈ కేసులో, అసాంజేకు సహకరించి, రికార్డులను, కీలక పత్రాలు అందించిన అమెరికా సైన్యంలో అనలిస్టుగా పని చేసిన చెల్సియా మానింగ్‌ను దోషిగా తేల్చిన కోర్టు 35 సంవత్సరాల శిక్ష విధించింది. 2017లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఆమెకు క్షమాభిక్ష పెట్టారు. రక్షణ శాఖకు సంబంధించిన అత్యంత రహస్యమైన, కీలకమైన డాక్యుమెంట్లను బహిర్గతపరచడం వల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడిందని పేర్కొంటూ, గూఢచర్యానికి పాల్పడిన అసాంజేపై కఠినంగా వ్యవహరించాలని కోర్టును కోరింది. అయితే, మారిన పరిస్థితుల నేపథ్యంలో, ఇప్పుడు అతనికి క్షమాభిక్ష పెట్టడానికి అమెరికా సిద్ధంగా ఉం దని అంటున్నారు. కోర్టులో అసాంజే తన తప్పును ఒప్పుకొని, క్షమాపణ చెప్పుకుంటే, అతని విడుదలకు అవకాశం ఉంటుందని నమ్మబలుకుతున్నారు. కానీ, అమెరికా తన మాటకు కట్టుబడి ఉంటుందా అన్నది అనుమానమే.

## హైకోర్టుకు కెసిఆర్ (మొదటి పేజీ తరువాయి)

విచారణను ప్రారంభించి, తెలంగాణ విద్యుత్తు సంస్థలకు చెందిన దాదాపు 25 మంది అధికారులను, మాజీ అధికారులను విచారించింది. దీంతో పాటు అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కూడా ఈనెల 15వ తేదీలోపు వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కెసిఆర్ 12 పేజీల సుదీర్ఘ లేఖను ఈ నెల 15వ తేదీన కమిషన్‌కు పంపించారు.

## రైతు భరోసా ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

పథకాన్ని తీసుకొస్తుందని, పెట్టుబడి సహాయం కూడా ఏడాదికి ఎకరానికి రూ.5 వేల చొప్పున పెంచుతున్నామని చెప్పారు. అయితే రైతుబంధు తరహాలో ప్రజాధనం వృధాకాకుండా ఉండేందుకు పటిష్ట విధానాలను రూపొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తుందని తెలిపారు. గతంలో సాగులో లేని భూములకు కూడా రైతుబంధు వర్తింపచేయడం ద్వారా 12 విడ తలలో దాదాపు రూ.25,670 కోట్ల ప్రజాధనం వృధా చేశారని, 93శాతం వాటా ఉన్న సన్న, చిన్నకారు రైతులవాటా రైతుబంధు మొత్తంలో 68శాతం కూడా లేదని తెలిపారు. అంతేకాకుండా 17.5 శాతం ఉన్న కౌలురైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసారని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాకు సంబంధించి ఎటువంటి విధానపరమైన నిర్ణయాలు ఇంకా తీసుకోలేదని, పూర్తిగా అందరి అభిప్రాయా లు తీసుకుని శాసనసభలో చర్చించిన అనంతరం పథకాన్ని తీసుకొస్తామని, ఆలస్యమైన కూడా అర్హులకు మాత్రమే అందే విధంగా రూపకల్పన చేస్తామని రైతులకు మంత్రి వివరించారు. రైతునేస్తం కార్యక్రమంలో రైతులు వెల్లడించిన అభిప్రాయాలు, సూచనలను రాతపూర్వకంగా సేకరించిన అన్నింటిని క్రోడికరించి, ఒక నివేదిక రూపొందించాలని డైరెక్టర్ గోపిని మంత్రి తుమ్మల అదేశించారు. కార్యక్రమంలో ప్రణాళికసంఘ ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, అఖిలభారతకిసాన్ ఉపాధ్యక్షులు ఎం.కొదండరెడ్డి, రైతుసంఘ నాయకులు అన్వేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ, ఉద్యానశాఖ డైరెక్టర్లు, కలెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారం (మొదటి పేజీ తరువాయి)

మొదటగా కాంగ్రెస్ ఎంపి శశికాంత్ సెంథిల్ ప్రమాణ స్వీకారం చేయగా.. ఆ తర్వాత కాంగ్రెస్, డిఎంకె సహా కూటమికి సంబంధించిన ఎంపిలు ప్రమాణ స్వీకా రం చేశారు. ఈ ప్రమాణ స్వీకారంలో భాగంగా క్రిష్ణగిరి కాంగ్రెస్ ఎంపి గోపీనాథ్ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యాంగం ప్రతిని చేతిలో పట్టుకొని ఆయన తెలుగులో ప్రమాణ స్వీకారం చేశాడు. చివర్లో తమిళంలో థాంక్యూ.. జై తమిళనాడు.. అని మాట్లాడారు.

**రాజ్యాంగం ప్రతిని చేతితో పట్టుకుని ఎంపీగా రాహుల్ ప్రమాణం**

మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత, రాయ్‌బరేలీ ఎంపి రాహుల్‌గాంధీ ప్రమాణం చేశారు. ఆయన పేరు పిలవగానే.. సహచర ఇండియా కూటమి ఎంపిలంతా బల్లలు చరిచి మద్దతు పలికారు. ఇక రాహుల్ ప్రమాణం చేసే ముందు రాజ్యాంగం ప్రతిని చేతితో పట్టుకుని కొద్దిసేపు ప్రదర్శనగా చూపించారు. అనంతరం ప్రొటెం స్పీకర్.. రాహుల్‌చే ప్రమాణం చేయించారు. ప్రమాణం పూర్తి కాగానే జై రాజ్యాంగం అంటూ నినాదం చేశారు. ఇండియా కూటమి ఎంపిలంతా ఇదే రీతిలో రాజ్యాంగం ప్రతిని చేతితో పట్టుకుని ప్రమాణం చేయడం విశేషం.

## విడుదల చేయండి (మొదటి పేజీ తరువాయి)

ఆ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఎన్‌హెచ్ఎం కింద చేపట్టిన మౌలిక వసతులు, నిర్వహణ కాంపోనెంట్ కింద 20232024 సంవత్సరానికి సంబంధించి రావల్సిన రూ.231.40 కోట్లు తక్షణమే రీయింబర్స్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్ ఎం సంబంధించి కేంద్రం నుంచి రావల్సిన నిధులు ఆలస్యం కావడంతో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం,సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ఉండేలా రాష్ట్ర వాటాతో పాటు కేంద్రం నుంచి రావల్సిన వాటా మొత్తాన్ని 2023, అక్టోబరు నుంచి తామే విడుదల చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి నడ్డా దృష్టికి తీసుకెళ్లారు.

## సిఎం బిజీ బిజీ

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరంలో బిఎల్‌సి మోడల్‌లో తెలంగాణకు 2.70 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఇతర నగరాలైన వరంగల్, కరీంనగర్ సమస్యలపైనా కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించి స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితిని 2025 జూన్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో మూసీ రివర్ ఫ్రంట్‌కు, మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సిఎం రేవంత్‌రెడ్డి కలిసి హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, ఇతర అవసరాలకు రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని, వరంగల్ సైనిక్ స్కూల్ అనుమతుల గడువు పునరుద్ధరించాలని కోరారు. మంగళవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్‌ప్రకాష్ నడ్డాను సిఎం రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు రావాల్సిన ఎన్‌హెచ్ఎం రూ.693.13 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరారు.

ఇదిలా ఉండగా, పార్టీ సంస్థాగత విషయాలపై కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే, అగ్ర నాయకులు రాహుల్ గాంధీలను రేవంత్‌రెడ్డి కలిసి టిపిసిసి కొత్త అధ్యక్షుడి వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్ పదవులు, పార్టీ బలోపేతం తదితర చర్చించారు. కాగా పార్లమెంట్‌లో ఎఐసిసి అగ్రనేత సోనియాగాంధీ, రాష్ట్ర ఇన్‌చార్జ్ కె.సి.వేణుగోపాల్, పార్టీ యువ నాయకురాలు ప్రియాంక గాంధీ తదితరులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, పార్టీ పరిస్థితి తదితర అంశాలను రేవంత్‌రెడ్డి వారికి వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజుల పర్యటన ముగించుకుని మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

## కేంద్రం ఆటలు

(మొదటి పేజీ తరువాయి)

జరిగే పోరాటాలలో తాము పాల్గొంటామని తెలిపారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, రైల్వే ప్రొడక్షన్ యూనిట్లు, బ్యాంకులు సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న చర్యలను ఎఐటియుసి నిరంతరం వ్యతిరేకిస్తుందన్నారు. కొవిడ్ సమయంలో 41 డిఫెన్స్ ప్రొడక్షన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను కార్పొరేటీకరించాలనే కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించామని గుర్తు చేశారు. డిఫెన్స్ ఫ్యాక్టరీ కార్పొరేటీకరణ తరువాత ఉద్యోగులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అమర్‌జీత్ కౌర్ తెలిపారు. కారుణ్యనియామకాలు సహా అన్ని నియామకాలను నిలిపివేశారని, 30వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కొత్తగా ఏర్పాటైన ఏడు కార్పొరేషన్‌ల ద్వారా పరిమిత కాలం కాంట్రాక్టు నియామక విధానాన్ని అమలులోకి తీసుకువస్తున్నారని విమర్శించారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ పాఠశాలలో పిల్లల అడ్మిషన్‌లను నిలిపివేశారని, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఆసుపత్రులలో ఔషధాలు, వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది లేరని వివరించారు. వీటిపై పోరాడుతున్న ఎఐడిఇఎఫ్‌కు అండగా నిలుస్తామని తెలిపారు.

## ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

వాగ్వాదంతో చర్చలు ముగిశాయి. డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించడంతో తాము సమావేశాన్ని వాకౌట్ చేసినట్లు కెసి వేణుగోపాల్ చెప్పారు. బిర్లాకు వ్యతిరేకంగా తాముకూడా స్పీకర్ పదవికి అభ్యర్థిని నిలబెడుతున్నట్లు ప్రకటించారు. కాగా, షెడ్యూల్ ప్రకారం బుధవారం స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. ఒకవేళ ఎన్నిక జరిగితే లోక్‌సభ చరిత్రలోనే ఇది మూడవసారి అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఎన్‌డిఎ కూటమికి 293 ఎంపిలు, ఇండియా కూటమికి 233 మంది సభ్యులు ఉన్నారు. ముగ్గురు స్వతంత్ర సభ్యులు ప్రతిపక్షాలకు మద్దతిస్తున్నారు. రాహుల్ గాంధీ వాయనాడ్ స్థానానికి రాజీనామా చేయడంతో ప్రస్తుతం పార్లమెంట్‌లో 542 మంది సభ్యులు ఉన్నారు. బుధవారం లోక్‌సభలో ఓట్ల విభజన జరిగితే, కొత్త లోక్‌సభలో సభ్యులు తమ సీట్లను కేటాయించే ప్రక్రియలో ఉన్న ఎలక్ట్రానిక్ సిస్టమ్ ఇంకా పనిచేయనందున పేపర్ స్లిప్‌లు ఉపయోగించబడతాయి. స్పీకర్ పదవి కోసం ఏకాభిప్రాయం కుదుర్చేందుకు కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను బిజెపి రంగంలోకి దించింది. మంగళవారం ఉదయం నుంచి ఆయన మల్లికార్జున్ ఖర్గే, ఎంకె స్టాలిన్ సహా పలువురు ఇండియా కూటమి నేతలతో వరుస చర్చలు జరిపారు. స్పీకర్ పదవి ఏకగ్రీవమయ్యే సంప్రదాయాన్ని కొనసాగిద్దామని, అందుకు సహకరించాలని కోరారు. ఇందుకు ప్రతిపక్షాలు అంగీకరించినప్పటికీ.. ఉపసభాపతి పదవి కావాలన్న డిమాండ్ మళ్లీ ముందుంచాయి. కానీ, దీనికి ఎన్‌డిఎ సర్కారు సమ్మతించలేదు. దీంతో ప్రతిపక్షాలు పోటీకి దిగాయి. నామినేషన్ గడువు ముగియడానికి కేవలం కొన్ని నిమిషాల ముందు ఎన్‌డిఎ, ఇండియా కూటమి అభ్యర్థులు తమ పత్రాలను సమర్పించారు. ఫలితంగా స్పీకర్ పదవికి ఎన్నిక అనివార్యమైంది. బుధవారం (జూన్ 26) ఈ ఎన్నిక నిర్వహించనున్నారు. గెలుపోటములు ముఖ్యం కాదని, స్పీకర్ అధికార పక్షం నుంచి, ప్రతిపక్షం నుంచి డిప్యూటీ స్పీకర్‌గా ఉంటారని సురేశ్ అన్నారు. 'గత రెండు లోక్‌సభల్లో, మీరు ప్రతిపక్షంగా గుర్తింపు పొందలేదని వారు మాకు డిప్యూటీ స్పీకర్ పదవిని నిరాకరించారు. ఇప్పుడు మేము ప్రతిపక్షంగా గుర్తించబడ్డాం. డిప్యూటీ స్పీకర్ పదవి మా హక్కు. కానీ వారు మాకు ఇవ్వడానికి సిద్ధంగా లేరు. మేము ప్రభుత్వం నుండి సమాధానం కోసం ఎదురు చూస్తున్నాము, కానీ వారు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు, అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ దేశాన్ని నడిపించడంలో ప్రధాని ఏకాభిప్రాయాన్ని సమర్థించిన 24 గంటలకే ఇది జరిగిందని అన్నారు. స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతోపాటు డిప్యూటీ స్పీకర్ పదవి విపక్షాలకే దక్కుతుందని రమేశ్ అన్నారు. ఈసంప్రదాయాన్ని మోదీ తుంగ లో తొక్కారని ఆరోపించారు. బిర్లా అభ్యర్థిత్వానికి మద్దతుగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు షా, సింగ్, నడ్డా, బిజెపి మిత్రపక్షాలైన టిడిపి, జెడి (యు), జెడి సభ్యులుసహా 10కిపైగా నామినేషన్లు దాఖలయ్యాయని వర్గాలు తెలిపాయి. సురేష్‌కు మద్దతుగా మూడు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి.

## టెన్షన్ పడొద్దు..ఆగండి

(మొదటి పేజీ తరువాయి)

మంది ఎంఎల్ఎలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, గతంలో తరహా బిఆర్ఎస్ఎల్‌పిని సిఎల్‌పిలో విలీనమం అవుతుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఇదే జరిగితే బిఆర్ఎస్‌లో ఉన్న మిగతా ముఖ్యనేతలు కూడా పార్టీ వీడే అవకాశాలు ఉంటాయని బిఆర్ఎస్ అధినేత వెంటనే అప్రమత్తమయ్యారు. ఎర్రవెల్లి వేదికగా ఎంఎల్ఎలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో సిట్టింగ్ ఎంఎల్ఎలకు పార్టీని వీడకూడదని, బిఆర్ఎస్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని కెసిఆర్ భరోసా ఇచ్చినట్టు తెలిసింది. ముఖ్యంగా పార్టీ మారే ఎంఎల్ఎలపై అనర్హత వేటు పడుతుందని, పార్టీ ఫిరాయింపుల చట్టం ఆశమాషిగా లేదని,కఠినంగా అమలు అవుతుందని బుజ్జగిస్తున్నట్టు సమాచారం. బిఆర్ఎస్‌ను వీడిన ఎంఎల్ఎలపైన అనర్హత వేటు పడుతుందని, త్వరలోనే దానం నాగేందర్‌పైన అనర్హత వేటుపడే అవకాశాలు ఉన్నాయని కెసిఆర్ చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. పార్టీ మారిన ఎంఎల్ఎలపై అనర్హత వేటు పడేలా బిఆర్ఎస్ న్యాయ పరంగా చర్యలు తీసుకుంటున్నామని, ఒక వేళ స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని బిఆర్ఎస్ చెబుతున్నది.

**టెన్షన్ పడొద్దు...మూడు నెల్లు ఆగండి**

బిఆర్ఎస్ ఎంఎల్ఎలు టెన్షన్‌కు పడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు ఆగితే ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల మరింత వ్యతిరేకత వ్యక్తం అవుతుందని కె కెసిఆర్ చెప్పినట్టు తెలిసింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో సాధ్యమయ్యే పనికాదని బిఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైన కెసిఆర్‌కు పూర్తి అవగాహన ఉన్నదని, ఆర్థిక వనరులను సేకరించడం అంత సులువైన పని కాదని ఆ పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. ప్రజా వ్యతిరేకత వస్తే మళ్లీ బిఆర్ఎస్‌కు అవకాశం ఉంటుందని, ప్రస్తుతం పార్టీలో ఉంటున్న వారికి మంచి అవకాశాలు ఉంటాయని ఎంఎల్ఎలు, ముఖ్యనేతలకు ఆ పార్టీ అధినేత భరోసా ఇస్తున్నట్టు సమాచారం.

**కెసిఆర్‌తో సమావేశమైన ఎంఎల్ఎలు వీరే:**

ఎర్రవెల్లిలో కెసిఆర్‌తో సమావేశమైన వారిలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుతో పాటు ఎంఎల్ఎలు వేముల ప్రశాంత్ రెడ్డి, కెపి.వివేకానంద, అరికెపూడి గాంధీ, మాగంటి గోపినాథ్, మాధవరం కృష్ణారావు, ముఠాగోపాల్, టి.ప్రకాష్‌గౌడ్, ఎంఎల్‌సిలు శేరిసుభాష్‌రెడ్డి, దండేవిఠల్, మాజీ ఎంఎల్ఎ జోగురామన్న, నాయకులు క్యామ మల్లేష్,రావుల శ్రీధర్‌రెడ్డి ఉన్నారు. అయితే పార్టీ ఫిరాయించే అవకాశాలు ఉన్న ఎంఎల్ఎలు, ముఖ్యనేతలు, మాజీ మంత్రులతో కూడా కెసిఆర్ ఫోన్‌లో మాట్లాడినట్టు తెలిసింది.గంగుల కమలాకర్, గండ్ర వెంకట రమణారెడ్డి తదితరులతో కూడా కెసిఆర్ మాట్లాడారు. అయితే గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన మరి కొంత మంది ఎంఎల్ఎలు సమావేశానికి గైర్హాజరయ్యారా? లేదా వారిని ఆహ్వానించలేదా అనేది చర్చనీయంశంగా మారింది.

# రైతుభరోసాపై ప్రజాభిప్రాయం

(మొదటి పేజీ తరువాయి)

సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. పంటల బీమాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు, రానున్న సీజన్‌కు పంటల బీమాకు సంబంధించి పిలవాల్సిన టెండర్లపై చర్చించారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల్లో ఉన్న వ్యవసాయ కళాశాలలు, ఇప్పటికీ కళాశాలలు లేని జిల్లాల వివరాలను డిప్యూటీ సిఎం సమావేశంలో తీసుకున్నారు. సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలపై ఆరా తీశారు. వ్యవసాయ కళాశాలలో విత్తన అభివృద్ధి తీరుపై చర్చించారు. రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామని, అయితే వ్యవసాయం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సిఎం తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే ఉత్పత్తులు పెరిగి రాష్ట్ర ఖజానాకు, రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్ర ఖజానాకు అత్యధిక ఆదాయం సమకూర్చే రంగాలు, ప్రభుత్వం తదితర రంగాలపై చేస్తున్న ఖర్చులను డిప్యూటీ సిఎం అధికారుల ద్వారా విచారించారు. డ్రిప్ ఇరిగేషన్‌కు నిధులు కేటాయిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయిల్ ఫామ్ సాగులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలపై చర్చించారు. రాష్ట్రంలో అమల్లో ఉన్న నేతన్న చేయూత, నేతన్న బీమా పథకాలు ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర విభజన తర్వాత చేనేత కార్మికుల జీవితాల్లో వచ్చిన మార్పులపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు అధికారులు విచారించారు. సిరిసిల్ల కోఆపరేటివ్ సొసైటీ, టెక్స్‌టైల్ వ్యాపారస్తులు ప్రభుత్వం నుంచి ఏ పద్ధతిలో ప్రయోజనం పొందుతున్నారనే వివరాల ను అధికారులు సమావేశంలో వివరించారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ రామకృష్ణారావు, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు, ఆర్థికశాఖ అడిషనల్ సెక్రెటరీ హరిత, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**రామగుండంలో ఆధునిక థర్మల్ పవర్ ప్లాంట్**

రామగుండంలో కొత్తగా 800మెగావాట్ల ఆధునిక థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించి ఎన్నికల హామీని పూర్తి చేస్తామని, పాతది 62.7 మెగావాట్ల ప్లాంట్‌కు ఇది అదనం అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లక్ష్మ ణ్, ఎంఎల్ఎలు ప్రేమ్ సాగర్ రావు, రాజ్ ఠాగూర్ సింగ్, ఆది శ్రీనివాస్, విజయ రమణారావు తదితరులు డిప్యూటి సిఎంను కలిసి పలు అంశాలను ప్రస్తావించారు. స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు, రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధిగమించేందుకు రామగుండంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో థర్మల్ పవర్ స్టేషన్ నిర్మించాలని సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హామీని పూర్తిచేయాలని డిప్యూటి సిఎంను కోరారు. ఇందుకు డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నిజాంకాలంలో నిర్మించిన చారిత్రాత్మకమైన రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌ను తిరిగి నిర్మిస్తామన్నారు. పిట్ హెడ్ ప్లాంటును సింగరేణి ఆధ్వర్యంలో నిర్మించేందుకు చర్యలు చేపడతామని డిప్యూసి సిఎం భట్టి ఈ సందర్భంగా వారికి స్పష్టం చేశారు.

## జూనియర్ డాక్టర్ల సమ్మె మరింత ఉధృతం



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల సమ్మె మరింత ఉధృత్తమైంది. 8 ప్రధాన డిమాండ్లతో చేపట్టిన నిరవధిక సమ్మె రెండవ రోజు మంగళవారం కొనసాగింది. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఇది వరకే జూడాలు ప్రకటించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జూనియర్ డాక్టర్లకు రక్షణ కల్పించడంతో పాటు శిక్షణ భృతి సకాలంలో అందించాలని, ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవన నిర్మాణం తదితర ప్రధాన డిమాండ్లను జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధుల ప్రభుత్వం ముందు పెట్టారు. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం సమ్మె మొదటి రోజు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, డిఎంఈ తో జూనియర్ డాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ చర్చలు విఫలం కావడంతో జూనియర్ డాక్టర్లు మంగళవారం సమ్మెను యధాతథంగా కొనసాగించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం కనీసం స్పందించలేదని, దీంతో తప్పని పరిస్థితుల్లో నిరవధిక సమ్మె చేపట్టినట్లు జూనియర్ డాక్టర్లు తెలిపారు. ఒపీ సేవలు, సర్జరీలు, వార్డ్ సేవలను నిలిపివేస్తున్నామని, ప్రస్తుతానికి అత్యవసర సేవలు యధావిధిగా కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు. కోఠి మెడికల్ కళాశాల ముందు జూనియర్ డాక్టర్లు ఆందోళన కొనసాంచారు. జూనియర్ డాక్టర్ల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలకు అంతరాయం కలగకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయడంతోపాటు వైద్యుల సెలవులను రద్దుచేశారు. తాజా పరిస్థితులపైన జూడాలు మరోసారి సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

## 'సైనిక్‌స్కూల్'ను పట్టించుకోలేదనడం అబద్ధం : వినోద్‌కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్: సైనిక్ స్కూల్‌ను కెసిఆర్ పట్టించుకోలేదని సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడ డం విడ్డూరమని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఢిల్లీలో రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్‌తో సిఎం రేవంత్ రెడ్డి కలిసిన తర్వాత గోబెల్స్ తరహాలో మాట్లాడారని మండిపడ్డారు. ఇక నుంచి రేవంత్ రెడ్డి అబద్ధాలకు తాము ధీటుగా సమాధాన మిస్తామన్నారు.హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపి బడుగుల లింగయ్యయాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ సైనిక్ స్కూల్ కోసం కెసిఆర్ కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారని,అప్పటి రక్షణ మంత్రి మనోహర్‌ను అనేక సార్లు కలిశామని, దివంగత అరుణ్ జైట్లీ ని కూడా బిఆర్ఎస్ ఎంపిలు కూడా చాలా సార్లు కలిసిన విషయాన్ని వినోద్ కుమార్ వివరించారు. రక్షణశాఖ ఆధ్వర్యంలో సైనిక్‌స్కూల్స్‌ను ఇక ముందు నడపలేమని కేంద్రం విధానపరమైన నిర్ణయం తీసుకున్నందువల్లే ఇబ్బందులు ఏర్పాడ్డాయని వివరించారు. అసలు కెసిఆర్ సైనిక్ స్కూల్ గురించి మాట్లాడలేదనడం పచ్చి అబద్దమన్నారు. సైనిక్‌స్కూల్‌కు భూమితో సహా సిబ్బంది జీత భత్యాలు ,రోజు వారీ వ్యయం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని రక్షణ శాఖ షరతులు విధిస్తే, వాటిని సడలించాలని కెసిఆర్ కేంద్రానికి అనేక సార్లు లేఖ రాశారన్నారు. రక్షణ శాఖ భూముల అంశంపైన కూడా కెసిఆర్ చేసిన ప్రయత్నాలు రికార్డుల్లో ఉన్నాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి సమయం ఉంటే అప్పటి డిఫెన్స్ అధికారి జె ఆర్ కె రావు తో మాట్లాడి,వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. నీట్ తో తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై సిఎం రేవంత్ దృష్టి సారించాలని, దీనిపైన సుప్రీం కోర్టులో ఒక మంచి న్యాయవాదిని నియమించి, రాష్ట్రం తరపున కొట్లాడాలని వినోద్ కుమార్ సూచించారు.

## రవాణా శాఖలో మరింత మెరుగైన సేవలకు వివిధ రాష్ట్రాల్లో అధికారుల స్టడీ టూర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రవాణా శాఖలో మరింత మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రవాణా శాఖలో అధునాతన సాంకేతిక టెక్నాలజీ వినియోగించుకునేందుకు గాను వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న బెస్ట్ పాలసిపై రవాణా శాఖ అధికారుల ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లో స్టడి టూర్ కొనసాగుతుంది. ముఖ్యంగా కేరళ,కర్ణాటక ,మహారాష్ట్ర , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాను అధ్యాయనం చేసేందుకు నాలుగు బృందాలు అధికారులు పర్యటిస్తున్నారు. ఒక డీటీసి, ఆర్టీవో, ఎంవిఐలు ఒక్కో బృందంగా ఏర్పడి ఆయా రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తున్నారు. ఈ బృందాలు వివిధ రాష్ట్రాలోని రవాణా శాఖ కార్యాలయాల్లో వివిధ విభాగాల్లో వాడుతున్న సాంకేతిక టెక్నాలజీ ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్,వెహికిల్ టారిఫ్ ,వెహికిల్ ట్రాకింగ్,వెహికిల్ రిజిస్ట్రేషన్, వెహికిల్ ఫిట్నెస్, డ్రైవింగ్ టెస్టింగ్ , లైసెన్స్ ఇష్యూయింగ్ , సీఎస్సీ, ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీ,రోడ్డు భద్రత పై అవగాహన తదితర వాటికి ఉపయోగిస్తున్న అధునాతన సాంకేతిక టెక్నాలజీలపై తమ అధ్యయాన్ని కొనసాగిస్తున్నారు. ఉత్తమ విధానాలను రాష్ట్రంలో అమలు చేస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ రాష్ట్రాలోని రవాణా శాఖల్లో అమలవుతున్న విధానాలపై అధికారులు అధ్యయనం వాటిలోఅత్యుత్తమ విధానాలను తెలంగా ణలో అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. .వీటితో పాటు ఒక్కో రాష్ట్రంలో ఒక్క రకమైన పన్నుల వ్యవస్థను కలిగి ఉందని, ఆదాయ మార్గాలను పెంచుకోవడానికి ఆయా రాష్ట్రాల్లో ఉపయోగిస్తున్న మార్గాలు, అక్కడ అమలవుతున్న వాటిలో మంచి టాక్సేషన్ ఇక్కడ అమలయ్యేలా చూస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఇ యు

ప్రజాపక్షం / హైదరాబాద్ : టిజి ఆర్‌టిసిపై కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని, తమ సమస్యలను ఎప్పుడు పరిష్కరిస్తారో చెప్పాలని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఇ. వెంకన్న కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజే గత నియంత పాలన అంతమైందని, నేటి నుండి ప్రజాపాలన ప్రారంభించామని చెప్పిన ప్రభుత్వం ఆర్‌టిసిలో ప్రజాపాలనను ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఆర్‌టిసి సంస్థ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి అసెంబ్లీ సమావేశాలకు ముందే ఇచ్చిన హామీలపై సమీక్ష జరిపి ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి, ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని, 2013 బాండ్ల బకాయిల డబ్బులను అన్ని కేటగిరీలకు తక్షణమే చెల్లించాలని, మహాలక్ష్మి పథకం క్రింద ఆర్‌టిసికి ప్రతినెల 350 కోట్ల చొప్పున చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. గత 4 నెలల నుండి ప్రభుత్వం నుండి రావాల్సిన సదుపాయాలు రాక పోవడం వలన ఆర్‌టిసి సంస్థ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆ నాలుగు నెలల నుండి ఇవ్వవలసిన నిధులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అంతే కాకుండా 2021 వేతన సవరణ ప్రక్రియను తక్షణం ప్రారంభించాలని, అప్పటి వరకు 25 శాతం ఐ.ఆర్ ప్రకటించాలని, కార్మికులపై మోపిన అధిక పనిభారాల్ని తగ్గించి ఎంటిడబ్ల్యు యాక్ట్ ప్రకారం అన్ని డిపోలలో డ్యూటీ ఛార్టుల్లో మార్పులు చేయాలని, రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచి అన్ని కేటగిరీలలో నూతన నియామకాలు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా గత 10 ఏళ్లుగా ఆర్‌టిసి సంస్థను విధ్వంసం చేసిందని, కార్మికుల హక్కులను కాలరాసేందుకు ట్రేడ్ యూనియన్లనూ రద్దు చేసిందని అన్నారు. అలాంటి పాపిష్టి పాలన పోవాలనే ఆర్‌టిసి కార్మిక వర్గం కోరుకుందన్నారు. ఈ క్రమలోనే నూతన ప్రభుత్వం వస్తే ఆర్‌టిసి సంస్థను బలోపేతం చేస్తుందని, కార్మికుల హక్కులను కాపాడుతుందని, యూనియన్లను తిరిగి పునరుద్ధరిస్తారని భావించామన్నారు. అలా ఒక ఆశా భావంతో నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి ఆర్‌టిసి కార్మిక వర్గం , వారి కుటుంబాలు కూడా సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అయితే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల్లో గెలిచిన తరువాత ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్.బాబు, ఇ. వెంకన్న అన్నారు. టిజి ఆర్‌టిసిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పిన ప్రభుత్వం రెండు నెలలు గడుస్తున్నా ఇంకా సమీక్ష చేయక పోవడం సరికాదన్నారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణ సమాజమే లక్ష్యం

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రజాపక్షం/హైదరాబాద్: డ్రగ్స్ రహిత తెలంగాణ ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్‌లో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ అవగాహనపై పాటను ఆయన విష్కరించారు. అనంతరం జెండా ఊపి విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. మారకద్రవ్యాల రవాణాలో ఎంతటి పెద్ద వారు ఉన్న ఉపేక్షించం, ఉక్కు పాదంతో అణచివేస్తాం అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా కనబడడానికి వీలులేదని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కఠిన నిర్ణయం తీసుకొని ముందుకు వెళ్తున్నాం అని తెలిపారు.రాష్ట్రంలో అక్రమ రవాణా, డ్రగ్స్ నివారణకు ఎన్ని నిధులైన కేటాయిస్తాం బడ్జెట్ సమస్యనే కాదు తెలిపారు. దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్సును సమూలంగా నివారించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ వ్యవస్థ చాలా బలమైనది తెలివైనది ఎంత దూరం వెళ్లి నిందితులను పట్టుకునే శక్తి సామర్థ్యాలు ఉందని స్పష్టం చేశారు. సంఘవిద్రోహ శక్తులు, అక్రమ పద్ధతిలో డబ్బు సంపాదించడానికి కొందరు దుర్మార్గులు అలవాటు చేసే డ్రగ్స్ ఉచ్చులో పడి యువత బంగారు భవిష్యత్తును కోల్పోవద్దుని హితవు పలికారు. అన్ని గ్రామాల్లో మాదకద్రవ్యాల నిరోధక కమిటీలు వేసి పోలీసులు సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకుంటే కట్టడి చేయడం పెద్ద సమస్య ఏమి కాదుని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి రవిగుప్తా, యాంటీ నార్కోటిక్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, ఐఎ ఎస్ అధికారి వాకటి కరుణ పాల్గొన్నారు.

## న్యాయవాదులతో పిపి, ఎపిపి పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు

ఎఐసిసి లీగల్ సెల్ జాతీయ కో ఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ ప్రాసిక్యూటర్ల నియమకంలో న్యాయవాదులకు అన్యాయం చేస్తూ పోలీసుల ప్రాసిక్యూట్ అధికారుల ద్వారా చేపట్టిన నియామకాన్ని ప్రభుత్వం నిలిపివేసిందని ఎఐసిసి లీగల్ సెల్ జాతీయ కో ఆర్డినేటర్ సి. దామోదర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గాంధీ భవన్‌లో రాష్ట్ర లీగల్ సెల్ వైస్ ఛైర్మన్లు శశికాంత్, రావుల చెన్నారెడ్డి ,మాజీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ గ్రేడ్1 అధికారుల నుంచి పిపి పోస్టులు, గ్రేడ్ 2 పోస్టుల నుంచి ఎపిపి పోస్టుల భర్తీకి ఇన్ సర్వీస్‌నుంచి నియమించాలన్న ప్రతిపాదనలు తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు సిఎం చీఫ్ సెక్రటరీ శేషాద్రి, హోం సెక్రటరీ జితేందర్‌లను కలిసి తమ సమస్యను వివరించడం జరిగిందని దీనిపై వారు సానుకూలంగా స్పందించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదులకు అన్ని కోర్టుల్లో పిపి, ఎపిపి పోస్టుల సంబంధించి 50 నుంచి 60 శాతం భర్తీ చేయాలని, ఇందుకు సిఆర్‌పిసి సెక్షన్ 24/4 ప్రకారం జిల్లా కలెక్టర్ల నుంచి ప్యానల్ తెప్పించుకుని ప్రభుత్వ నియామకాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా సమన్వయం చేయాల్సిన ప్రధాన విధి అన్నారు. అయితే ఇందుకు డైరెక్టర్ ఆఫ్ ప్రాసుక్యూషన్ విరుద్దంగా వ్యవహించడంతో తాము ప్రభుత్వాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని చెప్పారు. దీంతో ప్రభుత్వం పిపి, ఎపిపి పోస్టుల భర్తీ న్యాయవాదులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుందని దామోదర్‌రెడ్డి వెల్లడించారు.

## నలుగురు ఎంఎల్‌ఎలు పోయినంత మాత్రాన బిఆర్ఎస్ బలహీనపడదు

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: నలుగురు ఎంఎల్‌ఎలను పార్టీలో చేర్చుకోవడం ద్వారా బిఆర్ఎస్‌ను బలహీనపర్చగలమని అనుకుంటే పొరపాటేనని బిఆర్ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపి బడుగుల లింగయ్యయాదవ్, అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు నెలలుగా ఫించన్లు అందడం లేదని, రైతుబంధు ఎప్పుడిస్తారని రైతులు అడుగుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఐదు ఎకరాలలోపు రైతులు ఎవరికీ రూ. 2 లక్షల రుణాలు లేవని, ఈ విషయమై బ్యాంకు అధికారులే చెబుతున్నారని, రూ.2 లక్షల రుణం కావాలంటే రైతుకు కచ్చితంగా ఐదు ఎకరా ల నుండి 10 ఎకరాలు ఉండాలని నిరంజన్ రెడ్డి వివరించారు. గ్రామాలు, మండలాల వారీగా రైతులు తీసుకున్న రుణాల వివరాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే రెండు పంటలు పోయాయయని, వడ్లకు రూ.500 బోనస్ ఇస్తారా?, లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారని, కానీ ఇప్పుడు రేషన్ కార్డులను రద్దు చేసి, పథకాలను కుదించే ప్రయత్నాల్లో ఉన్నారని ఆరోపించారు. రుణమాఫీ చేయకుండానే సంబరాలు చేయడం దారుణమన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థులకు పది పూర్తయితే రూ.10 వేలు, ఇంటర్ పూర్తయితే రూ.15 వేలు, డిగ్రీ పూర్తయితే రూ.25 వేలు,పిజి పూర్తయితే రూ. లక్ష, ఎంఫిల్, పిహెచ్‌డి పూర్తిచేస్తే రూ.5 లక్షలు ఇస్తామని చెప్పారని, ఇప్పటి వరకు ఒక్కరికైనా ఇచ్చారా అని నిలదీశారు. మోదీ దెబ్బకు దేశంలో ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ చతికిల బడిందని, చివరలో రాహుల్ పాదయాత్రతో కొంచెం లేచి నిలబడిందని, మోదీ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా విడిపోవడానికి కారణమే కాంగ్రెస్ వైఫల్యమని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు.

## జూలై 8 నుంచి 10వరకు బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి

# కల్యాణమహోత్సవాలు

భక్తులకు ఇబ్బందులు కల్గకుండా భారీ ఏర్పాట్లు : మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి బోనాలు, కళ్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారంజూలై 8,9, 10 వ తేదీల్లో జరగనున్న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం ,ఉత్సవాల ఏర్పాట్లపై హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీ క్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైల జా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, వెస్ట్‌జోన్ డిసిపి విజయకుమార్, ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జూలై 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న అమ్మవారి కళ్యాణం, రథోత్సవం కార్యక్రమాలకు పటిష్ట ఏర్పాటు చేయాలన్నారు. అమ్మవారి కళ్యాణంతో పాటు దర్శనానికి వచ్చే ,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు క లగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుడి చుట్టుపక్కల సీసీ కె మెరాలు ఏర్పాటు చేయాలని ,గతంలో భారీకెడ్లు ఎత్తులో ఉండడం వల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తాయని ఈసారి భారీకెడ్ల ఎత్తు తగ్గించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు.. సూచిక బో ర్డులు , ఎమర్జెన్సీ ఎక్సిట్ గేట్లు , క్యులైన్ లలో భక్తులకు కొంత ప్లేస్ ఉండేవిధంగా ఏర్పాటు చేయడంతో పాటు వారికి తాగు నీటిని అందుబాటులో పెట్టాలన్నారు.గత బోనాల సమయంలో వివిఐపి పాసులు అధికంగా ఇవ్వడం వల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తాయని పోలీసులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈసారి ప్రతి గుడిలో వీవీఐపీ పాసులు తగ్గేలా దేవాదాయ శాఖ అధికారులు , సమన్వయం చేసుకోవాలని సూచించారు. మహిళా భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక షీ టీమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో రోడ్లలో ట్రాఫిక్ డైవర్షన్ చేసుకునేలా ట్రాఫిక్ పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా, పరిశుద్యం, మొబైల్ టాయిలెట్ల ఏర్పాట్లుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాల సందర్భంగా 500 మంది ప్రత్యేక కళాకారుతో వివిధ ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. భక్తులు అమ్మవారి కళ్యాణ తిలకించేందుకు ఎల్ఈడి స్క్రీన్ లు, దాదాపు కిలోమీటరు దూరం వరకు వినిపించే విధంగా మైక్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సనత్ నగర్ కాంగ్రెస్ ఇన్చార్జి కోటా నీలిమ , స్థానిక కార్పొరేటర్ , సరళ జీహెచ్ఎంసీ, పోలీస్ ,వాటర్ వర్క్స్, విద్యుత్ ,ఆర్ అండ్ బి ఇతర ముఖ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్‌పై ఇరిగేషన్ శాఖ నజర్

ఏడాదిలోపు వంద శాతం పూర్తయ్యే ప్రాజెక్టులేవి ?

ఎక్కువ ఆయకట్టు సాగుకు వచ్చే ప్రాజెక్టులు ఏవీ?

దేనికెంత ఖర్చుచేద్దామన్నదానిపై ఫోకస్

ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో 202425 ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూపకల్పనపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా శాఖల వారీగా బడ్జెట్ తయారీపై వివిధ శాఖలను, యంత్రాంగాన్ని ప్రభుత్వం సన్నద్ధం చేస్తోంది. దీంతో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు కూడా ఇందుకు అనుగుణంగానే ఆ దిశగా సన్నాహాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రాధాన్యత ప్రాజెక్టులు ఏవీ? 202425 వార్షిక సంవత్సరంలో ఏవి 100 శాతం పూర్తి అవుతాయి? ఆర్థిక వ్యయం పరంగా తక్కువ ఖర్చు అయ్యేవి ఏ ప్రాజెక్టులు ? ఎక్కువ ఆయకట్టు సాగుకు వచ్చే ప్రాజెక్టులు ఏవీ? వాటికి ఆర్థిక పరంగా అయ్యే ఖర్చు ఎంత ? వాటిని పూర్తి చేసే దిశగా ఇరిగేషన్ శాఖ పరంగా తీసుకోవాల్సిన చర్యలేంటీ? వంటి అంశాలపై మంగళవారం చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలు, ఇతర ఇంజనీర్లతో ఇరిగేషన్ శాఖ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ పాటిల్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఇదే సమావేశంలో వివిధ జిల్లాల్లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను, డివిజినల్ ఇంజనీర్లను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లైవ్‌లోకి తీసుకుని జిల్లాల వారీగా చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ అన్నారం సుందిళ్ల బ్యారేజీ మరమ్మతు పనులను ఆయన అడిగి తెలుసుకుంటున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యేలోగానే మరమ్మతు పనులు పూర్తి చేసే దిశగా ఇరిగేషన్ శాఖ అధికారులను ఆయన అప్రమత్తం చేస్తున్నారు.

**కొనసాగుతున్న ప్రాజెక్టులకు పెరగనున్న ఖర్చు**

మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు, నిజాంసాగర్, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్‌డిఎస్), శ్రీ రాం సాగర్, కడెం , సింగూరు ప్రాజెక్టుతో పాటు మూసీ ప్రాజెక్ట్ పూర్తి అయిన విషయం తెలిసిందే. కాగా మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో మరి కొన్నింటివి పనులు కొనసాగుతున్నాయి. వీటిలో కాళేశ్వరం ప్రాజెక్టు, ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్, లోయర్ పెన్‌గంగా, సమ్మక్క సాగర్, సీతమ్మ సాగర్ మల్లీ పర్పస్ ప్రాజెక్ట్ , ఎల్లంపల్లి శ్రీపాద సాగర్ ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ స్టేజ్ 2 ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం ఇరిగేషన్ శాఖ ద్వారా ఆరా తీస్తోంది. ఏ ప్రాజెక్టుకు గతంలో ఎంత వ్యయం చేశారు? ఈ సారి బడ్జెట్‌లో ఎంత అవసరం కావచ్చు? వాటిని పూర్తి చేయాలంటే ఇంకా ఎంత వ్యయం అవుతుంది? వంటి విషయాలను ప్రభుత్వం తెలుసుకుంటోంది.

## పోచారం,సంజయ్‌లపై స్పీకర్‌కు పిటిషన్ : జగదీష్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల అంశంలో హైకోర్టు తీర్పు తర్వాతనే, సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి తెలిపారు.తమ పార్టీ గుర్తుపైన గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌ల శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయాలని స్పీకర్‌కు పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌సి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సి తాతమధుతో కలిసి జగదీ ష్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పార్టీ ఫిరాయించిన వారితో పాటు పోచారం, సంజయ్‌లపై పిటిషన్ దాఖలు చేసేందుకు స్పీకర్‌ను సమయం కోరామని, బుధవారం సమాయం ఇస్తామని స్పీకర్ చెప్పినట్టు జగదీష్ రెడ్డి తెలిపారు. పదవిని కాపాడుకునేందుకే రేవంత్ రెడ్డి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పాంచ్ న్యాయ్ తీర్మానం ప్రకారం ఫిరాయింపులు ప్రోత్సహించవద్దని కాంగ్రెస్ ఎంఎల్‌సి జీవన్ రెడ్డి చెబుతున్నా రన్నారు. రాహుల్‌గాంధీ బిజెపిపైన దాడి చేస్తుంటే, రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి బిజెపికి తోకలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మోదీ విధానాలను రేవంత్‌ఫాలో అవుతున్నారన్నారు. విచారణ కమిషన్‌ను తాము వద్దు అని చెప్పడం లేదని, జస్టిన్ నర్సింహారెడ్డిని మాత్రమే తప్పించాలని కోరుతున్నా మన్నారు. విచారణలో అన్ని తేటతెల్లం అవుతాయని, కెసిఆర్ మల్లె పూవులా బయటకు వస్తారని జగదీష్ రెడ్డి అన్నారు.

## హైదరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సమస్యలను పరిష్కరించండి

అన్ని రకాల మందులను అందుబాటులో పెట్టాలి

నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో ఎఐవైఎఫ్ ప్రతినిధి బృందం సర్వే



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని,అన్ని రకాల మందులను పేషంట్లకు అందుబాటులో ఉంచాలని, డాక్టర్లు, నర్సులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎ ఐ వై ఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాంపల్లి ఏరియా ఆసుపత్రిని ఏ ఐ వై ఎఫ్ ప్రతినిధి బృందం పలు అంశాలపై మంగళవారం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా ఎఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల డయాగ్నోసిస్ సేవలను ప్రజలకు అందుబాటులో పెట్టాలన్నారు. నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో గత ఐదు రోజులుగా రక్త పరీక్ష సేవలు ఆన్‌లైన్ ఎర్రర్ కారణంగా అందుబాటులో లేద ని, తద్వారా పేషంట్ లు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, సదరు ఆసుపత్రిలో మందుల కొరత కూడా ఉన్నదని, మరుగుదొడ్లు సరిగా లేవని, మరుగుదొడ్లకు సూచిక బోర్డ్ కూడా లేవని వివరించారు. కాగా సర్వే అనంతరం ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ఏరి యా ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీదేవికి వినతిపత్రం ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్,జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్,బాలు,విజయ్,వంశి, సీనియర్ కార్మిక నేత చెట్టుకింద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# గిరిజన విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

గిరిజన సమాఖ్యరాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ లోని బేగంపేట మరియు రామంతపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ గిరిజన విద్యార్థులకు బిఏఎస్ పథకం కింద పాఠ్యపుస్తకాలు నేడు పంపిణీ చేయడం జరిగిందని తెలంగాణ గిరిజన సమాఖ్యరాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో కార్పొరేట్ విద్యను అభ్యసించడంలో గిరిజన విద్యార్థుల పాత్ర వారి ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. రాష్ట్రంలోని బిఏఎస్ పథకము ద్వారా కార్పొరేట్ పాఠశాలలో గిరిజన విద్యార్థులకు ప్రభుత్వము నుండి సీట్లు కేటాయించి, వారి లక్షల రూపాయల ఫీజులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని, ఈ పథకానికి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు మంచి ఉద్దేశ్యంతో ఆనాడు ప్రవేశపెట్టి తీసుకురావడం జరిగిందని తెలిపారు. తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో వీటికి సంబంధించినటువంటి లేఖ ఆర్థిక శాఖలో గత సంవత్సరం నుంచి మగ్గుతుంది కానీ దాని పరిష్కరించడంలో ఆ శాఖ విఫలం చెందిందని అన్నారు. ఈ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని గిరిజన విద్యార్థులు కూడా పోటీ ప్రపంచంలో ముందడుగు వేసేందుకు సంసిద్ధతను చాటుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది వినోద్ రామకృష్ణ వెంకన్న.స్కూల్ సిబ్బంది పట్నాయక్ అశోక్ కుమార్ స్కూల్ సిబ్బంది పాల్గొని సహకరించారు.


తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనాల శాఖ
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) కార్యాలయం, అసెంబ్లీ బిల్డింగ్స్ డివిజన్, బషీర్‌బాగ్, హైదరాబాద్.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

NIT నెం.13/2024-25/ABD/DB/NIT/243, తేదీ: 25/06/2024 కోసం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన 2 పనుల కోసం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి టెంపుల్ & నెక్లెస్ రోడ్‌లకు వెల్డ్‌మెష్ జాలితో బారికేడింగ్ అందించడంలో అర్హులైన నమోదిత కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడమైనది. అంచనా ECV ధర రూ. 15,64,074/-, ఇతర వివరాలు http://tender.telangana.gov.in నందు అందుబాటులో ఉన్నాయి. డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 26.06.2024, డౌన్‌లోడ్ ముగింపు తేదీ: 02.07.2024.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), అసెంబ్లీ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్.

DIPR R.O. No. : 169-DP/CL/ADVT/1/2024-25 Date: 25-06-2024



తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టర్/ సంయుక్త కలెక్టర్/స్పెషల్ కలెక్టర్(భూ సేకరణ )/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)

ఫారం-7

(చట్టం 30/2013 లోని సెక్షన్ 19 (1)లోని సబ్ రూల్ - (1) రూల్ 25 ప్రకారం)

రూఢీ ప్రకటన

G1/647/2024 తేది: 14.06.2024
ఫైలు నెం.డి/52/2023 తేది: 23.05.2024

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా కొండూర్ రెవిన్యూ గ్రామము, మండలం మర్రిగూడ భూమి విస్తీర్ణం: ఎ.7.25 గుంటల ప్రభుత్వ/అసైన్డ్ భూమిని ప్రజా ప్రయోజనార్థం డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు లో భాగంగా డిండి మెయిన్ కెనాల్ కొరకై కి.మీ. 58.500 to 66.300 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినారు.

కావున ఈ ప్రాజెక్టు క్రింద నల్లగొండ జిల్లా, కొండూర్ రెవిన్యూ గ్రామము మండలం మర్రిగూడ విస్తీర్ణం ఎ.7.25 గుంటల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమ్మిత్తం ప్రకటన రూఢీ జారిచేయనైనది.

షెడ్యూలు

గ్రామము: కొండూర్ మండలం: మర్రిగూడ జిల్లా: నల్లగొండ
విస్తీర్ణం: 7.25 గుం.లు

| క్ర. సం. | సర్వే నెం./ భూమి స్వభావమువిస్తీర్ణం (ఎ.గుం) | భూసేకరణ విస్తీర్ణము (ఎ.గుం) | పట్టాదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | చెట్లు/ కట్టడము లు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | 18 మెట్ట/ప్రభుత్వ అసైన్డ్ భూమి | 0.07 | ఆకుల రఘుమయ్య తండ్రి చెన్నయ్య | |
| 2 | 18 ప్రభుత్వభూమి | 3.22 | ప్రభుత్వ భూమి | |
| 3 | 81 మెట్ట/ప్రభుత్వ అసైన్డ్ భూమి | 2.08 | చిలివేరు యల్లమ్మ భర్త మల్లయ్య | |
| 4 | 81 ప్రభుత్వభూమి | 0.17 | ప్రభుత్వ భూమి | |
| 5 | 114 ప్రభుత్వభూమి | 1.11 | ప్రభుత్వ భూమి | |
| | మొత్తం విస్తీర్ణం | 7.25 | | |

ప్రతిపాదిత భూమి భూ సేకరణ చట్టము, 2013 నెం. 30/2013 లోని సెక్షన్ 15 ప్రకారం సంబంధిత భూ యజమానుల నుండి ముసాయిద నోటిఫికేషన్ పై ప్రతిపాదిత భూ సేకరణ విషయములో ఎటువంటి అభ్యంతరములు రానందున సెక్షన్ 19/1 ప్రకారం డిక్లరేషన్ జారిచేయనైనది. ఇట్టి భూ సేకరణ వలన ఎవరు ప్రభావితము కాలేదు, నిర్వాసితులు కాలేదు. కావున సెక్షన్ 31 (కేంద్ర చట్టము 30/2013) క్రింద విడిగా ఆర్ అండ్ ఆర్ అవార్డు జారీ చేయవలసిన అవసరం లేదు.

భూ సేకరణ తల పెట్టిన భూమిలో, బొగ్గు, ఇనుము, ప్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా ప్రత్యేక ఉప కలెక్టరు, ఆర్‌ఆ&ఆర్&ఎల్.ఎ.యం.ఆర్. ప్రాజెక్టు.యూనిట్-2 నల్లగొండ నందు కార్యాలయపు పనివేళల నందు చూసుకోవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ ఆర్ & ఆర్ & ఎల్.ఎ, యూనిట్-2 నల్లగొండ
సం/- అదనపు కలెక్టర్ నల్లగొండ
సం/- జిల్లా కలెక్టర్ నల్లగొండ

DIPR RO NO. 83/LA/PP/Advt/Pub/2024-25

ప్రజాపక్షం
బుధవారం, జూన్ 26

# సఖ్యతలేదు – సంఘర్షణే

18వ లోక్‌సభ కొలువుదీరింది. బిజెపికి గత రెండు లోక్‌సభల్లో ఉన్న ఏకపక్ష ఆధిపత్యాన్ని 2024 ఎన్నికల్లో ఓటర్లు కత్తిరించారు. 370 సీట్లు అత్యాశకు (ఎన్‌డిఎకు 400పైన) పోయిన బిజెపికి కేవలం 240 సీట్లు ఇచ్చి కనీసమెజారిటీకి దూరం చేశారు. ఎన్‌డిఎ మిత్రపక్షాల భాగస్వామ్యంతో నరేంద్రమోదీ అధికారం నిలుపుకోగలిగారు. అయినా ఈ సంకీర్ణ ప్రభుత్వాధినేత పాత ఒంటెత్తు పోకడలో మార్పు కనిపించకపోవటం విచారకరం. 'ఇండియా' కూటమి 236 సీట్లతో అత్యంత బలమైన ప్రతిపక్షంగా ఎదురుగా నిలబడినా దాన్ని గౌరవించే, పార్లమెంటరీ వ్యవహారాల్లో దానితో సఖ్యతను కోరుకునే ధోరణి ప్రభుత్వంలో ద్యోతకం కావటం లేదు. ప్రోటెం స్పీకర్ ఎంపికలోనే ఇది ప్రస్ఫుటమైంది. ఇప్పుడు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికకు విస్తరించింది. భారత పార్లమెంటు చరిత్రలో 72 ఏళ్ల తరువాత తొలిసారి స్పీకర్ పదవికి పోటీ జరుగుతోంది. లోక్‌సభగాని లేక శాసనసభగానీ స్పీకర్ స్థానం ఉన్నతమైనది; నిష్పక్షపాతం, వివాదాలు తలెత్తిన సందర్భాల్లో ప్రభుత్వం –ప్రతిపక్షాల మధ్య సమయస్ఫూర్తితో సర్దుబాటు సాధించగల చాతుర్యం ఆ పదవిని అలంకరించే వ్యక్తికి భూషణం. స్పీకర్ ఎల్లప్పుడూ పాలక పార్టీ నుండే ఉంటారు. ప్రభుత్వ పక్షం సాధారణంగా ప్రతిపక్షంతో సంప్రదించి అభ్యర్థిని ఎంపికచేస్తుంది. కాని ఈ పర్యాయం పాలక ఎన్‌డిఎ, గత సభలో స్పీకర్‌గా పనిచేసిన బెజెపి అభ్యర్థి ఓంబిర్లానే మళ్లీ ఎంపిక చేసింది. సాంప్రదాయం ప్రకారం డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షానికి ఇవ్వటానికి బిజెపి అంగీకరిస్తే స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునే సాంప్రదాయాన్ని గౌరవిస్తామని 'ఇండియా' కూటమి చెప్పింది. అయితే ప్రభుత్వం సమాధానమివ్వకుండా ఏకపక్షంగా ముందకెళ్లటంతో కూటమి కూడా తమ అభ్యర్థిగా కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపి, దళితనేత కె. సురేశ్ చేత నామినేషన్ వేయించింది. దాంతో పోటీ అనివార్యమైంది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఒకపార్టీకి చెందరని, అందరివారని, అందువల్ల కాంగ్రెస్ డిప్యూటీ స్పీకర్ తమకిస్తేనే స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం చేస్తామని షరతుపెట్టిందని మంత్రి పీయుష్‌గోయల్ వితంతవాదన చేస్తున్నారు. డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వకుండా, ఎన్‌డిఎ భాగస్వాముల్లో బహుశా టిడిపి చెప్పిన అభ్యర్థికి ఇవ్వటం బిజెపి వ్యూహంగా కనిపిస్తుంది. ఎందుకంటే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్న హరివంశ్ నారాయణ్‌సింగ్ (బిహార్) ఎన్‌డిఎలో భాగస్వామి అయిన జనతాదళ్ (యు) సభ్యుడు. ఎన్‌డిఎకు మెజారిటీ ఉన్నందున దాని అభ్యర్థులే స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికవుతారు. మోదీ ఏకపక్ష పెత్తందారీధోరణిని ఎండగట్టటానికే ప్రతిపక్షం పోటీ చేస్తున్నది. కూటమి అభ్యర్థి సురేష్ 8సార్లు లోక్‌సభకు ఎన్నికైనారు. అయితే 7 సార్లు ఎన్నికైన తమ అభ్యర్థి భర్తృహరిన్ మెహతాబ్‌ను ప్రోటెం స్పీకర్‌గా పాలకపార్టీ ఎంచుకున్నప్పుడే దాని ఒంటెత్తు పోకడ వెల్లడైంది.

యుపిఎ ప్రభుత్వం సైతం సాంప్రదాయాన్ని గౌరవించి డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికిచ్చింది. ఈ సాంప్రదాయం ఆదినుండీ ఉంది. సంకీర్ణశకంలో కూడా యుపిఎ పాలనలో 2004 నుంచి 2009 వరకు చరణజిత్‌సింగ్ అత్వాల్ (అకాలిదళ్), 2009 నుంచి 2014వరకు కరియాముండా (బిజెపి), మోదీ తొలి ప్రభుత్వకాలంలో 2014–2019వరకు ఎం.తంబిదోరై(ఎఐఎడిఎంకె) డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. డిప్యూటీ స్పీకర్ లేని తొట్టతొలి లోక్‌సభ 17వ సభ(2019–24) మాత్రమే. గుర్తింపుపొందిన ప్రతిపక్షపార్టీ లేదనే నెపంతో ఆ రాజ్యాంగ పదవిని భర్తీ చేయలేదు. ఈ 18వ లోక్‌సభలో 99 సీట్లతో కాంగ్రెస్, 236 సీట్లతో 'ఇండియా' కూటమి ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. సాంప్రదాయం ప్రకారం ఆ పదవి ప్రతిపక్షానికి దక్కాలి. దాని నిరాకరించటం ద్వారా మోదీ ప్రతిపక్షంపట్ల బుల్‌డోజింగ్ విధానాన్ని కొనసాగిస్తున్నారని అర్థమవుతున్నది.

# బడ్జెట్‌లో కార్పొరేట్, సంపద పన్ను పెంచాలి

## కేంద్ర ఆర్థిక మంత్రికి కార్మిక సంఘాల సూచన

**బడ్జెట్ కసరత్తులో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ చర్చల్లో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు విద్యాసాగర్ గిరి (ఎఐటియుసి), తపన్ సేన్ (సిఐటియు), అశోక్ సింగ్ (ఐఎన్‌టియుసి), హర్భజన్ సింగ్ (హెచ్ఎంఎస్), ఆర్.కె.శర్మ(ఎఐయుటియుసి), రాజీవ్ ధిమ్రి (ఎఐసిసిటియు), మనాలీ షా (సేవా), ఇందు భూషణ్ (టియుసిసి), రామచంద్రన్ (ఎల్‌పిఎఫ్)లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రికి కేంద్ర కార్మిక సంఘాల తరుపున సమర్పించిన సంయుక్త వినతిపత్రంలోని వివరాలు ఇలా ఉన్నాయి.**

ప్రజాస్వామ్యం, దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో సంపద సృష్టికర్తలైన దేశ శ్రామికవర్గం తరుపున ప్రతినిధులుగా మేము బడ్జెట్ పూర్వ సంప్రదింపులకు హాజరయ్యాము. కార్మిక సంఘాలు చేసిన సూచనలలో ఒక్క సలహాను కూడా గతంలోని మీ ప్రభుత్వం బడ్జెట్ లేదా విధాన రూపకల్పన సందర్భంగా పరిగణలోకి తీసుకోలేదని చెప్పవలసి వస్తుంది. ఎన్‌డిఏ ప్రభుత్వాల హయాంలో అత్యున్నత త్రైపాక్షిక వేదిక ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్(ఐఎలోసి)ని ఆహ్వానించి పదేళ్ళు అవుతుంది. గత ఎన్‌డిఏ ప్రభుత్వం నిర్వహించిన ఏకైక ఐఎలోసిలో గత ఐఎలోసి సమావేశాలలో చేసిన సిఫార్సులను అమలు చేయాలని చేసి ఏకైక ముఖ్య సూచనను కూడా పట్టించుకోలేదు. కొద్ది మంది కార్పొరేట్‌లకు సహాయ పడే విధానాలతో, దేశంలో పెద్ద ఎత్తున అసమానతలు పెంచిన విధానాల ఫలితంగా పెరిగిన నిరుద్యోగం, ఆకలి, పౌష్టికాహార లోపం, ప్రపంచ ఆకలి సూచిలో దిగజారిన భారత స్థానం , తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొనైనా మేము చేస్తున్న సూచనలను పరిగణలోకి తీసుకుంటారని ఆశిస్తున్నాము.

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు 2024–25 బడ్జెట్‌కు సంబంధించి కేంద్ర కార్మిక సంఘాలు చేసిన సూచనలు:**

**1, వనరుల సమీకరణ :** నిత్యావసర ఆహార పదార్థాలు, ఔషధాలపై జిఎస్‌టి విధించి సామాన్యులపై భారం వేయడం కాకుండా, కార్పొరేట్ పన్నులు, సంపద పన్ను పెంచడం, కొత్తగా వారసత్వ పన్నును అమలు చేయడం ద్వారా నిధుల సమీకరణ జరగాలి. దశాబ్దాలుగా కార్పొరేట్ పన్నులను అన్యాయంగా తగ్గిస్తూ, సామాన్యులపై భారం మోపే విధంగా పరోక్ష పన్నులను పెంచడం ద్వారా తిరోగమన పన్ను విధానం అమలవుతోంది. అత్యంత సంపన్నులపై ఒక్క శాతం వారసత్వ పన్ను విధించినా కూడా బడ్జెట్ రాబడి విపరీతంగా పెరుగుతుంది. దాన్ని విద్య, ఆరోగ్యం, ఇతర సామాజిక రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు వినియోగించవచ్చు. తద్వారా నిత్యావసర ఆహార పదార్థాలు, ఔషధాలపై జిఎస్‌టిని తక్షణం భారీగా తగ్గించవచ్చు.



**2. వేతన జీవుల ఆదాయ పన్ను తగ్గింపు :** వేతన జీవుల జీతాలు, గ్రాట్యుటీపై విధించే ఆదాయ పన్ను సీలింగ్ పరిధిని గణనీయంగా పెంచాలి.

**3. సామాజిక భద్రతా నిధి :** అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత సామాజిక భద్రతా నిధిని ఏర్పాటు చేయాలి. దాని ద్వారా నెలకు రూ. 9 వేల కనీస పెన్షన్, ఇతర వైద్య, విద్య ప్రయోజనాతలో కూడిన నిర్దేశిత సార్వత్రిక సామాజిక భద్రతా పథకాలను అమలు చేయాలి. వ్యర్థాల నుంచి పునరుత్పత్తి చేసే వారు, ఉప్పు తయారీదారులు, గాజు గ్లాస్ తయారీదారులు వంటి వివిధ ప్రమాదకరమైన వృత్తుల్లో పని చేసే కార్మికులకు ఆరోగ్య, భద్రతా చర్యల కోసం ప్రత్యేక పథకాలను తీసుకురావాలి. పని లేని సమయాలలో, వడగాలులు, శీతల గాలులు, అకాల వర్షాలు, వరదలు, తుఫానులు, తదితర ప్రకృతి వైపరిత్యాల సమయాలలో ఆదాయ / వేతన నష్టానికి పరిహారం ఏర్పాటు చేయాలి. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రకృతి వైపరిత్యాల కారణంగా నష్టపోయే కార్మికుల కోసం వాతావరణ పునరుద్ధరణ నిధిని ఏర్పాటు చేయాలి. అసంఘటిత కార్మికులందరూ 'ఈ శ్రమ్' పోర్టల్‌లో నమోదు చేసి, ఈ పథకాలను అమలు చేయాలి. ప్రస్తుత పథకాలలో నగదు ప్రయోజనాలను పెంచాల్సి ఉన్నది. ఇచ్చిన జిఎస్‌టి అమలులో భాగంగా బీడీ సెస్ చట్ట ఉపసంహరణ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం నష్టాన్ని భర్తీ చేసేందుకు అవసరమయ్యే నిధిని ఏర్పాటు చేయాలి. అసంఘటిత రంగ కార్మికులకు ఇఎస్‌ఐని విస్తరించాలి.

చిన్న రైతులు / వ్యవసాయ కార్మికులు / కౌలు రైతులను కిసాన్ సమ్మాన్ యోజనలో చేర్చాలి. అలాగే వ్యవసాయ కార్మికులు / కౌలు రైతులకు కూడా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను వర్తింపజేయాలి. వలసకార్మికులు సామాజిక భద్రతా ప్రయోజనాలను పొందేందుకు వీలుగా రేషన్ కార్డులు, ఇతర ఐడి కార్డుల పోర్టబిలిటీ కోసం అవసరమైన సాంకేతిక, అంతర్రాష్ట్ర నిర్వహణ చర్యలను తీసుకోవాలి.

**4. ఉద్యోగాల సృష్టి :** కేంద్ర ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలలో తక్షణమే ఖాళీలన్నిటినీ భర్తీ చేయాలి. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని నిలిపివేసి, రెగ్యులర్ ఉద్యోగాలను కల్పించాలి. సమాన పనికి, సమానవేతనం ఇవ్వాలి, అగ్నివీర్, ఆయుధ్‌వీర్, కోయ్‌లావీర్, తదితర నిర్థీత కాల ఉద్యోగాలను నిలిపివేయాలి. ఆ స్థానంలో పూర్తి స్థాయి ఉద్యోగాలు కల్పించాలి. స్కిల్ ఇండియా పేరుతో ప్రభుత్వ నిధులతో ప్రైవేటు సంస్థలకు లబ్ది చేకూర్చే ఇంటర్న్‌షిప్ విధానాన్ని సమూలంగా మార్చివేసి, ప్రైవేటు సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అనంతరం ఉద్యోగాలు కల్పించే విధంగా చట్టబద్ధత తీసుకురావాలి. ఉపాధి హామీ పథకం పని దినాలు, వేతనం పెంచి, పట్టణ ప్రాంతాలలో కూడా విస్తరించాలి. వీధి విక్రేతల చట్టం 2014 కింద వీధి విక్రేతల సర్వే జరిపి, లైసెన్స్ ఇచ్చేందుకు తగిన నిధులు కేటాయించాలి.

**5. ఎన్‌పిఎస్:** నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**6. ఎనిమిదవ పే కమిషన్‌ను తక్షణమే నియమించాలి.**

**7. లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలి :** పాత 29 కార్మిక చట్టాల స్థానంలో తీసుకువచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను వెనక్కి తీసుకొని, పాత చట్టాలను పునరుద్ధరించాలి. కనీస వేతనం నెలకు రూ.26 వేలకు తక్కువగా ఉండకూడదు.

**8. పిఎస్‌యుల ప్రైవేటీకరణను నిలిపివేయాలి :** ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, తాజాగా తీసుకువచ్చిన నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ విధానాన్ని నిలిపివేయాలి. వివిధ పద్ధతులలో రైల్వేలో ప్రైవేటీకరణను, రక్షణ శాఖలో కంపెనీల ఏర్పాటు, విలీనం ద్వారా ప్రైవేటీకరణ ప్రక్రియను, ఓడరేవుల ప్రైవేటీకరణను, బొగ్గు గనుల ప్రైవేటీకరణ, వేలం పాటలను , విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ ప్రైవేటీకరణను రద్దు చేయాలి. బిఎస్ఎన్ఎల్, ఆర్ఐఎన్ఎల్‌ల ఆస్తుల అమ్మకాన్ని తక్షణమే నిలిపివేయాలి. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలి. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలి.ఇంటింటికి వెళ్ళి చెత్తను సేకరించే విధానాన్ని ప్రైవేటీకరించవద్దని, సంప్రదాయ చెత్త సేకరణదారులకు ఉద్యోగం కల్పించి, వారి నైపుణ్యాలను , సాంకేతికతను పెంపొందించాలి.

విద్యుత్ బిల్లును ఉపసంహరించాలి. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్‌లను రద్దు చేయాలి.

**9. ప్రభుత్వ రంగ బ్యాంకుల లూటీ, దోపిడీని, బీమా రంగ ప్రైవేటీకరణను ఆపేయాలి :** కార్పొరేట్ రుణ ఎగవేతదారుల రుణాలను పారు బకాయిల పేరుతో లేదా దివాల పేరుతో రద్దు చేయవద్దు.

10. ఐపిఒల పేరుతో ఎల్ఐసి, జిఐసి ప్రైవేటీకరణ చర్యలను నిలిపివేయాలి.

**11. సామాజిక రంగం :** ఆహారం, పోషణ, ఆరోగ్యం, విద్య తదితర సామాజిక, సేవా రంగాలలో ప్రైవేటీకరణ ఆపేయాలి. తాగునీరు, పారిశుద్ధ్యం, గృహనిర్మాణం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు జరగాలి. లింగ ఆధారిత బడ్జెట్‌ను పెంచాలి. రైల్వేలలో సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులకు రాయితీని పునరుద్ధరించాలి.

**12. ధరల పెరుగుదల :** పెట్రో ఉత్పత్తుల ధరల పెరుగుదలను నియంత్రించాలి. స్పెక్యులేటివ్ ఫార్వర్డ్ ట్రేడింగ్, ఆహార పదార్థాల నిలువలను నియంత్రించాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి ధరల పెరుగుదలను నియంత్రించాలి.

**13. స్కీమ్ వర్కర్‌లు :** అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా, బ్లాక్ ఫెసిలిటేటర్స్, పారా టీచర్స్, తదితర స్కీమ్ వర్కర్‌లను రెగ్యులరైజ్ చేసి, చట్టబద్ధమైన కనీస వేతనాలు కల్పించాలి. సామాజిక భద్రత, పెన్షన్ తదితర ఇతర ప్రయోజనాలను కల్పించాలి. ఐసిడిఎస్, ఎండిఎంఎస్, ఎన్‌హెచ్ఎం తదితర కేంద్ర పథకాలకు నిధులు పెంచాలి.

**14. ఇపిఎఫ్:** పిఎఫ్, ఇపిఎస్, ఇడిఎల్ఐ పథకాలను చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానాను తగ్గిస్తూ తీసుకువచ్చిన గెజిట్‌ను ఉపసంహరించాలి. ఇపిఎస్ కింద కనీస పెన్షన్‌ను రూ.9వేలు , అంతకుమించి ఉండేలా చూడాలి. ఇపిఎఫ్ఒ ట్రస్టీ బోర్డులో వివక్షా పూరితమైన ప్రాతినిధ్యాన్ని సరి చేయాలి.

**15. ఇఎస్ఐసి :**

ఇఎస్ఐసి సేవలను బలోపేతం చేసి, అన్ని పని ప్రదేశాలలో నాణ్యమైన సేవలు అందజేయాలి. కవరేజి పరిమితిని పెంచాలి.

**16.ఎంఎస్‌పి :**

అన్ని వ్యవసాయ ఉత్పత్తులపై డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు చట్టబద్ధ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పించడంతో పాటు, సేకరణ గ్యారెంటీని కల్పించాలి.

# విద్యా వ్యవస్థ పతనంలో సంఘ్ పాత్ర



సంగిరెడ్డి హనుమంత రెడ్డి,
ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
9490 20 4545

వాజపేయి ప్రభుత్వంలో సంఘ్ ప్రముఖుడు మురళి మనోహర్ జోషి విద్యాశాఖ మంత్రి. అశాస్త్రీయ అంశాలను బోధనాంశాలుగా విద్యాలయాల్లోఅమలుచేశారు. విద్యార్థులపై ఛాందసాలను రుద్దారు. మానవులుగా మారవలసిన మనుషులను పశుపక్ష్యాదుల స్థాయికి దిగజార్చారు. రోమ్ విశ్వవిద్యాలయ మతాంశాల మాజీ ఆచార్యుడు జియోవని జెంటైల్ ఇటలి ఫాసిస్టు నియంత ముసోలిని విద్యాశాఖ మంత్రి. జెంటైల్ సంస్కరణలతో ఈయన అమలుచేసిన విద్యా విధానంలో విద్యాలయాల్లో అగ్రవర్ణాలవారే బోధించాలి. యూదులు, స్త్రీలు, వికలాంగులు విద్యకు అనర్హులు. ఉన్నత వర్గాలకు ప్రభు విద్యను, మధ్యములకు మత విద్యను, యూదులకు బానిస విద్యనుబోధించాలి. మోదీ 'జాతీయ విద్యా విధానం 2020'లో వీటితో పాటు విద్యను ధార్మిక సంస్థలకు అప్పగిస్తారు. సరస్వతి మందిరాలు, దీనానాథ్ బాత్రా భారతీయ విద్యామండలి, ప్రజ్ఞా భారతి మొదలగు సంఘ్ అనుబంధ సంస్థలే వీరి ధార్మిక సంస్థలు. విద్య, పరిశోధన, శిక్షణల భారతీయ మండలి (ఎన్‌సిఇఆర్‌టి)ఇటీవల బడుల పాఠ్యాంశాలను సంఘీకరించింది.

అన్ని వృత్తుల్లో కాషాయ సైన్య తయారీకి విద్య, పోటీ పరీక్షల నిర్వాహక కాషాయాధిపతులు పోటీ పరీక్షల్లో అవినీతికి పాల్పడ్డారని విమర్శలు వచ్చినా తమ అనుకూల అక్రమాల పోటీ పరీక్షలను సమర్థించుకుంటారు. ఆశించిన లాభం దక్కదనుకున్న పరీక్షలను కుంటిసాకులతో రద్దుచేస్తారు. నేటి నీట్, నెట్‌ల కుంభకోణాలకు మధ్య ప్రదేశ్ 2013 'వ్యాపం' ప్రవేశ పరీక్షకుంభకోణం మూలం. ఇది వైద్య, ఇంజినీరింగ్ వృత్తి విద్యలకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రవేశ పరీక్ష. నేటి కేంద్ర మంత్రి నాటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింఘ్ చౌహాన్, ఆయన భార్య, సోదరులు వ్యాపం కుంభకోణంలో కూరుకుపోయారు. తమ తాత్వికులను డాక్టర్లు, ఇంజినీర్లు, శాసనాధికారులు, ఉపాధ్యాయులుగా నియమించారు. రోగులు అసమర్థ చికిత్సలో చనిపోయారు. భవనాలు, వంతెనలు కూలాయి. లక్షల అష్టావక్రులు తయారయారు. 2014 తర్వాత దేశవ్యాపిత పోలీసు నియామకాల్లో, న్యాయవాదుల నమోదులో అక్రమంగా60 80 శాతం మంది సంఘీయులను నియమించుకున్నారు. వారి ద్వారా ఇతరులను, తమ వ్యతిరేకులను, అనానుకూలురను హింసిస్తున్నారు. ప్రతి రాత్రి ముస్లింలను చంపుతారు. చంపని రోజు వారికి నిద్రపట్టదు. కుదరకపోతే వారిని అక్రమ కేసుల్లో ఇరికించి ఇబ్బందులు పెడతారు. ఏళ్ల తరబడి జైళ్ళలో బంధిస్తారు

మోదీ ప్రభుత్వం 2017 లో జాతీయ పరీక్షల సంస్థ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీఎన్‌టిఎ) ను స్థాపించింది. ఒక దేశంఒక పరీక్ష మోదీ లక్ష్యం. ఎన్‌టిఎ,వైద్య విద్యలో ప్రవేశానికినీట్ (నేషనల్ ఎలిజిబిలిటి కమ ఎంట్రెన్స్ టెస్ట్)ను,విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ నియామకాలకు విశ్వవిద్యాలయాల నిధుల సంస్థ (యుజిసి)




నీట్ కుంభకోణానికి వ్యతిరేకంగా నిరసిస్తున్న విద్యార్థినులు

జాతీయ అర్హత పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటి టెస్ట్ నెట్) ను, దేశవ్యాపిత ఇంజినీరింగ్ కళాశాలల ప్రవేశానికి సంయుక్త ప్రవేశ పరీక్ష (జాయింట్ ఎంట్రెన్స్ ఎక్జామినేషన్ – జెఇఇ) ను, కేంద్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిశోధన, ఇతర స్నాతకోత్తర విద్యలో ప్రవేశానికి నిర్వహించే కేంద్ర/ ఉమ్మడి విశ్వవిద్యాలయాల ప్రవేశ పరీక్ష (సెంట్రల్/ కామన్ యూనివర్శిటి ఎంట్రెన్స్ టెస్ట్ – సియుఇటి) ని నిర్వహిస్తుంది. ఎన్‌టిఎఈ పరీక్షల నిర్వహణనుసమాచార సాంకేతిక సంస్థలకు అప్పజెపుతుంది.అజాగ్రత్తలు, అభద్రతలు, తస్కరణలకు వీలుగా ఒకరికి బదులు మరొకరు పనిచేసే విధంగా ఆ సంస్థల పనితీరు ఉంటుంది. వాటి కంప్యూటర్లలోని సమాచారం ఆపరేటర్ల ద్వారా, ఇతర మార్గాల ద్వారా ఇతరులకు అందే అవకాశం ఉంది. ఆ సంస్థలే ప్రలోభాలకు లొంగవచ్చు. ప్రభుత్వాలే ఆ సంస్థలను ఆ పనికి పురమాయిసే.. ప్రమాదం ఊహకందదు. ఇప్పుడు జరుగుతున్నదిదే. 2024 సంవత్సరానికి నిర్వహించిననీట్, నెట్ పరీక్షల ప్రశ్నా పత్రాలు బయటకు పొక్కాయి.దీనిపై వివరణ ఇమ్మని కేంద్ర ప్రభుత్వం, ఎన్.టి.ఎ.లకు సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. విద్యార్థులతో, వారి హక్కులతో ఆడుకోవద్దని కేంద్రానికి చీవాట్లు పెట్టింది. ప్రభుత్వం నెట్ ను మరుసటి రోజే రద్దుచేసింది. నీట్ ను రద్దుచేయలేదు. విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశంఉంది. దీంతో అసలు దోషులు తప్పించుకుంటారు. మూల కారకులయిన విద్యా సంస్థల కాషాయ కసాయిలను, వారిని నియమించిన నరమేధులను శిక్షించాలి.

మోదీ ప్రభుత్వం విద్య, పరిశోధన రంగాలకు నిధులను తగ్గించింది. విద్యాసేవలను ప్రైవేటీకరించింది. ప్రభుత్వ కళాశాలల్లో 55,648 సీట్లు, ప్రైవేటు కళాశాలల్లో 50,685 సీట్లు మొత్తం 1,06,33 సీట్ల కోసం 2024 నీట్‌కు24 లక్షలకు పైగా హాజరయ్యారు. ఎంపిక చేసిన కొన్ని నగరాల కళాశాల్లో83 బోధనాంశాల అధ్యాపక పదవుల కోసం 9 లక్షల మంది 2024 నెట్ రాశారు. వైద్య విద్య సీట్లు, ఉపాధ్యాయ పదవులు చాలా తక్కువ. ఈ కొరత కూడా అవినీతికి కారణం. ఒక్క ప్రశ్నాపత్రం రూ.30 రూ.32 లక్షలు పలికింది.

కేంద్రం, రాష్ట్రాల్లో బిజెపి పాలించే డబుల్ ఇంజిన్ అవకాశం ఇమ్మని, అద్భుతాలు సృష్టిస్తానని మోదీ మోతమోగిస్తారు. డబుల్ ఇంజిన్ రాష్ట్రాల్లోనే అవినీతి, అక్రమాలు ఎక్కువ జరిగాయి. పోటీ పరీక్షల అవకతవకలు డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల రాష్ట్రాలలోనే జరిగాయి. వాటిలో గుజరాత్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, బిహార్ లలో మరీ ఎక్కువ. ఉత్తర ప్రదేశ్ లో ఇటీవలి పోలీసు నియామకాల్లో కూడా కుంభకోణం జరిగింది. ఇవీ మోదీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల అద్భుతాలు.

యుజిసి నెట్ 2024 పరీక్షలో వైదికవాద పౌరాణిక అంశాలపై ప్రశ్నలున్నాయి. పునర్నిర్మించిన అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ట ఎప్పుడు జరిగింది? (ప్రాణ ప్రతిష్ట రామ మందిరానికి కాదు, బాలరామునికి అన్న జ్ఞానం ప్రశ్నా పత్ర రచయితకు లేదు) హిందు తత్వ ప్రస్థాన త్రయి లోని అంశాలేవి? తలలు తెగిన తర్వాత కూడా కురుక్షేత్ర యుద్ధాన్ని చూడ్డానికి బతికిఉన్న మహాభారత యుద్ధ యోధులెవరు? 'రామచరిత మానస్'లో ఏ కాండలో హనుమాన్ దర్శనమిస్తాడు?బహుళ జవాబుల ఎంపిక ప్రశ్నల్లో ఇవి కొన్ని. ఉపాధ్యాయులవైదికీకరణ వీటి ఉద్దేశం. పోటీ పరీక్షల అవినీతి (ప్రశ్నాపత్రాల అమ్మకం) విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తుంది. అవినీతితోపరీక్షలోఉత్తీర్ణులైనవారు కర్ణద్రోణాదులను చంపిన వీరుల్లాగర్వంతో పొంగిపోతారు.భారత కాషాయీకరణలో, నిరంకుశ పాలనలో శకుని, శల్య పాత్రలు పోషిస్తారు. నీట్ అవినీతితోనలుగురు విద్యార్థులు స్వీయహత్యకు పాల్పడ్డారు. మోదీ అవినీతిని అంతం చేస్తానన్నారు.కోట్ల ఖర్చుతో పరీక్షపై చర్చలు జరిపారు. కాని ఈ పోటీ పరీక్షల గందరగోళంపై నోరు విప్పలేదు. పార్లమెంటు లోపల, బయట, ప్రజల్లో తిరిగి కాషాయ విద్యా విధానాలను వివరించి, ఎదిరించి, నిరోధించడం తక్షణ తాత్కాలిక కర్తవ్యం. కాషాయాన్ని అధిగమించేతాత్వికతను అలవర్చుకోడం, ఎన్నికల్లో ఏకమై ఏ భావజాల పాదార్థిక ప్రలోభాలకు, ప్రయోజనాలకు లొంగకుండా ఓట్లువేసి సామాన్య ప్రజాపక్షపాత పాలకులను ఎన్నుకోడం ప్రజాస్వామ్య శాశ్వత పరిష్కారం.

# చెంచు మహిళకు అన్యాయం..



చెంచు మహిళ (2325)పై జరిగిన దాష్టీకం, అఘాయిత్యం పై నిజ నిర్ధారణ కమిటీ రిపోర్ట్ , తేది : 21–06–2024 నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ తాలూకా, మొలచింతలపల్లి గ్రామ నివాసితురాలు చెంచు మహిళ ఈశ్వరమ్మపై మానవ మృగాలు చేసిన, దాడి, అఘాయిత్యం, దాష్టీకం గురించి పత్రికలలో వచ్చిన వార్త ఆధారంతో పౌర హక్కుల ప్రజాసంఘం (పియుసిఎల్ టిఎస్) తెలంగాణ రాష్ట్రం ప్రధాన కార్యదర్శి జయ వింధ్యాల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాకూబ్, లంబాడి హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షులు బాలాజి పవార్, జనతా వికాస్ చైర్మన్ హారీత్ రూధలు కలిసి ఒక నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి, క్షేత్ర స్థాయిలో విచారించి నిజాలను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుక వెళ్ళుటకు ఒక మా ప్రయత్నంలో భాగంగా ఈ రిపోర్టును ప్రజ లముందు పెడుతున్నారు. దోషులు ఎంతటి వారైనా, వారి పట్ల ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై, ట్రాన్సురెంట్ చర్యలు తీసుకోవాలని కమిటీ డిమాండ చేస్తుంది. తేది 21–06–2024న నిజ నిర్ధారణ కమిటీ బాధితురాలు ఈశ్వరమ్మ, బాధితురాలి తల్లి పెంటమ్మ లను కలిసింది. సంఘటన గురించి కమిటీ అన్నికోణాలలో పరిశీలించింది.

**కమిటీ ముందు బాధితుల వాంగ్మూలము :**

1. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో నేడు నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రాంతాలలో, కొల్లాపూర్, అచ్చంపేట, అమ్రాబాద్ అటవీ ప్రాంతాలలో ప్రి మెచ్యూర్ గిరిజన జాతులు నివసిస్తున్నారు అని 40 ఏళ్ళ కిందట అధికారికంగా ప్రభుత్వమే ప్రకటించింది. వారికోసం ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ( ఐటిడిఎ) అనే ఒక డిపార్ట్మెంట్ నే రూపకల్పన చేశారు. 1980లో నుండి పూర్తిగా అమలులోకి వచ్చింది.

2. ఆశ్చర్య కరమైన విషయం ఏమిటంటే, ప్రి మెచ్యూర్ గిరిజన జాతులు మెలమెల్లగా క్షీణిస్తూ పోతున్నాయి. ఐటిడిఎ విభాగం ఏ ఉద్దేశ్యలతో ఏర్పాటు ప్రభుత్వం చేసిందో, మైదాన ప్రాంతపు గిరిజనులకు మాత్రమే పరిమితం అయింది. అటవీ ప్రాంతాలలో జీవిస్తున్న ప్రీ మెచ్యూర్ గిరిజన పెంటలను (గ్రామాలు) బలవంతంగా అక్కడి నుండి తీసుకువచ్చి, మైదాన ప్రాంతాలలో పునరావాసం పేరుతో డంప్ చేస్తున్నారు. వీళ్లు పరిపక్వత చెందని గిరిజనులు. అడవి ఉత్పత్తులపైననే ఆధారపడి ఉంటాయి. వీరిని మైదానం ప్రాంతాలలో సెక్యూర్‌గా జీవించేటందుకు ప్రత్యేకమైన శ్రద్ధను ప్రభుత్వం, నాగరిక సమాజం కనపర్చాలి. ఇది లేకపోవటం చేత చాలావరకు చనిపోయారు, చనిపోతూ ఉన్నారు. ఈ క్రమ పద్ధతిలోనే 15 పెంటలకు చెందిన ప్రి మెచ్యూర్ గిరిజన జాతులను తరలించి అందులోని కొందరిని మొలచింతలపల్లి గ్రామానికి ప్రభుత్వ అధికారులు తరలించారు. ఎంతమందిని తరలించారు అనే విషయంపై అధికారుల దగ్గర ఆధారాలు లేవని ఐటిడిఎ అధికారులె చేతులెత్తేశారు. ఈ తరలింపులు సుమారుగా 20 ఏళ్లకుపై నుండే జరుగుతున్నాయని ఐటిడిఎ అధికారులు అంటున్నారు. ఎందరిని తరలించారు, ఏ ఏ ప్రాంతాలలో డంప్ చేశారు, వారికి ఎలాంటి పునరావాసం కలిపించారు అనే విషయాల పట్ల సరైన సమాధానం ఇవ్వట్లేదు ఐటిడిఎ అధికారులు, ఐటిడిఎ అధికారుల అధికారాలు ఏంటో కూడా వారికి స్పష్టత లేదని కమిటీ దృష్టికి వచ్చింది.

3. పెంటల నుండి తీసుకువచ్చిన లేదా తరలించారు. ఈ తరలింపిలో భాగంగానే వచ్చిన కుటుంబాలలోని ఒక కుటుంబమే ఈశ్వరమ్మ కుటుంబం. ఈశ్వరమ్మకు ముగ్గురు (10, 8, 3 ఏళ్ళు) ఆడపిల్లలు. భర్త ఈదన్న, తల్లి పెంటమ్మ, తండ్రి లింగన్న. వీరికి ప్రభుత్వం ఇచ్చిన ఒక ఎకరం భూమి ఉంది అని కమిటీకి తెలిపారు. ఈ భూమికి కొంత దూరంలో, బండి వెంకటేష్ గొల్ల కులస్తులకు చెందిన వారని, ఇసుక దందా వ్యాపారం కూడా చేస్తారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అట్టి భూమిని గొల్ల బండి వెంకటేష్ నాలుగు లక్షల యాభై వేల రూపాయలకు తీసుకున్నాడని కమిటీకి చెప్పారు. అయితే, ఈశ్వరమ్మ కుటుంబం అయిదు లక్షల రూపాయలు కట్టివ్వమని అడిగినట్లు చెపుతున్నారు. అట్టి భూమికి బండి వెంకటేష్ రెండు లక్షల రూపాయలు మాత్ర మే ఇచ్చినట్లు, మిగతా డబ్బు గురించి ఈశ్వరమ్మ బండి వెంకటేష్, బండి వెంకటేష్ భార్య శివమ్మలను అడుగుతూ వస్తుంది అని చెపుతున్నారు. ఆ డబ్బు నేటికీ చెల్లించలేదు అని కమిటీకి చెప్పారు. ఈ గొడవ ఇద్దరి మధ్య జరుగుతూ ఉంది.

**నిజ నిర్ధారణ కమిటీ**
**జయ వింధ్యాల, కమిటీ చైర్మన్**
**బాలాజీ పవార్, కమిటీ సభ్యులు**
**హరీత్ రూధ, కమిటీ సభ్యులు**
**యాఖుబ్, కమిటీ సభ్యులు**

**కమిటీ ప్రభుత్వాన్ని చేస్తున్న డిమాండ్స్ :**

1. ఈశ్వరమ్మ పై జరిపిన అఘాయిత్యం పై, అమానుషమైన దాడిపై సమగ్రమైన న్యాయ విచారణకు ఆదేశించాలి మరియు హై కోర్టు విశ్రాంత జడ్జితో వెంటనే విచారణ జరిపించాలి,

2. దోషులు ఎంతటి వారైనా వారిని, అరెస్ట్ చేయాలి, ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి 45 రోజులలో విచారణను పూర్తి చేసి, ఈశ్వరమ్మకు న్యాయం చేయాలి.

3. ఎన్ని పెంటల నుండి చెంచులను అడవి ప్రాంతాల నుండి తరలించి ఏ ఏ మైదాన ప్రాంతాలలో , ఎందరికి పునరావాసం కలిపించారు, ఎందరు బ్రతికి ఉన్నారు , ఎందరు చనిపోయారు అనే దానిపై ఒక స్పష్టమైన ప్రకటన ప్రభుత్వం చేయాలి

4. ఈశ్వరమ్మ కుటుంబానికి 25 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలి మరియు SC &ST అట్రాసిటీ కింద చెల్లించే ఆర్థిక సహాయం వెంటనే చెల్లించాలి. ముగ్గురు కూతుళ్ళకు మంచి చదువును అందించాలి (ఫ్రీ ఎడ్యుకేషన్ కింద), పక్కా ఇల్లును కట్టించాలి.

5. బండి వెంకటేష్ దురాక్రమించుకున్న భూమిని తిరిగి ఈశ్వరమ్మ కుటుంబానికి చెందే విధముగా ప్రభుత్వము తగిన చర్యలు తీసుకోవాలి.

6. చెంచులకు చెందిన భూములు ఎందరు ఆశ చూపి ఆక్రమించుకున్నారో అంశంపై ప్రభుత్వ అధికారులు విచారణ జరిపి వారి భూములు వారికీ చెందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి, ఆక్రమించుకున్న వారిని ప్రాసిక్యూట్ చేయాలి.

7. ఈశ్వరమ్మ కు మంచి వైద్యం అందించాలి

# రాష్ట్రంలో ఉన్నది రైతు ప్రభుత్వం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వ మని ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆగష్టు 15లోపు నియోజకవర్గంలోని రైతులందరికీ రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, అకాల వర్షాలతో నియోజకవర్గంలో అధిక వర్షం పడి 124 చెరువులు గండ్లు పడ్డాయని, చెరువులను రూ.51 కోట్లతో మరమ్మతులు చేపించామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం భూపాలపల్లి ఔటర్ రింగ్ రోడ్డు కేంద్ర మంత్రి గడ్కారికి, మంత్రి కోమటిరెడ్డితో ప్రతిపాదనలు పంపించామన్నారు. త్వరలోనే ఆ పనులను ప్రారంభిస్తామని వివరించారు. మొరంచ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులను ప్రారంభిస్తాం. త్వరలోనే 100 ఎకరాలు కేటాయించి నియోజకవర్గంలో ఇండస్ట్రీయల్ పార్క్‌ను ప్రారంభిస్తామని అన్నారు. నియోజకవర్గంలో రూ.160 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు పూర్తి దశలో ఉన్నాయన్నారు. రూ.5 కోట్లతో టేట్లతో రాఘవరెడ్డి పేట బ్రిడ్జి మరమ్మతు పనులను చేయిస్తున్నం. వచ్చే నెల 10వ తేదీ కల్లా మరమ్మత్తు పనులు పూర్తవుతాయి. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తానని నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యులు చల్లూరి మధు, కాంగ్రెస్ నాయకులు దెబ్బేట రమేష్, కాంగ్రెస్ జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, అప్పం కిషన్, దాట్ల శ్రీనివాస్, అంబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రెస్ క్లబ్ భవనానికి నిధులు మంజూరు**

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవనానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జీఎస్ఆర్ మాట్లాడుతూ, వరంగల్ తర్వాత అభివృద్ధిలో రెండవ జిల్లాగా అత్యంత అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లి భూపాలపల్లిలో జర్నలిస్టుల కోరిక మేరకు అధునాతన అన్ని హంగులతో నూతన ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మించడం జరుగుతుందని తెలిపారు. అందుకుగాను పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ నుండి నిధుల ను కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. త్వరలోనే ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని అన్నారు. త్వరలోనే ఇళ్ల స్థలాలకు స్థలం కేటాయిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పిసిసి సభ్యులు చల్లూరి మధు, కాంగ్రెస్ జిల్లా నాయకులు బుర్ర కొమరయ్య అప్పం కిషన్, సాంబమూర్తి, దాట్ల శ్రీనివాస్, అంబాల శ్రీనివాస్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం




ప్రజాపక్షం/రాయపర్తి : ప్రజలందరూ ఉచిత మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామీడాల యశస్వినీ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏకశిలా హాస్పిటల్స్ హనుమకొండ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ఏకశిల హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్య అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హామ్యా నాయక్, మండల అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు ఊగ మునిత, గ్రామ పార్టీ అధ్యక్షులు కందికట్ల యాకయ్య, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, కృష్ణారెడ్డి, గబ్బెట బాబు, గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, నాగేశ్వరరావు రావు,ఈ రెడ్డి నర్సింహా రెడ్డి, అల్లెంగుల నర్సయ్య, చిర్ర మల్లయ్య,మహమూద్, అఫ్రోజ్, మచ్చ రమేష్, గారే బిక్షపతి, నర్సింహా మూర్తి, గిరాగని వేణు, రాజేందర్, ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా అమలు చేయాలి

భవన కార్మిక శాఖ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ : భవన నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తు గాయపడిన, మరణించిన కార్మికులకు 10 లక్షల ప్రమాద బీమా పాలసీని పెంచాలని భవన కార్మిక శాఖ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు గాయపడిన తక్షణ సాయం కింద 5 లక్షల రూపాయలతోపాటు కోలుకొనే వరకు నెలకు 5 వేల సహాయం అందించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం భవన కార్మికులకు పది లక్షల ప్రమాద బీమా వర్తింప చేస్తుందని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరువ తీసుకొని భవన కార్మికులకు పది లక్షల బీమా అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలబడి సహా యం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమాశేశంలో జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రశాంత్,సుతారి సంఘం అధ్యక్షుడు తోట్ల నర్సింలు,కోటగిరి పరుశరాములు,తోట్ల కిషన్,ఎల్లయ్య,రంగం,రంగయ్య తదితరులు పాల్గోన్నారు.

## ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కానివ్వొద్దు

కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి : జిల్లాలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, మున్సిపల్ పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో రెవెన్యూ నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సంగారెడ్డి, పటాన్చెరు, జిన్నారం సదాశివపేట, హత్నూర, కంది కొండాపూర్ తదితర మండలాలలో చెరువులు కుంటలు ప్ర భుత్వ ఇతర ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో సింగల్ గుంట భూమ కూడా ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి వాటి చుట్టూ పెన్సింగ్ ,బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని చెరువులు కుంటలు ఎఫ్ టీఎల్ పరిధిని అధికారులు సర్వే చేసి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పటాన్చెరు ,జిన్నారం సంగారెడ్డి తదితర మండలాలలోని పెద్ద చెరువుల రికార్డులను వెంటనే సమర్పించాలని రెవెన్యూ ఇరిగేషన్ శాఖల అధికారులు ఆదేశించారు. అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ మున్సిపల్ ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసే ప్రభుత్వ భూములు పరిరక్షించాలన్నారు. ఇతర ప్రభుత్వ స్థలాలు గ్రామస్థాయిలో కాపాడాల్సిన బాధ్యత పంచాతీ కార్యదర్శులదేనన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే పంచాయతీ కార్యదర్శులు రెవెన్యూ అధికారుల సహాయంత నోటీసులు అందజేసి ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ ,మాదురి డిఆర్ఓ పద్మ జారాణి ,ఆర్డిఓ వసంత కుమారి ,నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు ,మున్సిపల్ అదికారులు సంబందిత మండలాల తహసీల్దారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వేగంగా ఆసుపత్రి నిర్మాణం పనులు

కలెక్టర్ టిఎస్ దివాకర

ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి : 200 పడకల ఏరియా ఆసుపత్రి చివరి దశ నిర్మాణం పనులలో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చివరి దశ నిర్మాణ పనులలో వేగం పెంచానలి, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తాత్కాలికంగా ఈ భవనంలో మెడికల్ కళాశాలకు కేటాయించగా 2024–25 విద్య సంవత్సరానికి 50 మంది విద్యార్థులతో మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. అనంతరం మెడికల్ కళాశాల కొరకు కేటాయించిన గ్రౌండ్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సత్యపాల్‌రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ మోహన్‌లాల్, ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ జగదీశ్వర్, ములుగు తహసీల్దారు విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



## చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/వర్ధన్నపేట : వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు, ఖిలా వరంగల్ మండలాల పరిధిలోని వివిధ గ్రా మాలకు చెందిన 63 మంది అర్హులైన లబ్ధిదారులకు 63 లక్షల 7 వేల 30 8 రూపాయల కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను వర్ధన్నపేట ఎమ్మె ల్యే కేఆర్ నాగరాజు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆ యన మాట్లాడుతూ, పేద ప్రజలకు ఎంతో అండగా కళ్యాణ లక్ష్మి పథకం నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు, ఖిలా వరంగల్ మండలాల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నా యకులు అబ్బీ డి రాజీ రెడ్డి, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు,వర్ధన్నపేట ఎమ్మార్వో విజయ్ సాగర్, ఆర్ఐ కృష్ణ స్వామి, అధికారులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువుల ద్వారా అధిక లాభాలు

కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : సేంద్రీయ ఎరువులను ఉపయోగించి అధిక లాభాలు సాధించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ రైతులకు సూచించారు. మంగళవారం జనగామ మండలంలోని వడ్లకొండ గ్రామంలో రోహిణి కార్తెలో నారుపోసి రైతులు నాట్లు వేస్తున్న సందర్భంగా వరి నాట్లు వేస్తున్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. వడ్లకొండ గ్రామంలో మారబోయిన బుచ్చిరాములు వరి నాటు వేస్తుండగా పరిశీలించారు. అనంతరం అదే గ్రామంలో ఆకుల బిక్షపతి రైతు పొలంలో వేసిన పచ్చిరొట్టు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పచ్చిరొటే పంటను వేయడం వలన భూసారం పెరుగుతుందన్నారు. భూమిలో సేంద్రీయ పదార్థం పెరగడం వలన ఈరు నిలుపుకొనే సామర్థ్యం పెరుగుతుందని, అన్ని రకాల పోషకాలు అందడం వలన అధిక దిగుబడులు వస్తాయని రైతులకు సూచించారు. వరి పంటను పరిశీలించిన వారిలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్, ఏఓలు ఉన్నారు. మహిళలతో కలిసి కలెక్టర్ వరి నాటు వేశారు. రైతుల నుండి పొలం చదును చేయడం, కూలీల ఖర్చు, వందుల వంటి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**రైతు భరోసాపై మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్**

రాష్ట్ర వ్యవసాయ, హాండ్లూమ్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంగళవారం పలువురు రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వయించారు. జనగామ మండలంలోని నానుగుపహాడ్ గ్రామ రైతులతో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వయించి రైతు బరోసా పథకంపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాకర్ల శ్రీనివాస్ అనే రైతు మాట్లాడుతూ పది ఎకరాల లోపు రైతులకు మాత్రమే రైతు బరోసా అందించాలన్నారు. నిజమై రైతులు, పంటలు సాగు చేసే రైతులకు మాత్రమే ఈ పథకం అందెలా చూడాలనారి, రైతు రుణమాఫిలో భాగం కౌలు రైతులకు సైతం ఎలాంటి ఆంక్షలు లేకుండాఇ మాఫీ చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రైతుల అభిప్రాయాన్ని వ్రాతపూర్వకంగా పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్‌తో పాటు ఏఓలు పాల్గొన్నారు.



## చిన్న కాళేశ్వరం పంప్‌హౌస్ పనులు పూర్తిచేయాలి

కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/మహాదేవపూర్/ కాళేశ్వరం : మహాదేవపూర్ కాటారం మండలాలలో మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యటించారు. మొదటగా కాళేశ్వ ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అంతరాష్ట్ర వంతెనను పరిశీలించి బీరీసాగర్ వద్ద చిన్న కాళేశ్వరం మరమ్మత్తు పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా మూడు పంప్‌హౌజ్‌లను ఏర్పా టు చేయాల్సి ఉండగా రెండు పూర్తయ్యాయని మరో పంఫ్‌హౌజ్ వచ్చే నెలలో పూర్తి అవుతుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. త్వరగా పంప్‌హౌజ్ పనులు పూర్తి చేసి మరమ్మత్తు పనులతో పాటు ప్రత్యామ్యాయంగా విద్యుత్తు సరఫరా పునరుద్దరణ పనులు చేపట్టాలని అదేశించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మహాదేవపూర్ మండలంలోని ఎర్ర చెరువు, మంద్రం చెరువు, కొత్త చెరువు, పరిధిలోని దాదాపు పదివేల అదనపు ఆయకట్టు సాగుకు నీరందించనున్నట్లు తెలిపారు. కాటారం మండలం గారపల్లి వద్ద కాళేశ్వరం రెండవ దశ ఎత్తిపోతల పథకం పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. చిన్న కాళేశ్వరం పంప్‌హౌజ్ ద్వారా మహాదేవపూర్, కాటారం , మహాముత్తారం పలిమెల, మండలాలతో దాదాపు 45 వేల ఎకరాలకు అదనంగా సాగు నీరు అందించేందుకు అవకాశం ఉందని అన్నారు. గారెపల్లి పంప్‌హౌజ్ ద్వారా 2 నుండి 13 చెరువులకు నీటిని అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సంవత్సరం పంటలకు సాగు నీరందించాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు పనులు జరుగుతున్నాయని అన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 65 గ్రామాల రైతుల పంట పొలాలకు సాగు నీరు అందుతుందని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు అందజేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం చేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈలు యాదగిరి, తిరుపతి రావు, డిప్యూటి తహసీల్దార్ కృష్ణ, కాటారం తహసీల్దార్ నాగరాజు,ఇరిగేషన్ ఏఈ వజయ్ కుమార్,మెగా ప్రాజెక్టు సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ పాషాతదితరులు పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



ప్రజాపక్షం/నిజాంపేట్ : నిజాంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో మంగళవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎఎస్ఐ జైపాల్‌రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి సమాజంలో యువత చెడు దారిన పయనిస్తున్నారని గంజాయి గుట్కా పాన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం మారక ద్రవ్యాల నిర్మూలనపై రాత పరీక్ష నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానమాల, పోలీస్ సిబ్బంది సాయిబాబా, వినోద్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాలాలను పరిశీలించిన కలెక్టర్

ప్రజాపక్షం/పరకాల: పరకాల పురపాలక సంఘం పరిధిలోని పలుచోట్ల ఉన్న డ్రైనేజీ నిర్మాణం కోసం నాలాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఆదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ఇతర అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పరకాల నుండి హుజురాబాద్ రోడ్‌లోని బండ్ల బాట వద్ద డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించిన సర్వే పనులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డిఓ డాక్టర్ కె.నారాయణ, ఎసిపి కిషోర్ కుమార్, పురపాలక సంఘం కమిషనర్ సర్సింగం సర్వే, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాపక్షం ఎఫెక్ట్



ప్రజాపక్షం /గార్ల : మండలంలో జోరుగా రేషన్ బియ్యం అక్రమ దందా అనే శీర్షికన ప్రజాపక్షం మేయిన్‌లో సోమవారం నాడు వచ్చిన కథనానికి గార్ల మండల పోలీసులు స్పందించారు. మంగళవారం కొందరు అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాని పట్టుకుని పలువురిపై కేసు నమోదు చేశారు. గార్ల ఎస్ఐ ఎన్ జీనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం మండల పరిధిలోని మర్రిగూడెం, సరిహద్దుతండా గ్రాయమాలలో గార్ల పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా గ్రామంలోని ప్రజ ల నుండి రేషన్ బియ్యాని ఇద్దరు వ్యక్తులు తక్కువ దరకు విక్రయించి 28 బస్తాల బియ్యాన్ని ఒక చెట్టు క్రింద నిల్వచేశారనే సమాచారంతో బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న కారెపల్లి మండలం మేకల తండాకు చెందిన భూక్య రమేష్ , మాలోత్ రమేష్‌లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జీనత్ కుమార్ తెలిపారు.

## సిద్దిపేట ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : సిద్దిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆసుపత్రి డాక్టర్లను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సిద్దిపేట ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను కలియ తిరిగి.. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిద్దిపేట ఏరియా ప్రాంతీయ ఆసుపత్రిలో అన్ని రకాల అత్యాధునికమైన వైద్య సేవలు ఉచితంగా పేద ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఆసపత్రులకు వెళ్లకుండ ప్రజలు సర్కార్ ఆసుపత్రి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రసూతి వార్డును పరిశీలించి రోజుకు ఎన్ని ప్రసవాలు చేస్తున్నారని, వాటిలో ఎన్ని సాధరణ ప్రసవాలు జరుగుతున్నాయని తెలుసుకున్నారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ హామ్‌ను పరిశీలించి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఇందులో అత్యాధునికమైన వైద్య పరికరాలు ఉన్నందున నిర్ణిత సమయంలో రక్త పరీక్షలు నిర్వహించి ఫలితాలను అందించాలన్నారు. ఆరోగ్య శ్రీ కౌంటర్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని విభాగాల్లో డాక్టర్లు,నర్సులు ఇతర సిబ్బంది ఆసుపత్రిలో విధులు సక్రమంగా నిర్వహించాలిన రోగులకు వైద్య సేవలు అందించాలన్నారు. కలెక్టర్ వెంట ఆసపత్రి సూపరింటెండెంట్ కిషోర్ కుమార్, ఆర్ఎం సదానందం, ఆయా విభాగాల డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మానవాళికి పెను ప్రమాదం

**నేడు మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం**

ప్రజాపక్షం/హైదరాబాద్: డ్రగ్స్ పెనుభూతం మానవాళికి పెను ముప్పుగా మారింది. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారింది. పెరుగుతున్న విదేశీ సంస్కృతి పట్టణాల నుంచి పల్లెల వరకు వ్యాపించింది. విదేశీ బాష, వేషదారణతో పాటు వారి అలవాట్ల తోపాటు డ్రగ్స్ మన దరికి చేరాయి. పాత కాలంలో ఇప్పా పువ్వు సారా, ప్రభుత్వాలు అమ్మకాలు సాగించిన సారాతోపాటు ప్రకృతి వరప్రసాదంగా లభించే ఈత, తాడి కల్లు మాత్రమే శ్రమకు విశ్రాంతి కలిగించే మత్తు పదార్థాలుగా చెలమణిలో ఉండేవి. కాని వీటి స్థానంలో మద్యం, వైన్, విస్కీ బ్రాండిలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మోతాదు వినియోగంతో వీటి వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. ప్రస్తుతం ఎప్పుడు వినని, కనని పేర్లు కలిగిన డ్రగ్స్ మార్కెట్లో వచ్చాయి. డ్రగ్స్తో పాటు మందుల తయారీలో వినియోగించబడే ఔషద మొక్కగా పిలువబడే గంజాయి కూడ డ్రగ్గా మారింది. మత్తును కలిగించే డ్రగ్స్తో ప్రపంచ వ్యాప్తంగా 27 కోట్ల మంది బానిసలుగా మారారని ప్రపంచ ఆరోగ్య సంస్థ జూన్ 26ను మాదకద్రవ్యాల, వినయోగం, రవాణ వ్యతిరేక దినంగా గుర్తించింది. ప్రతియేటా జూన్ 26న ప్రపంచ దేశాలతోపాటు రాష్ట్రాల్లో డగ్స్ వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటారు.



**డ్రగ్స్ వినియోగంలో తెలంగాణ**

తెలంగాణలో డ్రగ్స్ వినియోగం ఈ మధ్యా కాలంలో గంజాయి, నార్కోటిక్ డ్రగ్స్ కూడ పట్టణ ప్రాంతాల్లోని వారికి అక్కడక్కడ అందుబాటులోకి వచ్చాయి. డ్రగ్స్ రూపంలో గంజాయి, గంజాయి చాక్లెట్లు, హాశీష్ అయిల్, ఒపియం, ఎండిఎంఎ, ఎల్ఎస్డి లాంటి డ్రగ్స్ హైదారబాద్తోపాటు పెద్దా పట్టణాల్లో లభిస్తున్నాయి. ఇలాంటి డ్రగ్స్ ఎక్కువగా విదేశాల నుంచి గోవా, బెంగూళూరు మీదుగా చాల ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. డ్రగ్స్ వినియోగం శరీరానికి ప్రమాదాం కలిగిస్తుంది.

**డ్రగ్స్ కంట్రోల్, ఎక్సైజ్, పోలీస్ దాడులు**

తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు కొన్ని పట్టణాల్లో డ్రగ్స్ వినియోగంలో ఉన్నట్లు అందరికి తెలుసు. ఈ మేరకు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ మెంట్ విభాగంలో పనిచేస్తున్న పోలీసులు డ్రగ్స్ రవాణ, వినియోగం, ఉత్పత్తి లాంటిపై దాడులు నిర్వహిస్తు పట్టుకుంటున్నారు. కేసులు నమోదు చేసి వారికి తగిన శిక్షలు పడే విధాంగా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ తోపాటు, పోలీస్‌లు, పోలీస్‌లు దాడులు నిర్వహిస్తున్న డ్రగ్స్ను పట్టుకుంటున్నారు. తెలంగాణ అబ్కారీ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వివి కమలాసన్రెడ్డి, అదేశాల మేరకు సిబ్బంది హైదరాబాద్‌లో ముమ్మర దాడులు నిర్వహిస్తున్నారు. డ్రగ్స్ పాటు భారీగా గంజాయిని కూడ పట్టుకుంటున్నారు. ఈ మేరకు తగిన పతిలితాలను సాధిస్తున్నారు. డ్రగ్స్ తోపాటు ఆగస్టు 31 నాటికితెలంగాణలో ఎక్కడ కూడ నాటుసారా తయారీ, వినియోగం లేకుండా చేయడానికి ముమ్మర దాడులు చేయాలని ఉన్నతాధికారులు అదేశించారు.



**గంజాయి సమాచారం**

గంజాయి ఎక్కువగా ఒరిస్సా, ఏపీ (ఆంధ్రప్రదేశ్)లోని విశాఖ ఎజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా గంజాయి సాగు అవుతుంది. దేశంలో గంజాయి సాగులో ఏపీ మొదాటి స్థానంలో ఉన్నట్లు డైరెక్టర్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) గణంకాల్లో ధృవీకరించాయి. గంజాయిలో శీలావతి అనే రకానికి బాగా డిమాండ్ ఉంది .(ఈరకం గంజాయి ఎక్కువగా ఘాటు, మత్తును అందిస్తుంది.) ఈ రకం గంజాయి ఎక్కువగా విశాఖ ఎజెన్సీ ప్రాంతాల్లో సాగు చేస్తారు. గంజాయి రెండో రకం ఎక్కువగా ఒరిస్సా రాష్ట్రంలో పండుతుంది. గంజాయి ఎక్కువగా వినియోగం ఉన్న రాష్ట్రాల్లో గోవా, మహారాష్ట్ర, చెన్నై, కర్ణాటక, తెలంగాణ, ఏపీలో ఎక్కువి శాతం వినియోగంలో ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన రాష్ట్రాల్లో కొద్దిపాటిగా ఉన్నట్లు రికార్డులు

**డ్రగ్స్ వినియోగం లేకుండా చేయడమే లక్ష్యం : కమలాసన్‌రెడ్డి**



డ్రగ్స్ వినియోగం మానవాళికి పెను ప్రమాదమని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి కమలాసన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో డ్రగ్స్ వినియోగం పూర్తి నిర్మూలించడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ మేరకు హైదారాబాద్ తోపాటు మిగితా ప్రాంతాల నుంచి దిగుమతిపై ప్రత్యేక నిఘా పెంచామన్నారు. డ్ర గ్స్‌ని పూర్తిగా అరికట్టడానికి మా బాధ్యాతగా దాడులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

# జీతం కోసం కాదు... జీవితం కోసం ఉద్యోగం

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జీతం కోసం కాదు.. జీవితం కోసం ఉద్యోగం ముఖ్యమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ముందుగా చిన్న ఉద్యోగం వచ్చినా వదులుకోవద్దని సూచించారు. మంగళవారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి సాయిరాం గార్డెన్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ నిర్వహించిన మెగా జాబ్‌మేళాను కలెక్టర పమేలా సత్పతి, మానకొండూర్ ఎమ్మెల్యే సతీమణి కవ్వంపల్లి అనురాధతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మానకొండూర్ నియోజకవర్గం నుంచి మెగా జాబ్‌మేళాకు సుమారు 6 వేల మంది హాజరయ్యారని తెలిపారు. అందరూ దాదాపు ఉద్యోగాలు పొంది ఆఫర్ లెటర్లతో ఇంటికెళ్లాలని సూచించారు. తాను నాలుగు ఉద్యోగాలు మారి ఈ స్థాయికి వచ్చానని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశ్యంతో ఇలాంటి జాబ్‌మేళాలను నిర్వహిస్తున్నదని, నిరుద్యోగ యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. 68 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయని, ఇందులో 25 కంపెనీలు స్పాట్‌లోనే ఉద్యోగాలకు ఎంపిక చేసే ఆఫర్ లెటర్లు ఇస్తున్నారని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, లేకపోతే కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని పేర్కొన్నారు. ఏ ఉద్యోగం వచ్చినా ముందడుగు వేయాలని, చిన్న పెద్దా తేడా లేకుండా ముందుకెళ్లాలని సూచించారు. చాలా మంది యువత దళారులకు డబ్బులు అందిస్తూ ఉద్యోగాల పేరిట మోసపోతున్నారని పేర్కొన్నారు. కంపెనీలే మన ముందుకు వచ్చి ఉద్యోగులను ఎంపిక చేసుకోవడం అభినందనీయమని చెప్పారు. మహిళలు పెద్ద ఎత్తున ఉద్యోగాలు పొందాలని సూచించారు. మానకొండూర్ ఎమ్మెల్యే సతీమణి కవ్వంపల్లి అనురాధ మాట్లాడుతూ పురుషులకు ధీటుగా మహిళలు ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికి, ప్రతి కుటుంబానికి ఉద్యోగం అవసరమన్నారు. అవకాశాలను వినియోగించుకుని ఉద్యోగాలు పొందాలని సూచించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే సతీమణి ఉద్యోగాలు సాధించిన వారికి ఆఫర్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్ కనకయ్య, ఎంపిపిలు ముద్దసాని సులోచన శ్రీనివాస్ రెడ్డి, వుట్కూరి వెంకటరమణా రెడ్డి, నాయకులు మోరపల్లి రమణారెడ్డి, కొత్త తిరుపతి రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, వినయ్‌కుమార్, పులి కృష్ణ, శ్రీనాథ్ రెడ్డి, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ల్యాండ్ యుటిలైజేషన్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



ల్యాండ్ యుటిలైజేషన్ సర్వేను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కరీంనగర్‌లోని కరీంనగర్ రూరల్ మండలం ఎంపిడివో కార్యాలయంలో భూ సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, ఎంఈవోలు, ఐకెపి సిసిలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర మాట్లాడుతూ ల్యాండ్ యుటిలైజేషన్ సర్వేను అప్రమత్తంగా నిర్వహించాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి వ్యవసాయ భూములకు సంబంధించిన వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ల్యాండ్ యుటిలైజేషన్ సర్వేలో భాగంగా రాష్ట్రంలో ఐదు జిల్లాలను పైలెట్ ప్రాజెక్టు కింద చేశారని, ఇందులో కరీంనగర్ జిల్లా ఉందని తెలిపారు. వ్యవసాయ భూముల్లో వ్యవసాయం చేస్తున్నారా? నిర్మాణాలు ఉన్నాయా? ప్లాటింగ్ చేశారా? లేదా? అన్ని వివరాలపై సమగ్రంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వేలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కరీంనగర్ రూరల్ మండలంలో ల్యాండ్ యుటిలైజేషన్ సర్వేను నాలుగైదు రోజుల్లో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏమైనా అనుమానాలు ఉంటే అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. సర్వేకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఎంపిడివో సంజీవరావు, ఎంపివో జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తులను సకాలంలో పరిశీలించాలి



**ప్రజాపక్షం/ సుల్తానాబాద్ :** జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సుల్తానాబాద్ మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుల్తానాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ ధరణి దరఖాస్తుల వివరాల పై ఆరా తీసిన కలెక్టర్ పెండింగ్ లో ఉన్న టిఎం 33, పిఓబి వివిధ దరఖాస్తులను రెండు రోజులలో పూర్తి చేయాలని అన్నారు. మండలంలో సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తు సర్వే వారం రోజుల లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సర్వేయర్ ను ఆదేశించారు.

## భూ సేకరణపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి క్రింద చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో సింగరేణి ఆర్జి 1, ఆర్జి 2, ఆర్జి 3 పరిధిలో పెండింగ్ భూ సేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, సింగరేణి పెండింగ్ భూ సేకరణకు సంబంధించి సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సర్వేయర్లను ఆదేశించారు. ఆర్జి 1 పరిధిలో ఉన్న సింగిరెడ్డిపల్లి, ఆర్జీ 2 పరిధిలో ఉన్న పెద్దంపేట, ఆర్జీ 3 పరిధిలో ఉన్న బుధవారం పేట రత్నాపూర్, తుర్కపల్లి, అక్కెపల్లి, లద్నాపూర్ భూసేకరణ, ఆర్&ఆర్ స్థితిగతులపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు జి. సునీత, సింగరేణి అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు సరైన వైద్యసదుపాయాలు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్ ఆద్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ వృద్దుల, వికలాంగుల ఆశ్రమం, స్వాధార్ హోం, బాల సదన్ , శిశుగృహాలను సందర్శించారు. వృద్దాశ్రమంలో ఉన్న వృద్దులు, వికలాంగులతో కలిసి ముచ్చటించారు. వృద్దులకు సరైన వైద్య సదుపాయాలు కల్పించాలని , అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కోరారు. వర్షాకాలంలో వృద్దులకు వ్యాధులు ప్రబలకుండా తగు జ్రాత్తలు తీసుకోవాలని సూచించారు. స్వాధార్‌హోంలో ఉన్న వారితో మాట్లాడుతూ యవ్వనంలో ఆకర్షణకు లోనై దానిని ప్రేమగా భావించి కష్ట పడి చదివిస్తున్న తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. విధ్యార్థి దశలో ఎటువంటి లైంగిక వేధింపులకు గురైతే ఉపాధ్యాయులకు, మిత్రులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. బాలసదన్, శిశుగృహాలలోని వంట, ఆహార పధార్థాలను నిలువ చేసే గదులను తనిఖీ చేశారు. పిల్లల ఆరోగ్య సమస్యలపై శ్రద్ద వహించాలన్నారు. ఎలాంటి న్యాయపరమైన , న్యాయసేవ అవసరమైతే సంప్రదించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, వృద్దాశ్రమం, స్వాధార్ హోం, శిశు గృహ సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని మహిళా శిశు సంక్షేమ అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి 26వ వరకు మహిళా సంక్షేమ శాఖ ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం జడ్పి క్వార్టర్స్ డే కేర్ సెంటర్‌లో బిసి, ఎస్సి, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు పిల్లలలో మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలనపై శిక్షణ కార్యక్రమం, పిల్లలకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సంధర్భంగా అధికారులు మాట్లాడుతూ పిల్లలు, యువత రకరకాల మాధ్యమాల ద్వారా మాదక ద్రవ్యాలు అలవాటు పడుతున్నారని, వారిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ఎక్కువగా శ్రద్ద తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ ధనలక్ష్మి , ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్ శ్రీనివాస్, రూరల్ సిడిపిఓ సబిత, అర్బన్ సిడిపిఓ లక్ష్మి నారాయణ, డిసిపిఓ శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్, 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, మెడికల్ డిపార్ట్‌మెంట్ డాక్టర్లు రంగారెడ్డి, రాజు, రమేష్ తదితరులున్నారు.

## పైసలు ఇవ్వకుంటే వీల్ చైర్ ఇవ్వడం కుదరదు



**ప్రజాపక్షం / జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాతా శిశు కేంద్రంలో మంగళవారం రోజున ఓ బాలింత డిశ్చార్జి కావడంతో ఆమె ఉన్న మొదటి అంతస్తులో గల 102 రూం నుంచి బాలింతను క్రిందకి తీసుకొనిరావాల్సిన పేషెంట్ కేర్ వాళ్ళు డబ్బులు డిమాండ్ చేసి అడగడంతో బాలింత తల్లి ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నానని అన్నది. పేషెంట్ కేర్ వాళ్ళు బలింతను మీరు ఎలా వెళ్తారో వెళ్ళండి మేము వీల్ చైర్ లో తీసుకొనివెళ్ళడం కుదరదు అనడంతో సీజేరియన్ ఐయిన అ బాలింత బిడ్డను ఎత్తుకొని మొదటి అంతస్తు నుంచి నదుచుకుంటూ వెళ్ళడం అక్కడ ఉండే వారిని బాధకు గురిచేసింది అని పేషంట్ కేర్ వారిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల మాతా శిశు కేంద్రంలో అడుగడుకు ఆటంకాలె అని మిగతా పేషంట్స్ బంధువులు ఆరోపణలు చెస్తున్నారు. ఇకనైనా సంబంధింత అధికారులు స్పందించి ఇలాంటివి పునరవృతం కాకుండా చూడాలని మాతా శిశు కేంద్రానికి వచ్చేవారు కోరుతున్నారు.

## వైద్యులు,రోగులకు అందుబాటులో ఉండాలి...



కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** వైద్యులు అందుబాటులో ఉండాలని, రోగులకు సేవలందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట సీహెచ్ సీ, రికార్డ్స్ ను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని మందులు అందించే గది, రక్త పరీక్షల చేసే ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, మందులు నిల్వ చేసే స్టోర్ రూం ను, ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న అదనపు బెడ్స్ గదిని పరిశీలించారు. దవాఖాన లో వైద్యులు, సిబ్బంది ఎందరు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని, జనరల్ వార్డ్ గది కిటికీలకు మస్కిటో నెట్ ఏర్పాటు చేయించాలని జనరేటర్ వినియోగంలోకి తీసుకురావాలని, ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న అదనపు బెడ్స్ గది పనులను వేగంగా పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని సీహెచ్ సీ ఇంచార్జీ డాక్టర్ బాబుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇక్కడ డాక్టర్లు రఘు, ప్రదీప్, సీహెచ్ సీ ఇంఛార్జి డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్ వద్ద మౌళిక సదుపాయాల కల్పన

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రెండు పడక గదుల ఇండ్ల వద్ద లబ్ధిదారులకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పన పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లిలోని కూనారం రోడ్డు వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసి సందర్శించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనుల పురోగతి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, కూనారం రోడ్డు వద్ద గల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం దాదాపుగా పూర్తయిందని, చివరి దశ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం వద్ద లబ్ధిదారులకు అవసరమైన మౌళిక వసతుల పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మున్సిపల్ సంప్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించి మున్సిపల్ అధికారులకు అప్పగించాలని కలెక్టర్ తహసీల్దారు ను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయానికి త్రాగునీటి సరఫరా కోసం మిషన్ భగీరథ పైప్ లైన్ వేయాలని, ఈ పనుల ప్రతిపాదనలు రూపొందించి వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ సుల్తానాబాద్ మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుల్తానాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ ధరణి దరఖాస్తుల వివరాల గురించి ఆరా తీసిన కలెక్టర్ పెండింగ్ లో ఉన్న టిఎం 33, పిఓబి వివిధ దరఖాస్తులను రెండు రోజులలో పూర్తి చేయాలని అన్నారు. మండలంలో సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తు సర్వే వారం రోజుల లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సర్వేయర్ ను ఆదేశించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, తహసిల్దార్ రాజ్ కుమార్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి, లక్ష్యాన్ని చేరుకునేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొంగించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయ భవన సముదాయలంలో గల సమావేశ మందిరంలో గ్రామ సంఘాల నిర్వాహకులు, కమ్యూనిటి కోఆర్డినేటర్లు, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లతో మహిళా శక్తి కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. మహిళా శక్తి కింద మైక్రో ఎంట్రప్రెన్యూర్స్, కుట్టు కేంద్రాలు,పాడి పశువులు, సంచార మత్స్య విక్రయ ఔట్లట్లు, మిల్క్ పార్లర్స్, మీసేవ, ఈవెంట్ మేనేజ్మెంట్, మహిళా క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ వంటి 15 రకాల కార్యకలాపాలు చేపట్టేందుకు మండలాల వారిగా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. జిల్లాలో గల మహిళా సంఘాలకు 78 మీసేవా కేంద్రాలు నెలకొల్పడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. ఔత్సాహిక మహిళా సంఘాలను చేపల పెంపకం వైపు ప్రోత్సహించాలన్నారు. మండలాల్లో అవసరమైన మహిళా శక్తి యూనిట్లను గుర్తించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఇందుకోసం మహిళలు బ్యాంకురుణాలను, స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్‌డిఓ రామకృష్ణ, డిపిఎంలు, ఎపిఎంలు, సిసిలు,విఓఎలు పాల్గొన్నారు.



## ప్రయాణికుల భద్రతే... ఆటో డ్రైవర్ల లక్ష్యం



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** కాలాలను లెక్కచేయకుండా పగలు,రాత్రి తేడా లేకుండా సమయానుకూలంగా ప్రయాణికులను వారి అవసరాలకు అనుగుణంగా గమ్యస్థానాలకు భద్రతతో సురక్షితంగా చేరవేస్తారు. మంగళవారం శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ,ఎస్‌లు ఆటో ఓనర్స్, డ్రైవర్లకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొందరపాటుగా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణం కాకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని అన్నారు. డ్రైవర్లు విధంగా వాహన ఇన్సురెన్స్,ఫిట్‌నెస్,డ్రైవింగ్ లైసెన్స్,ఖాఖీ షర్టును తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ప్రతీ ఒక్క ఆటో డ్రైవర్ ట్రాఫిక్ సమస్యలకు అంతరాయం కలగకుండా బాధ్యతగా ప్రవర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఆటో ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై నిరాధార ఆరోపణలు చేస్తున్న సిడిపిఓపై కలెక్టర్,ఎస్పీకి ఫిర్యాదు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** సిడిపిఓ చేస్తున్న అక్రమాలపై నిజాలు నిర్భయంగా రాస్తే నిరాధార ఆరోపణలు చేస్తున్న ఖానాపూర్ సిడిపిఓ పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్,ఎస్పీకి ఫిర్యాదు చేసిన జర్నలిస్టు నరేష్,అనంతరం వారు మాట్లాడుతూ పెంబి మండలంలోని అంగన్వాడీ కార్యాలయ భవన ప్రారంభానికి జరుగుతున్న జాప్యంపై సిడిపిఓ కు వివరణ కోరగా సదరు అంగన్వాడీ కార్యకర్తతో ఆ విలేఖరికి సంబంధం ఉందని తప్పుడు ఆరోపణలు చేస్తుందని,విచారణ చేపట్టి సిడిపిఓ సరిత పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## సబ్ సెంటర్ ద్వారా ప్రజలకు విస్తృతంగా వైద్య సేవలు

**ప్రజాపక్షం/ సుల్తానాబాద్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు విస్తృతంగా వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. గర్రెపల్లి పీ.హెచ్.సి. పరిధిలో ఉన్న సబ్ సెంటర్లలో అందిస్తున్న వైద్య సేవలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సబ్ సెంటర్ల వారీగా గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్, గర్భిణీ మహిళలకు అందించే టీకాలు, ఎన్.సి.డి స్క్రీనింగ్, సబ్ సెంటర్లలో ఓపి, తదితర అంశాలను కలెక్టర్ ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ సబ్ సెంటర్ల పరిధిలో ఎవరైనా స్త్రీలు గర్భం దాలిస్తే తప్పనిసరిగా ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ జరిగేలా చూడాలని, క్షేత్రస్థాయిలో పని చేసే ఆశా కార్యకర్తలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పని చేయాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీ స్త్రీలు రెగ్యులర్ గా చెక్ అప్ చేయించుకొని, అవసరమైన మందులు వాడే విధంగా ఫాలో అప్ చేయాలని, ప్రతి గర్భిణీ స్త్రీ తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మార్గదర్శకాలు ప్రకారం సబ్ సెంటర్ పరిధిలో ఎన్.సి.డి స్క్రీనింగ్ చేపట్టాలని, ప్రస్తుతం చేస్తున్న స్క్రీనింగ్ పక్కాగా చేపట్టాలని, మధుమేహం, బీపి గుర్తించిన వ్యక్తులకు వెంటనే మందులు అందజేయాలని, మందుల కొరత రాకుండా ఎప్పటికప్పుడు స్టాక్ పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, సుల్తానాబాద్ మున్సిపల్ కమీషనర్ , సుల్తానాబాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఆర్.ఎం.ఓ డాక్టర్ మహేందర్, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## మహిళలు మౌనం వీడి పోలీసులకు ఫిర్యాదు చేయండి

జిల్లాలో షీటీమ్స్ తో మహిళలకు, బాలికలకు మరింత భద్రత, భరోసా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** జిల్లాలోని హాట్స్పాట్ వద్ద షీటీమ్స్ తో నిరంతరం నిఘా జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ 2024 సంవత్సరంలో గడిచిన ఆరు నెలల వ్యవధిలో జిల్లాలో మహిళలను వేధిస్తున్న వారిపై 24 కేసులు, మహిళలను ఈవ్ టీజింగ్ చేస్తున్న వారిపై 18 పెట్టి కేసులు నమోదు చేసి జిల్లాలో ఉన్న మహిళల,విద్యార్థినిల పట్ల జిల్లా షీ టీమ్ అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పి మంగళవారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న షీ టీమ్స్ బృందాలు కళాశాలలో, పాఠశాలల్లో, తెలంగాణ మోడల్ స్కూళ్లలో, రెసిడెన్షియల్ స్కూల్ లలో కేజీబీవీ స్కూళ్లలో,మహిళలు పని చేస్తున్న ప్రదేశాల్లో, బస్టాండ్ ప్రాంతల్లో మహిళలకు, విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్/ ఇవి టీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ లపై 360 అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడారు.మహిళలు చిన్న పిల్లల రక్షణ విషయంలో జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని తెలియజేశారు. మహిళలపై జరుగు నేరాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని మహిళల భద్రత, ఆకతాయిల వేధింపుల నుండి మహిళల రక్షణ కొరకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. పోలీస్ శాఖ మహిళా భద్రతకు కొరకు జిల్లా వ్యాప్తంగా షి టీమ్స్ ఏర్పాటు చేసి ఎన్నో రకాల కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థినీలు, యువతులు, మహిళలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం వారికి అందుబాటులో ఉంటున్నదని చెప్పారు. మహిళలు ముఖ్యంగా సామాజిక మధ్యమాలైన ఫేస్ బుక్, వాట్స్ అప్, ఇన్‌స్టాగ్రామ్ ల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని , ఫోటోలు, వీడియోలను పోస్ట్ చేసే సమయంలో, వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎవరైనా ఆకతయులు మహిళలను,

యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా సంప్రదించాలని, నేరుగా సంప్రదించలేని వారు షీ టీమ్ నంబర్ 87126 56425 డయల్ 100 కు సమాచారం ఇవ్వగలరు మీ యొక్క వివరాలు గోప్యంగా ఉంచడతాయని ఎస్పి తెలిపారు.




BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL

ARB.NO. 115 of 2024

Between:

SHUBHANANDINI CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA- Branch ... Disputant

AND

RAVULA SUSHMA REDDY & Others ... Opponents

4. Sri. Ravula Venkat Reddy, S/o, Soma Reddy, Age: 60 Yrs, Occu: BSNL, R/o: H.No: 24-3- 273/57, New Millennium Bank Colony, Prakashreddypet, Hanamkonda.
7. Sri. Poshala Raghuveer, S/o, Balaiah, Age: 44 Yrs, Occu: Business, R/o: H.No: 2-4-104, Gokulnagar, Depot Road, Hanamkonda.
9. Sri. Palwai Vijaypal Reddy, S/o, Laxma Reddy, Age: 58 Yrs, Occu: Business, R/o: H.No: 2-7-1305, Vijayapal Colony, Phase-II, Waddepally, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-07-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL

ARB.NO. 114 of 2024

Between:

SHUBHANANDINI CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA- Branch ... Disputant

AND

AMGOTHU LAKPATHI & Others ... Opponents

2. Sri. Angothu Thirupathi, S/o, Dasru, Age: 45 Yrs, Occu: Jr.Asst. Emp. Id: 2150699, O/o: Project Officer, ITDA, Eturunagaram, R/o: H.No: 5-163/1, Chandrunayakthanad, Maheshwaram, Narsampet, Warangal.
3. Sri. Jatothu Fakeer, S/o, Dharma, Age: 53 Yrs, Occu: SGT,Emp Id: 2138509, O/o: Govt. T.W.A.H.S(B) E/M, Mahabubabad, R/o: H.No: 1-32, Ward No-1, Kothur, hanamkonda.
4. Sri. Bhukya Balu, S/o, Vebkya, Age: 53 Yrs, Occu: M.P.H.S(M),Emp Id:2120887, O/o: Zonal Office (Maleria), Warangal, R/o: H.No: 3-58, Maheshwaram, Narsampet, Warangal.
5. Sri. Jarpula Rajeeru, S/o, Sardar, Age: 35 Yrs, Occu: Lecturer, Emp Id:1353247, O/o: Govt. Degree College, Rangashaipet, Warangal, R/o: H.No: 5-10, Amrutha Thanda, Maheshwaram, Narsampet, Warangal.
6. Sri. Bhukya Ravinder, S/o, Vebkya, Age: 43 Yrs, Occu: School Asst., O/o:ZPHS,Chenchalacheruvupally, Kunoor, Karimnagar, R/o:H.No: 3-58, Maheshwaram, Narsampet, Warangal.
7. Smt. Rudraveni Vijaya, W/o, Prabhakar, Age: 50 Yrs, Occu: ANM,TTWR School(B), R/o: Q.No: 20, Gurukulam Boys School, Ashoknagar, Khanapur, Warangal.
8. Sri. Vadlakonda Vereender, S/o, Maheshwar, Age: 36 Yrs, Occu: School Asst. Emp Id: 2148240, O/o: ZPHS, Narsimhulapet, Mahabubabad, R/o: H.No: 3-58, Chinnaguduru, Maripeda, Mahabubabad.
9. Sri. Kandika Raju, S/o, Sammaiah, Age: 41 Yrs, Occu: SGT, Emp Id:2128288, O/o: ZPHS, Narsimhulapet, Mahabubabad, R/o: H.No: 2-63, Perumandlagudem, Wardhannapet, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**12-07-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

## ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ భూములకు రక్షణ కల్పించండి



ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు) : ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం అలుబాక గ్రామ పంచాయతీలో ఆదివాసీ భూ సమస్యలపై సమావేశం జరిగింది. సమావేశంలో సతీష్ మాట్లాడుతూ 5వ ఏజెన్సీ ప్రాంతంలో వెంకటాపురం మడలం ఆలుబాక(జెడ్) సర్వే నెంబర్ 14 ప్రభుత్వ భూమిని ఏజెన్సీ ప్రాంత 1/70 చట్టానికి విరుద్ధంగా 1972 సంవత్సరంలో ఆలుబాక గ్రామానికి మైదాన ప్రాంతం నుండి ఏజెన్సీ ప్రాంతానికి వచ్చిన వలస గిరిజనేతరులకు ఎలా పట్టా చేశారని ప్రశ్నించారు. వెంకటాపురం మడలం ప్రభుత్వ భూములను కబ్జా చేసి రెవెన్యూ ఉద్యోగి సహాయంతో రికార్డులను తారుమారు చేస్తూ ప్రభుత్వ భూములను గిరిజనేతరులకు అక్రమ పట్టాలు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసుల ఆధీనంలో ఉన్న వెంకటాపురం మండలం ఆలుబాక(జెడ్) సర్వే నెంబర్ 14/2 భూములను సైతం అక్రమంగా పట్టా చేసుకున్నారని మండిపడ్డారు. వెంకటాపురం మండలంలో రెవెన్యూ అధికారులు రాజకీయ నాయకుల అండదండలతో, పలుకుబడితో ఏజెన్సీ ప్రాంత చట్టాలకు విరుద్ధంగా పట్టాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగం కల్పించిన ఆదివాసుల హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏజెన్సీ ప్రాంత ప్రభుత్వ భూములన్ని గిరిజనేతరుల అక్రమ పట్టా పాస్ పుస్తకాలు పొందారని వాటిపైన సమగ్ర విచారణ జరిపి పట్టాలను రద్దు చేసి గిరిజనేతరులపై ఎల్‌టిఆర్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కంతి నేత్రానంద్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు తాటి రాంబాబు, తుర్స చంటి, సాంబశివరావు, లక్ష్మణ్, తాటి రాజు, తాటి నాగేంద్ర, కాక గోవింద్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై దృష్టి

టిఎన్‌జిఒ మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్




ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టిఎన్‌జిఒ మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక టిఎన్‌జిఒ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు గత మూడు సంవత్సరాలుగా ఆర్థిక ఆర్థికేతర అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించే బాధ్యత నూతన ప్రభుత్వంపై ఉందని ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టి వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మినీకి రాజ్ కుమార్, సంఘం నాయకులు గాండ్ల అనురాధ, ఎండి ఇక్బాల్ పాషా, మాణిక్యాల చంద్రశేఖర్, మంగ మనోహర్, ఎండి ఫజులుద్దీన్, కోటి రఘునాథరావు, లీల, చిరంజీవాచార్యులు, పంపరి శివాజీ, రాధా, విష్ణువర్ధన్ రెడ్డి, గోపాల్, దోమ మరియ, ఆరేళ్ల రామాగౌడ్, సూర్య శ్రీనివాస్, కె శేషాచారి, కె అశోక్ రెడ్డి, నిఖిల్ శ్రీనివాస్, శ్రీ హర్ష, శేఖర్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు

## సమన్వయంతో పనిచేస్తే ఫలితాలు



ప్రజాపక్షం/కోరుట్ల : అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు వస్తాయని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం కోరుట్ల మండలంలోని మోహన్ రావు పేట, పైడి మడుగు, కోరుట్ల పట్టణంలో గ్రామ పంచాయతీలను కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రామాలలో మురుగు నీరు నిల్వ ఉండకుండా శానిటేషన్ ఎప్పటికప్పుడు చేస్తున్నారా అని, మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ సరఫరా అవుతున్నాయా లేదా అని సర్వే ద్వారా తెలుసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వాలు ఉండకుండా, ఇండ్లలోకి నీరు వెళ్ళకుండా నీటిని దారి మళ్లించి పెద్ద డ్రైనేజిని నిర్మించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు వసతులు, మందులు అందుబాటులో ఉన్నాయా, సిబ్బంది పేషెంట్లకు అందుబాటు లో ఉంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన డయాలసిస్ సెంటర్‌ను, నిర్మాణంలో ఉన్న హాస్పిటల్ కొత్త బిల్డింగ్‌ను పరిశీలించారు. డిఆర్‌డివో సంపత్‌రావు, కోరుట్ల ఆర్‌డిఓ. ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

## అందరికీ మార్గదర్శకులు

(మొదటి పేజీ తరువాయి)

సంతరించుకుంది. జీవన్‌రెడ్డితో భేటీ అనంతరం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు మీడియాతో మాట్లాడారు.ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తమందరికి సీనియర్ నాయకులని, అతను తమందరికి మార్గదర్శకులని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి అనుభవాన్ని ప్రభుత్వ నడపడం కోసం తప్పనిసరిగా వినియోగించుకుంటాం అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ జెండాను భుజాన మోస్తూ పార్టీ భావజాలాన్ని చట్టసభల్లో వినిపించిన సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి అని తెలిపారు.ఈ ప్రభుత్వం నడవడం కోసం వారి ఆలోచనలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకుంటాం అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సీనియార్టీకి ఎలాంటి భంగం కలిగించకుండా పార్టీ సముచిత ప్రాధాన్యమిస్తూ గౌరవిస్తుందని తెలిపారు.

## అనవసరంగా వాయిదా వేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీం కోర్టు.. మరో కేసులోనూ ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం తీరుపై ఇలా వ్యాఖ్యానించింది. తన బెయిల్ పిటిషన్‌ను విచారించకుండా ఢిల్లీ హైకోర్టు సుదీర్ఘకాలం వాయిదా వేయడంపై మాజీ మంత్రి సత్యేందర్ జైన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిని పరిశీలించిన జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీలతో కూడిన ధర్మాసనం.. 'బెయిల్ వ్యవహారాలను అనవసరంగా వాయిదా వేయకూడదని చెప్పనవసరం లేదు. అందుకే తదుపరి విచారణ తేదీన హైకోర్టు నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం' అని పేర్కొంది. జులై 9న హైకోర్టు విచారణ చేపట్టనుంది. మరోవైపు, అరవింద్ కేజ్రీవాల్‌కు సంబంధించి ట్రయల్ కోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర నిలిపివేత ఉత్తర్వులు ఇవ్వటంపైనా సుప్రీంకోర్టు ఇటీవల ఆశ్చర్యం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. హైకోర్టు తీర్పును రిజర్వులో ఉంచడాన్ని 'అసాధారణ నిర్ణయం'గా అభిప్రాయపడింది. కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే ఇస్తూ హైకోర్టు నిర్ణయం వెలువడిన నేపథ్యంలో జూన్ 26న సుప్రీంకోర్టు విచారణ జరపనుంది.

# వామపక్ష విద్యార్థి నాయకులతోనే సమాజంలో మార్పు




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై హేతుబద్ధతతో తిరుగుబాటు

శాస్త్రీయ విద్యా విధానంపై ఉద్యమించాలి

కరీంనగర్‌లో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల ప్రారంభంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : వామపక్ష విద్యార్థి నాయకులతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, విద్యను అర్జిస్తూనే హేతుబద్ధతతో ఆలోచించి పాలనను శాసించే ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో మంగళవారం ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక, సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులకు కూనంనేని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకు ముందు ఎఐఎస్‌ఎఫ్ జెండాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆవిష్కరించారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యను కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చి విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయన్నారు. నీట్ పరీక్షలో పేపర్ లీక్ అవతకవకలు జరిగాయని దేశమంతా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యాన్ని మరువకముందే దేశవ్యాప్తంగా నిర్వహించిన యుజిసి నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్, యుజిసిఎన్‌ఏటి పరీక్షలో జరిగిన అవతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, తక్షణమే అందుకు బాధ్యులుగా కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు టిసిలు ఇవ్వని పరిస్థితుల్లో ప్రభుత్వమే ప్రైవేట్ కళాశాలలకు బాధ్యత వహించాలన్నారు. పరిపాలనకు, సమాజానికి సంబంధం లేకుండా దేశంలో క్లిష్టమైన పరిస్థితుల్లో ఉందన్నారు. పాలనను ప్రతిబింబించే సమాజంపై తిరుగుబాటు చేయాలన్నారు. విద్యను అర్జించే వారికే ఆ హక్కు ఉంటుందని, హేతుబద్ధతతో ఆలోచించి ముందుకు పోవాలన్నారు. ప్రజాస్వామిక లౌకిక దేశం అనే భావన పక్కనపెట్టి మతపరమైన హిందూ దేశంగా మోదీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం చేసిందని మండిపడ్డారు. కారుచీకటిలో కాంతిరేఖలో వెలుగులు నింపడమే కమ్యూనిస్టుల ఆలోచన విధానమన్నారు. చేగువేరా, భగత్‌సింగ్ విప్లవవీరులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థి సంఘ నాయకులకు హేతుబద్ధ విధానం, సామాజిక స్పృహ ఉండాలని, శాస్త్రీయ విద్యా విధానాం కోసం ఉద్యమించాలన్నారు. 80 శాతం సంపద వంద కుటుంబాల చేతుల్లో ఉండగా దేశాన్ని శాసిస్తున్నారన్నారు. ఒక్క సిరాచుక్క లక్షల మెదడులను ప్రభావితం చేయగలుగుతుందని, జిల్లాలో ఎఐఎస్‌ఎఫ్ నిర్మాణాత్మక కమిటీలు బలోపేతం చేసి సమాజ మార్పునకు కృషి చేయాలన్నారు. ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గత50 సంవత్సరాల అనుభవంలో విద్య కాషాయీకరణ, శాస్త్రీయ విద్యావిధానం అమలు జరగడం లేదని వాపోయారు. విద్యనందించే ఉపాధ్యాయులకే ఉత్తమ శిక్షణ ద్వారానే మార్పు సాధ్యమవుతుందన్నారు. నాణ్యమైన విద్య అందడం లేదని, కేవలం సర్టిఫికెట్లు సాధిస్తే ఉద్యోగాలు ఎలావస్తాయని ప్రశ్నించారు. జ్ఞానం కోసం చదివి నైపుణ్యం సంపాదించుకుంటే జీవితంలో ముందుకు పోతామన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర మాజీఅధ్యక్షుడు సృజన్ కుమార్, మాజీ జాతీయ నాయకుడు మహేందర్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రఘురాం, సోతుకు ప్రవీణ్, రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, జనార్ధన్, అంజి, సంతోష్, వెంకటేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాలను నిర్భయంగా వెలికితీస్తున్న 'ప్రజాపక్షం'

'ప్రజాపక్షం' కరీంనగర్ జిల్లా ఎడ్యుకేషన్ స్పెషల్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : నిజాలను నిర్భయంగా వెలికితీస్తూ సమాజంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును 'ప్రజాపక్షం' దినపత్రిక సాధించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశిరావు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ప్రజాపక్షం' దినపత్రిక రూపొందించిన కరీంనగర్ ఎడ్యుకేషనల్ స్పెషల్ సంపుటిని ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటిఎప్పుడు సమాజంలో మంచి, చెడులను, అవినీతికి వ్యతిరేకంగా, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలపక్షంగా పనిచేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిరంతరం ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా 'ప్రజాపక్షం' నిలుస్తోందన్నారు. విద్యారంగంలో కరీంనగర్ జిల్లా ఘనకీర్తిని చాటుకుందన్నారు. జిల్లాలోని విద్యావ్యవస్థ తీరుతెన్నులపై 'ప్రజాపక్షం' కరీంనగర్ జిల్లా ఎడ్యుకేషనల్ స్పెషల్ సంపుటిని రూపొందించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం 'ప్రజాపక్షం' దినపత్రిక యాడ్స్ మేనేజర్ మదన్ జిల్లా విలేకరుల బృందంతో సమావేశమై అభినందనలు తెలియజేస్తూ దినదినంగా 'ప్రజాపక్షం' దినపత్రిక అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. సమావేశంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మన్, సిపిఐ నాయకులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజు, 'ప్రజాపక్షం' కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో పంజాల శ్రీనివాస్ గౌడ్, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి కొత్తపెల్లి చేతన్ క్రాంత్, నజీరుద్దీన్ (జమ్మికుంట), సురేష్ (కరీంనగర్ టౌన్), శ్రీనివాస్ (శంకరపట్నం), బూరుగు ప్రభాకర్ (గంగాధర), సాయి గౌడ్(చొప్పదండి), సతీష్ (వీణవంక), రమేష్(ఇల్లందకుంట) తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధతతో పార్టీలో పనిచేయాలి

సోములగూడెం ఎంపిటిసితో సహా 100 కుటుంబాలు సిపిఐలో చేరిక

ఆహ్వానించిన కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పార్టీలో చేరిన వారితో సహా ప్రజా సంఘాల బాధ్యులు ప్రజలతో మమేకమై నిబద్ధతతో పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని సోములగూడెం ఎంపిటిసి మద్దుల మోహన్‌రావు, బాలినేని వీరయ్య, లక్ష్మయ్య, జమ్ముల వెంకట్రావు, సత్యనారాయణ, పూసం నాగమణి, రాములమ్మల ఆధ్వర్యంలో కూనంనేని, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా సమక్షంలో సోములగూడెం, కమ్మరిగూడెం గ్రామాల నుంచి 100కుటుంబాలు సిపిఐలో చేరాయి. వారికి కండువా కప్పి ప్రాథమిక సభ్యత్వాన్ని కూనంనేని అందజేశారు. కార్యక్రమంలో ముత్యాల విశ్వనాధం, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, అడుసుమిల్లి సాయిబాబా, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, దుగ్గిరాల సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, ముత్యాల కిరణ్, వెంకట్రావు, రమేష్, వెంకటేశ్వర్లు, విజయ్, శేఖర్, సతీష్, లాల్‌పాషా, చక్కరయ్య, గిరి, రంజిత్, వెంకటరమణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.



## నామమాత్రపు మద్దతు ధర శోచనీయం







రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా మద్దతు ధర ప్రకటించడం శోచనీయం, ఇది కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానానికి నిదర్శనం అని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. మంగళవారం రైతు సంఘం నిర్మల్ జిల్లా సమావేశం టిఎన్‌జిఒ భవనంలో ఎస్‌ఎన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి పశ్య పద్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు మద్ధతు ధర కేవలం 14 పంటలకు ప్రకటించడం శోచనీయమన్నారు. అన్ని రకాలప పంటలకు ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్వామి నాథన్ సిఫారుసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీకి కట్ ఆఫ్ డేట్ పెట్టవద్దని అన్నారు. రుణమాఫి రూ.2లక్షలు ఒకేసారి చేయాలని. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని, రైతులకు నమ్మకం కల్పించాలన్నారు. రుణమాఫీ చట్టం తీసుకురావడానికి రైతులు ఐక్యమత్యంతో ఉండాన్నారు. పల్సి రంగారావ్ ప్రాజెక్టువలన గుండెగావ్‌కు నష్టం వాటిల్లుతుందన్నారు. గడ్డాన్ని వాగుకు పిల్ల కాలువలు చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ రైతు పంట రక్షణకు పంటల బీమా ప్రభుత్వమే భరించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు చిల్కా దేవిదాస్, రాష్ట్ర కార్యదర్శి కంజర్ల భూమయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేశ్వర్, నిజామాబాదు జిల్లా రైతు సంఘం కార్యదర్శి టి.మల్కన్న, పాల్, వాడుకరి లక్ష్మణ్, తోకల విశ్వనాథ పాల్గొన్నారు. సమావేశంలో రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్‌ఎన్ రెడ్డి, ప్రధానకార్యదర్శిగా ఎల్‌ఆర్ ఉపాలి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.ఉపాలి, ఉపాధ్యక్షుడిగా తోకల విశ్వనాధ్, సహాయకార్యదర్శిగా వాడేకర్ లక్ష్మణ్, కోశాధికారిగా తోకల లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు.

**కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరకు వ్యతిరేకంగా రైతు సంఘం నిరసన**

కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రకటించిన నామమాత్రపు మద్దతు ధరకు వ్యతిరేకంగా నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలకు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించి రైతున్నను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌ఎన్ రెడ్డి. కంజర్ల భూమయ్య, ఆర్.ఉపాలి, రాజేశ్వర్, మల్కన్న తోకల విశ్వనాథ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ సమస్యలపై ముఖ్యమంత్రికి నివేదిక

త్రిసభ్య కమిటీ సభ్యులు చిన్నారెడ్డి, కోదండరామ్, దివ్య



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉద్యోగులు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి త్వరలోనే ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి నివేదిక సమర్పించాలని త్రిసభ్య కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య నిర్ణయించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తరచూ భేటీ కానున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జి.చిన్నారెడ్డి, కోదండరామ్, దివ్య రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. కింది స్థాయి నుంచి ఉన్నత ఉద్యోగి, అధికారి, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందిన పలు వినతిపత్రాలను త్రిసభ్య కమిటీ సభ్యులు అధ్యయనం చేశారు. ఆయా సంఘాల నుంచి సిఎంకు అందిన వినతిపత్రాలపై కూడా కమిటీ సభ్యులు చర్చించారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగు లు, అధికారులు, ఉపాధ్యాయుల సమస్యలపై తరచూ భేటీ కావాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయుల స్నేహపూర్వక ప్రభుత్వమని, ఈ వర్గాలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కరించేందుకు సిఎం సూచనలతో ముందుకు సాగుతామని డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు

## ప్రైవేటు పడగ

(మొదటి పేజీ తరువాయి)

కృషి ఫలితంగా ఇప్పటి ఇల్లందులో 1887లో తొలిసారి బొగ్గు తవ్వకం ప్రారంభమైంది. దక్కన్ కంపెనీ పేరుతో తొలి నాళ్లలో బొగ్గు తవ్వకాలు జరిపారు. 1921లో దక్కన్ కంపెనీని ఇంగ్లాండ్ నుంచి మద్రాస్‌కు తరలించి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ గా పేరు మార్చారు. విలియం కింగ్ అన్వేషణ బొగ్గును వెలికితీయాలన్న బ్రిటిష్ అధికారుల నిర్ణయం మేరకు సింగరేణి విస్తరణ ప్రారంభమై ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం లోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. భూగర్భ గనుల ద్వారా బొగ్గు వెలికితీయడంతో ప్రారంభమై ఉపరితల గనుల ద్వారా బొగ్గు తీస్తున్నారు. గతంలో 39 కేంద్రాల బొగ్గును ఉత్పత్తి చేసే సింగరేణిలో ఇప్పటికే భూ గర్భ గనులు మూతపడగా ఉపరితల బొగ్గు గనుల్లో సైతం బొగ్గు ఉత్పత్తి తగ్గిపోయింది. కొత్త బొగ్గు బ్లాకులను సింగరేణి అన్వేషించింది. కాని సింగరేణి అన్వేషించిన బొగ్గు గనులను కేంద్రం వేలం వేయడానికి సిద్ధమైంది. ఇప్పటికే ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు గనులను వేలం వేసింది.

**కేంద్రం వేలం పాట బిఆర్‌ఎస్ మద్దతు :** కేంద్రం సింగరేణి పరిధిలోని బొగ్గు నిక్షేపాలను వేలం వేస్తుంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ మౌనం వహించింది. కనీసం సింగరేణిని వేలం పాటలో కూడా పాల్గొనని య్యలేదు. ఇప్పుడు సింగరేణి పట్ల పేద అరుపులు అరుస్తున్న బిఆర్‌ఎస్ నాయకత్వం సింగరేణి పరిధిలోని నాలుగు బొగ్గు గనులను వేలం వేసి ప్రైవేటుకు అప్పగిస్తుంటే మాత్రం చోద్యం చూసింది. కేంద్రం బొగ్గు బ్లాకులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుంది. దీనిని అడ్డుకోకపోతే మరింత ప్రమాదం పొంచి ఉన్నది. ప్రైవేటు సంస్థలు బొగ్గు గనులను వేలం పాటలో దక్కించుకుని కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దోచుకుంటున్నాయి. మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణలో భాగంగానే బొగ్గు బ్లాకుల వేలానికి పూనుకున్నది.

**అధిక ధరలకు కొనుగోళ్లు :** సింగరేణి సంస్థ తో పాటు దేశంలోని బొగ్గు ఉత్పత్తి సంస్థలు ప్రభుత్వానికి టన్ను రూ. 3,500 నుండి రూ. 4,500 లోపు సరఫరా చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ సంస్థల నుంచి రూ.18వేలు టన్ను చొప్పున కొనుగోలు చేసింది. ప్రజా సంపదను ఎంతగా కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతున్నదో అవగతమవుతుంది. ఇప్పటికే బొగ్గు నిల్వాలు లేక సింగరేణి ఆదీనంలోని గనులు మూతపడుతుండగా కొత్త గనులు లేకపోతే 15 ఏళ్లలో సింగరేణి సంస్థ మూతపడే అవకాశం ఉంది. గతంలో 1.20 లక్షల మంది కార్మికులు ఉన్న సింగరేణి సంస్థ కుచించుకుపోయి ఇప్పుడు 42 వేల కార్మికులకు పరిమితమైంది.

**సింగరేణి పరిరక్షణ అందరి లక్ష్యం కావాలి :** సింగరేణి తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద ఉత్పాదక సంస్థగా, ఆర్థిక శక్తిగా, ఉపాధి కేంద్రంగా ఉన్నది. సింగరేణి మూతపడితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపడంతో పాటు ఉపాధి, ఉత్పత్తి, ఆర్థిక రంగాలపై ప్రభావం పడనున్ననేపథ్యంలో గతంలో బిఆర్‌ఎస్, బిజెపి ల మాదిరి నాటకీయ పరిణామాలకు పోకుండా కాంగ్రెస్ సంస్థ మనుగడే లక్ష్యంగా ముందుకు సాగాల్సి ఉంది. కమ్యూనిస్టు కార్మిక సంఘాల పోరాట ఫలితంగానే సింగరేణి మనుగడ సాధ్యమవుతుంది. కమ్యూనిస్టులు, కార్మిక సంఘాలు సింగరేణి మనుగడ కోసం బొగ్గు వేలం పాటను అడ్డుకునేందుకు మరో విప్లవాత్మక ఆందోళనలకు సిద్ధం కావాల్సి ఉంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది ఆధారపడిన సింగరేణి పరిరక్షణ అందరి బాధ్యత కావాలి. ఇక్కడ రాజకీయ డ్రామాలకు, తెరచాటు వ్యవహారాలకు తావిస్తే దేశంలో అతిపెద్ద సంస్థయైన సింగరేణి కాలగర్భంలో కలిసిపోక తప్పదు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు : కలెక్టర్

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించారు. ఈనెల 24న ఆసుపత్రిలో సిజెరియన్ ద్వారా మగబిడ్డకు జన్మనిచ్చిన ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన లోబాడే శోభాను అభినందించి పండ్లు అందించారు. ఈ శస్త్రచికిత్స జరిపిన వైద్యులు, సిబ్బందిని అభినందించి పలు సూచనలు చేశారు. ప్రతీ గర్భిణికి అవసరమైన పరీక్షలు చేసి జిల్లా ఆసుపత్రిలో సురక్షిత కాన్పు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఆసుప్రతిలో ఎక్కువ సంఖ్యలో ప్రసవాలు జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కొన్నుల కొరకు ప్రైవేటు ఆసుపత్రికి వళ్లడం వల్ల ఆర్థిక భారంతో పాటు రోగుల ఆరోగ్యానికి అభద్రత ఉంటుందని అన్నారు. ఆపరేషన్ థియేటర్లోని వసతులపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌ని అడిగి తెలుసుకుని పలు సూచనలు, సలహాలు చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులతో రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైన బెడ్లు, మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ చెన్నకేశవులు, శ్రీనివాస్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## రాష్ట్రంలో ఐదురోజులు భారీ వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల ఐదురోజుల పాటు మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం నుంచి గురువారం వరకు నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలో వర్షాలు కురుస్తాయన్నారు. గురువారంనుంచి శుక్రవారంవరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## ప్రైవేటు వ్యక్తుల భూముల్లో జోక్యం వద్దు : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రైవేటు వ్యక్తుల భూముల్లో జోక్యం చేసుకోవద్దని వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపాల్టీ, రెవెన్యూ అధికారులకు హైకోర్టు ఆదేశించింది. కింది కోర్టు ఇంజంక్షన్ ఆర్డర్ ఇచ్చినా అధికారులు జోక్యం చేసుకుంటున్నారని, తమ పూర్వీకుల నుంచి వచ్చిన భూమిలో అధికారులు జోక్యం చేసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ పి.బస్వరాజ్ ఇతరులు వేసిన పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించారు. కింది కోర్టు ఇంజంక్షన్ ఆర్డర్ జారీచేసినా దానిని అధికారులు పట్టించుకోవడం లేదని పిటిషనర్ న్యాయవాది చెప్పారు. పిటిషనర్లకు చెందిన భూమిని ప్రభుత్వ భూమిగా ఎమ్మార్వో ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. వాదనల తర్వాత న్యాయమూర్తి, ఎమ్మార్వో ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు తమ వాదనలతో కూడిన కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు మున్సిపల్, రెవెన్యూ అధికారులకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను వాయిదా వేశారు.

# హామీలు అమలు చేయండి

**గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచాలి**
**25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి నిర్వహించాలి**
**ఎఐఎస్ఎఫ్ వినతి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులను పెంచాలని, 25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి నిర్వహించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఒయు అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ ఒయు సమతి ఆధ్వర్యంలో ఒయు ప్రధాన లైబ్రరీ దగ్గర ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గురుకుల పోస్టుల నియామకాలలో రిల్ఇంక్విస్మెంట్ విధానం అమలు చేయాలని, రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులపై శ్వేత పత్రం విడుదల చేయాలని, ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి.విద్యార్థి, నిరుద్యోగుల డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గ్రూప్2 గ్రూప్ 3, పోస్టులు పెంచుతామని, 25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సిని నిర్వహిస్తామని, ఉద్యోగ ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేసి, జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు నియమిస్తామని, జి.ఓ నెంబర్ 46, జిఓ నెంబర్ 317 కు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచకుండా, డిఎస్‌సి పోస్టులను కేవలం 11 వేలు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేసి, డిఎస్‌సి అభ్యర్థులను మోసం చేస్తుందని విమర్శించారు. వెంటనే నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక వేదికలపైన నిరుద్యోగ విద్యార్థులు ఓట్లు వేస్తేనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేస్తున్నారని, కానీ నిరుద్యోగుల సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగుల సమస్యల పరిష్కరించడంలో చొరవ చూపాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా విద్యార్థి, నిరుద్యోగులం దశలవారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ ఒయు సహాయ కార్యదర్శి భగత్, నాయకులు రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయండి

**ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని టిఎన్‌జివో కేంద్రం సంఘం కార్యా లయంలో తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ అత్యవసరంగా మంగళవారం సమావే శమైంది. టిజివో అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్, టిఎన్‌జిఒ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమారు 40 సంఘాలు పాల్గొన్నాయి. బకాయి డిఎలను వెంటనే విడుదల చేయాలని, పిఆర్‌సిని అమలు చేసి 50 శాతం పెంచాలని,గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన ఉద్యోగుల జీవోలను అమలు చేయాలని సమావేశంలో తీర్మానించింది. ఉద్యోగుల చెందాతో కూడిన ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని తీర్మానించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఉద్యోగ పెన్షనర్లకు ఆదాయ పన్ను పరిమితిని పెంచేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశంలో కోరారు. సచివాలయంలో హెచ్ఒడిల నుండి 12.5 శాతం కోట అమలు చేసి, ఉద్యోగులను పంపాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని, రిటైర్డ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోరాదని, వారిని తీసుకోవడం ద్వారా ప్రమోషన్లు రాక ఉద్యోగులకు ఇబ్బందిపడుతున్నారని సమావేశం తీర్మానించింది. ఉద్యోగులపైన కక్ష సాధింపు చేస్తూ అక్రమ కేసులను, అక్రమ ఆస్తుల పేరుతో నమోదవుతున్న కేసులు తమను తీవ్ర మనస్థాపానికి గురి చే స్తుందని నాయకులు తెలిపారు.

## హైదరాబాద్‌లో ఇడి దాడులు

**పేద విద్యార్థుల చదువులకు విదేశాల నుంచి నిధులు**
**పక్కదారి పట్టించిన స్వచ్ఛంద సంస్థలు**

**ప్రజాపక్ష/హైదరాబాద్:** విదేశీ నిధుల దుర్వినియోగం చేసారనే ఆరోపణలపై హైదరాబాద్ కేంద్రంలో 11 ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఓం గ్రూప్ సంస్థతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల కార్యాలయాలు, నిర్వాహకుల ఇళ్లపై ఈ దాడులు జరిగాయి. పేద విద్యార్థుల కోసం విదేశాల నుంచి వచ్చే డబ్బును విద్యార్థులకు ఖర్చు చేయకుండా దారి మళ్లించినట్లు తెలిసింది. ఈ మేరకు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌వి)2002, కింద ఆయా సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు విదేశీ నిధులను దుర్వినియోగానికి పాల్పడడంపై ఇటీవలే సిఐడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో రూ.300 కోట్లు దారి మళ్లాయని తేలింది. దీంతో ఇడి రంగ ప్రవేశం చేసింది. ఈ మేరకే దాడులకు కొనసాగించింది. పేద విద్యార్థుల చదువు, భోజనవసతి కోసం ఆస్ట్రేలియా, అర్జెంటీనా, డెన్మార్క్, జర్మనీ, ఫిన్లాండ్, ఐర్లాండ్, మలేషియా, నార్వే, బ్రెజిల్, చెక్ రిపబ్లిక్, ఫ్రాన్స్, రొమేనియా, సింగపూర్, స్వీడన్, స్విట్జర్లాండ్ దేశాల నుంచి హైదరాబాద్‌లోని పలు స్వచ్ఛంద సంస్థలకు భారీగా నిధులు చేరాయి. అయితే ఈ నిధులను ఆయా స్వచ్ఛంద సంస్థలు దుర్వినియోగం చేసి దారి మళ్లించాయి. అయితే విద్యార్థుల నుంచి చదువుల నిమిత్తం రూ.1000 నుంచి రూ.1500 వసూలు చేశారని కూడా దర్యాప్తులో తేలింది. ఇడి దాడుల్లో కీలక డాక్యుమెంట్లు లభించినట్లు తెలిసింది. ఆయా సంస్థలకు చెందిన బ్యాంక్ ఖాతాలను కూడా వారు సీజ్ చేసినట్లు సమాచారం.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రతిపాదన భేష్ : శ్యామ్‌మోహన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల కోసం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేసిన టిపిసిసి మేధావి సెల్ ఛైర్మన్ శ్యామ్ మోహన్ అనంతుల ప్రశంసించారు. మహాత్మాగాంధీ మాటల్లో 'విద్యే సమాజానికి అత్యుత్తమ స్థాయి' ఆయన ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టలు మైనార్టీల కోసం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమన్నారు.

## విద్యార్థినికి వెంకటేష్ ఆర్థికసాయం



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** మాడ్గుల్ మండలం కొలుకులపల్లి గ్రామానికి చెందిన తోడేటి సంధ్య అనే విద్యార్థిని తన తల్లి కొన్ని రోజుల క్రితం చనిపోవడం జరిగింది. సంధ్య తల్లి చనిపోయిన నాటి నుండి జంగారెడ్డిపల్లి గ్రామంలో తన అమ్మమ్మ దగ్గర చదువుకుంది.సంధ్య పై చదువులు చదువుకోవడానికి అమ్మమ్మకు భారంగా మారిందని,తమ అమ్మమ్మ మండే ఈదమ్మ తలకొండపల్లి జెడ్పిటిసి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ను ఆశ్రయించింది. వెంటనే స్పందించిన ఉప్పల వెంకటేష్ తన ఉప్పల చారిటబుల్ ద్వారా సంధ్య ని ప్రజ్ఞ స్కూల్లో 9 తరగతి లో చేర్పించి అందుకు అయ్యే ఖర్చుల నిమిత్తం గాను ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల సంఘం జిల్లా నాయకులు గోపాల్ నాయక్, బిఆర్ఎస్‌యువ నాయకులు బుచ్చిబాబు పాల్గొన్నారు.

## దైవభక్తితో మానసిక ప్రశాంతత

**మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్**



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దైవభక్తితోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని, అందుకే ప్రతిఒక్కరు భగవంతుడిని స్మరించుకోవాలని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మెన్ కొందూటి నరేందర్ అన్నారు. మంగళవారం జేష్ఠ మాసం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని వినాయక గంజ్‌లో ఉన్న శ్రీ మహా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తమ సేవా పథకం సాధించిన సిఐ ప్రతాప్‌లింగంను ఆలయ ట్రస్ట్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఒగ్గు కిశోర్, జూపల్లి శంకర్, పిల్లి శేఖర్, వెంకటేష్‌గౌడ్, మహావీర్, అంతటి కోటి లింగంగౌడ్, శ్రీశైలంగౌడ్, అభిలాష్, గోపాల్ ఉన్నారు.

## పేదరికం చదువుకు అడ్డు కాకుడదు




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** పేదరికం చదువుకు అడ్డు కాకుడదని ప్రతిఒక్కరు చదువుకొని తమ బంగారు భవిష్యత్తుతో జీవితంలో ముందుకు వెళ్ళాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపకుడు కొండా విజయ్ కుమార్ తెలిపారు. డ్రైవరు పనిచేసే అమర్ తన కూతురు తారానగర్‌లోని ఓ పాఠశాలలో పదవ తరగతి చదువుతుందని అమ్మాయి చదువు కొరకు ఆర్థిక సహాయం అందించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ సంప్రదించడంతో విద్యార్థిని అశ్రా సిద్దికి 20 వేల రూపాయల చెక్కును అందించి ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి అమర్, విద్యార్థిని అశ్రా సిద్ధి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పరిరక్షణకు కృషి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శాంతిభద్రతలు, ప్రజాపరిరక్షణలో పేరు పొందిన ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం అని కాంగ్రెస్ సీనియర్ నేతలు చెంది తిరుపతి రెడ్డి, కత్తి శేఖర్ అప్పా అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిఐ ప్రతాప్ లింగం పోలీస్ శాఖలో ఉత్తమ సేవా పథకం పొందిన సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిత్యం పాటుపడుతూ ప్రజారక్షణలో ఎంతో పేరు పొందారని వివరించారు. సిఐ ప్రతాప్ లింగం చేస్తున్న సేవలకు ప్రభుత్వం ఉత్తమ సేవా పథకం ఇవ్వడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ నాడి వైద్యులు డాక్టర్ రవి, తంగిడిపల్లి శంకర్, మేకల వెంకటేష్, నవీన్‌రెడ్డి, బైరమోని శంకరయ్య, గంగాధర్, చందర్, సాగర్, శశిధర్, శ్రావణ్, ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచార్య, ప్రమోద్, కృష్ణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ బోర్డు రద్దుకు కేంద్రం సిద్ధం

**కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి ఎ.గిరిధర్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బ్రిటిష్ పాలన నుండి నేటి వరకు భారతదేశంలో కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి ఎ.గిరిధర్ అన్నారు. కంటోన్మెంట్ పరిధిలో ఉన్న సివిల్ ప్రాంతాలను మునిసిపల్ కార్పొరేషన్లలో విలీనం చేసే విధి విధానాలపై కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ మంగళవారం వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని సివిల్ ప్రాంతాలను మున్సిపాల్ సంస్థలలో విలీనం చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను గిరిధర్ కోరారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిల్ ప్రాంతాలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉందని ఆమె చెప్పారు. సివిల్ ప్రాంతాల తొలగింపు విధివిధానాలను ఖరారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వంతో ఇంకా పంచుకోలేదన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్, కంటోన్మెంట్ బోర్డు సిఇఓ మధుకర్ నాయక్, డిటిసిపి డైరెక్టర్ ఎస్.దేవేందర్ రెడ్డి, జిహెచ్‌ఎంసి చీఫ్ సిటీప్లానర్ రాజేంద్రప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.

## ప్రభాకర్‌రావు రావడం లేదు..

**ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు**
**క్యాన్సర్ చికిత్స పేరుతో అమెరికాలోనే మకాం**



**ప్రజాపక్ష/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) మాజీ చీఫ్ ఐపిఎస్ అధికారి ప్రభాకరరావు బుధవారం హైదరాబాద్‌కు రావాల్సి ఉండగా ఆరోగ్య కారణాల నేపథ్యంలో రాలేక పోతున్నట్లు తెలిసింది. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు ముందుకు సాగే ఒదుకు మరింత సమయం పడుతుంది. ఫోన్ ట్యాపింగ్ కేసు మార్చి 10వ తేదీన ఎఫ్ఐఆర్ కాకముందే క్యాన్సర్ చికిత్స కోసం ప్రభాకరరావు అమెరికా వెళ్లారు. ఈ కేసులో ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి పి.రాధాకాషన్‌రావు, అదనపు ఎస్‌పిలు నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్న, ఎస్ఐబి డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ కుమార్‌లను సిట్ బృందం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరి విచారణలో ప్రభాకరరావు చెబితేనే తాము ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడినట్లు తెలిపారు. దీంతో ప్రభాకరరావుకు నోటీసులు జారీ చేశారు. అయితే తాను అమెరికాలో ఉన్నానని క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్నానని తెలిపారు. దీంతో ప్రభాకరరావును రప్పించేందుకు కోర్టు అనుమతితో రెడ్‌కార్నర్ నోటీసులు కూడా జారీ చేశారు. అయితే తాను ఈ నెల 26న హైదరాబాద్‌కు వస్తున్నట్లు హైకోర్టుకు తాను సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అందరు భావిస్తున్నట్లుగానే ప్రభాకరరావు బుధవారం రావాల్సి ఉండగా రావడం లేదని తెలిసింది. తనకు అమెరికాలో ఇంకా చికిత్స కొనసాగుతుందని బుధవారం రావడం కుదరదని ఈ విషయాలను తన న్యాయవాదుల ద్వారా ఇక్కడి దర్యాప్తు అధికారులకు చెప్పినట్లుగా తెలిసింది.తాను హైదరాబాద్‌కు వచ్చే విషయంపై త్వరలో తెలియజేస్తానని ప్రభాకరరావు తెలిపారు. అయితే నాలుగు నెలల నుంచి కొనసాగుతున్న ఈ కేసు దర్యాప్తు ప్రభాకరావు వద్దకు వచ్చి నిలిచిపోయింది. ప్రభాకరరావు వాంగ్మూలం మేరకు కేసు తదుపరి దర్యాప్తు కొనసాగనుంది, అతను రాకపోతేమాత్రం కేసు దర్యాప్తు మరింత ఆలస్యం జరిగే అవకాశాలు ఉన్నాయి.

# జిహెచ్‌ఎంసి ఆస్తులు డిజిటలైజేషన్

**గేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసికి సంబంధించిన ఆస్తులను డిజిటలైజేషన్ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను అదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో మంగళవారం ఎస్టేట్ విభాగం అదనపు కమిషనర్, అధికారులతో మేయర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి ఆస్తుల ద్వారా ఆదాయ వనరులు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిహెచ్‌ఎంసికి సంబంధించిన ఖాళీ స్థలాలు ఎన్ని ఉన్నాయి, అవి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆస్తులను కేటగిరిగా చేసి, వాటి వివరాలు అందచేయాలని ఆదేశించారు. నెలవారి అద్దె సక్రమంగా వసూలు అవుతున్నాయా, అద్దె సమయం ముగిసినట్లు ముందస్తుగా సంకేతాలు వచ్చే విధంగా ఆన్‌లైన్‌లో మార్పులు చేయాలని సూచించారు. కమ్యూనిటీ భవన్‌లు ఎన్ని ఉన్నాయని, వాటిని దేనికోసం ఉపయోగిస్తున్నారో వివరాలను పూర్తి నివేదిక ఇవ్వాలన్నారు. మోడల్ మార్కెట్, మున్సిపల్ మార్కెట్ గదుల వివరాలు, వినియోగిస్తున్న వాటి వివరాలుఅందచేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. జిహెచ్‌ఎంసికి సంబంధించిన వివిధ రకాల ఆస్తుల వివరాలన్నింటినీ సమగ్ర డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. లీజు వివరాలు, ఆస్తుల వివరాలు అన్నింటిని సిద్ధం చేసుకొని, తదుపరి సమావేశానికి పూర్తి నివేదికతో రావాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కె.శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు. కాగా గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ని ఎల్.బి. నగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ కేశవ్ పాటిల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.ఉపేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.





## జాతీయ ఛాంపియనిషిప్ పోటీలకు మరోసారి ఎంపికైన మణిశంకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్‌పోటీలకు హైదరాబాద్ జిల్లాకు చెందిన ప్రగతి మహావిద్యాలయ కళాశాల విద్యార్థి కె మణి శంకర్ ఐదోసారి ఎంపికయ్యాడు. నాలుగు గోల్ మెడల్స్ సాధించిన శంకర్ ఈ నెల 28 నుంచి తమిళనాడులోని సేలంలో జరగనున్న జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించనున్నారు. అఖిల భారత అంతర్ యూనివర్సిటీ రెజ్లింగ్ ఛాంపియన్షిప్ 2023, 2024లో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థిగా పసిడి పతకాలను గెలుచుకున్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆధ్వర్యంలో 2023–24లో జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 80కేజీల విభాగంలో స్వర్ణాలతో ఛాంపియన్‌గా నిలిచాడు. వీరాభిమాన్య వ్యాయమశాల గంగపుత్ర సంఘం సబ్జిమండి సభ్యులైన కట్ట లింగం కుమారుడైన మణిశంకర్ మరిన్ని పథకాలు సాధించాలని స్థానికులు, ఆకాంక్షించారు.

# బాలుడిని దారుణంగా కొట్టిన వారిని అరెస్టు చేయాలి

**జాతీయ రహదారిపై దళిత, ప్రజాసంఘాల నేతలు ధర్నా**



**ప్రజాపక్షం/షాబాద్ :** దళిత బాలుడిని కులం పేరుతో ధూషిస్తూ అతి దారుణంగా తాడుతో కట్టి కొట్టిన మధుసుదన్‌రెడ్డి అతని కుమారుడు జగన్ మోహన్‌రెడ్డిలపై ఎస్సి, ఎస్టీ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని షాబాద్ మండల దళిత ప్రజా సంఘాల నేతలు మంగళవారం జాతీయ లింకు రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళిత ప్రజా సంఘాల నాయకులు బర్క కృష్ణ ప్రభాకర్, ముక్కు విశ్వం, చందు, చోక్కంపేట్ అంజనేయులు మాట్లాడుతూ కేసారం గ్రామానికి చెందిన బేగరి రాములు అతని కుమారుడు బేగరి యాదగిరి(12) ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి, అదే గ్రామానికి చెందిన మధుసుదన్ రెడ్డి ఇంట్లో ఉన్న జామ చెట్టుకు జామ కాయ తెంపాడు. దీంతో మధుసుదన్‌రెడ్డి అతని కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇద్దరూ కలిసి దళిత బాలుడిని కులం పేరతో ధూషిస్తూ తాడుతో కట్టి చితకబాధడం భాదకరమని ధళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత బాలుని పై జరిగిన విషయం సోషల్ మిడియాలో వచ్చిన తరువాత పోలీసులు స్పందించి కేసు నమోదు చేయడం పై పోలీస్‌ల పై ప్రజలకు నమ్మకం పోతుందని విమర్శించారు. పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు న్యాయం జరగడం లేదని, పోలీస్ ఉన్నత శాఖ అధికారులు స్పందించి దళిత బాలునికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి : సిపిఐ**

దళిత బాలుడిపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని రంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. కాగా దళిత బాలుడిపై దాడి చేసిన కేసారం గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసిన్నట్లు సిఐ కాంతారెడ్డి తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని వివరించారు.

## హైదరాబాద్‌లో దారుణం

**గంజాయికి బానిస చేసి గ్యాంగ్ రేప్**
**గర్భందాల్సిన బాధితురాలు: ఐదుగురిపై పోక్సో కేసు**
**పరారీలో నిందితులు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాలికను గంజాయికి బానిసను చేసిన యువకులు ఆమెపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఐదుగురు నిందితులపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈఘటన హైదరాబాద్‌లోని కాచిగూడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ మహిళ తన కూతురి(15)తో కలిసి సిటీకి వచ్చి కాచిగూడలో ఉంటోంది. ఆ మహిళ కూలీ పనులకు వెళ్తుండగా.. కూతురు స్కూల్ మానేసి ఇంటి వద్దే ఉంటోంది. తల్లి పనికి వెళ్లాక దగ్గరలో ఉండే ఓ అమ్మాయి ఇంటికి బాలిక వెళ్లేది. అక్కడ ఇద్దరూ మాట్లాడుకునేవారు. ఒకరోజు బాలిక నుంచి అమ్మాయి సెల్ఫోన్ తీసుకొని తనకు పరిచయమున్న విజయ్ కుమార్ (23)అనే యువకుడితో మాట్లాడింది. ఈ క్రమంలో ఓసారి అతడు ఆ నంబరుకే ఫోన్ చేయగా ఈ బాలిక మాట్లాడింది. దీంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. బాలిక తల్లి పనికి వెళ్లగానే విజయ్ కుమార్ ఆమె ఇంటికి వచ్చేవాడు. బైక్ పై ఎక్కించుకొని తాను ఉండే నేరేడ్‌మెట్ కు తీసుకువెళ్లేవాడు. ఈ క్రమంలో తన ఫ్రెండ్స్ బాలు (25), కృష్ణ (25), కిరణ్ (24), అజయ్ (25)ను ఆమెకు పరిచయం చేశాడు. అప్పటికే గంజాయికి బానిసైన విజయ్, అతడి ఫ్రెండ్స్ గ్యాంగ్ బాలికను సైతం ఆ మత్తులోకి దించారు. గంజాయి అలవాటు చేసి ఆ మత్తులో బాలికపై ఐదుగురు పలుసార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఇటీవల బాలిక ఆరోగ్యం బాగాలేకపోవడంతో తల్లి హాస్పిటల్ కు తీసుకెళ్లింది. డాక్టర్లు ఆ బాలికకు పరీక్షలు నిర్వహించగా గర్భం దాల్సినట్లు తేలింది. దీంతో కూతురిని తల్లి నిలదీయడంతో జరిగిన విషయం చెప్పింది. వెంటనే బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలిని పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించిన పోలీసులు ఐదుగురు నిందితులపై పోక్సో కేసు నమోదు చేశారు. ఐదుగురు పరారీలో ఉన్నట్లు సమాచారం.త్వరలో నిందితులను పట్టుకుని వారికి శిక్ష పడే విధంగా చార్జిషీట్ వేస్తామని పోలీసులు అంటున్నారు.

# ప్రభుత్వ కళాశాలలో మౌలిక సౌకర్యాలు

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అధ్యాపక బృందం వినతి**



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాల మౌలిక సౌకర్యాలు లేక శిథిలావస్థలకు చేరుకుంటుందని అధ్యాపక బృందం ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్‌కు మొరపెట్టుకున్నారు. మంగళవారం పట్టణంలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కుర్షియాభేగం ఆధ్వర్యంలో అధ్యాపక బృందం సభ్యులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరైన మౌలిక సౌకర్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. తాగేందుకు మంచినీటి సౌకర్యం లేదని, బాత్‌రూంలు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయని, వాష్ బేసిన్లు రిపేర్ చేయాలని, విద్యుత్ వైరింగ్ చేసేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్‌ను కోరారు. కళాశాల చుట్టు ప్రహారి గోడ నిర్మించేందుకు కృషి చేయాలని కోరగా ఇందుకు ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ తక్షణ సహాయం కింద మంచినీటి కోసం ఓఆర్ఆర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఈ కళాశాలను అన్ని విధాల మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కళాశాలకు స్వీపర్‌తోపాటు వాచ్‌మెన్ ఏర్పాటుకువిషయంలో సంబంధిత అధికారులతో మాట్లాడాతనని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు అధ్యాపకులకు తగిన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చెంది తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ముబారక్, నందిగామ శంకర్, లింగారెడ్డిగూడ అశోక్‌తోపాటు అధ్యాపకులు ఉన్నారు.

## ప్రమాదకరంగా బొడ్రాయి గుంత



ప్రజాపక్షం/వీపనగండ్ల : మండల పరిధిలోని వల్లభాపురంలో ప్రధాన రోడ్డుపై బొడ్రాయి గుంత ఇబ్బందిగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు అంచునే బొడ్రాయిని ఏర్పాటు చేసి దాని చుట్టూ సిమెంట్ రింగును అమర్చారు. సిమెంట్ రోడ్డు వేయడంతో బొడ్రాయి ఏర్పాటు చేసిన చోట గోతిగా ఏర్పడటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాహనదారులు ఏ మాత్రం ఏమరపాటుగా వహించిన ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని ప్రయాణికులు తెలిపారు.ఇప్పటికైనా గ్రామ పంచాయతీ సిబ్బంది బొడ్రాయి వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు



ప్రజాపక్షం/కొత్తకోట: కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలో 9వ వార్డులో నీటి ఎద్దడికి నివారణ చర్యలు తీసుకున్నట్లు దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొత్తకోట మున్సిపాలిటీ 9వ వార్డులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నల్లాల కోసం కొత్తకోట మున్సిపల్ కమిషనర్ రోడ్డు తవ్వి నల్లా కనెక్షన్ ఇచ్చారని అనంతరం తిరిగి గుంతలు పూడ్చాన్నారు. ఈ విషయాన్ని 9వ వార్డులో నివాసం ఉంటున్న కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేస్త్రీశ్రీను, కొత్తకోట పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఇజాజ్ అలీ, మక్బూల్, నజీం తదితరులు ఎమ్మెల్యేకు తెలపగా ఆ ప్రాంతంలో బోరు వేసి నీటి ఎద్దడిని నివారించాలని కొత్తకోట మున్సిపల్ ఏఈ చంద్రశేఖర్‌కి సూచించారు.

## సైబర్‌నేరాల పట్ల అవగాహన అవసరం

### రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవెర్నెస్ వర్క్ షాప్



ప్రజాపక్షం/కొత్తకోట: కొత్తకోట మండలంలోని నాటవెల్లి గ్రామంలో వాల్మీకి భవనంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవెర్నెస్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు నాగరపు బీచుపల్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలందరూ బ్యాంకు డిపాజిట్ ఖాతాల గురించి తెలుసుకోవాలన్నారు. బ్యాంకు ఉత్పత్తులను ఉపయోగించాలని, బ్యాంకింగ్ సేవలను ఉపయోగించాలని, గ్రామీణ వికాస్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ విష్ణువర్ధన్, బీసీ పాయింట్ మన్సూర్‌అలీ అన్నారు. ఈవర్క్‌షాప్ సొసైటీఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు ప్రాజెక్టు మేనేజర్ వి. అశోక్ కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యం




ప్రజాపక్షం/వీపనగండ్ల : మారుమూల ప్రాంతమైన వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యం కల్పించారు. స్థానిక ఆసుపత్రిలో అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఇబ్బందులు పడేవారని, మారుమూల ప్రాంతమైన వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని పలుమార్లు మండల ప్రజలు, ప్రజాప్రతినిధులకు అధికారులకు విజ్ఞప్తి చేశారు. పలుమార్లు అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబాయి మండలాల ప్రజలు దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి స్థానిక కాంగ్రెస్ నాయకులు అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని మంత్రికి వివరించారు. పది రోజుల్లో అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తానని మంత్రి మాట ఇచ్చిన విధంగా మంగళవారం నుండి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

## బస్సుకోసం డిపో మేనేజర్‌కు వినతి



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : కొల్లాపూర్‌నుండి నక్కలపల్లి , వెన్నచర్ల, గుడిపల్లి మీదుగా నాగర్ కర్నూల్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముచ్చిపోతు శంకర్, వడ్డెరసంఘం నాయకుల ఆధ్వర్యంలో కొల్లాపూర్ ఆర్‌టిసిడిపో మేనేజర్ వెంకటేష్‌గౌడ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ముచ్చిపోతు శంకర్ మాట్లాడుతూ వెన్నచర్ల, నాగపూర్, కొత్తరాయిపాకుల, సాయినాపల్లిగేట్, నాగనూల్ వివిధ గ్రామాలలో 25వేల జనాభా ఉన్నదని ఆర్‌టిసి రవాణాసౌకర్యంలేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలతోపాటు అనేక ఇబ్బందులకు ఈగ్రామ ప్రజలు గురవుతున్నారని ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్‌టిసిడిపో అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

## గోమతి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గోమాత సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, టై, బెల్టు , యూనిఫామ్‌ల పేరుమీద వ్యాపారం చేసే గోమాత సెయింట్‌జోసెఫ్ పాఠశాల గుర్తింపును రద్దుచేయాలని బిఆర్‌ఎస్‌వి జిల్లానాయకుడు డి.శేఖర్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు తిరుపతినాయక్ అన్నారు. కొల్లాపూర్ ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు, టై, బెల్టు, యూనిఫామ్‌లపేరుమీద స్కూల్స్ వ్యాపారాలు చేసే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘం నాయకులు చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాపక్షం/వెల్దండ : ఈనెల 27వతేదిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నాన్నారు. మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై మూడో తేదిన ఎంపిటిసిల పదవికాలం ముగియడంతో వారికి సన్మాన కార్యక్రమంతోపాటు శాఖలవారిగా సమీక్ష ఉంటుందని ఆయన తెలిపారు. ఈసమావేశానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

### 10 ఏళ్లలో చేనేత రంగాన్ని పూర్తిగా

# సంక్షోభంలోకి నెట్టిన బిఆర్ఎస్



ప్రజాపక్షం/హైదరాబాద్ : సమైక్యరాష్ట్రంలో కంటే కూడా గడిచిన 10 ఏళ్ల కాలంలో గత బిఆర్ఎస్ పాలకులు చేనేత రంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టివేశారని రాష్ట్ర జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. ఆర్డర్లు ఇచ్చి నేతన్నలకు డబ్బులు చెల్లించకుండా వారి బతుకులను బిఆర్ఎస్ పాలకులు బుగ్గిపాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల సమస్యలపై మాజీ మంత్రి కెటిఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాయడం దొంగే దొంగ అన్నట్లుగాఉందని మంత్రి ఎద్దేవా చేశా రు. చేనేత రంగాన్నిఅన్నిస్థాయిలలో అస్తవ్యస్తంచేసి, స్వంత లాభాలకు వాడుకుని ఇప్పుడు లేఖ పేరిట రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారం చేపట్టిన వెంటనే గతంలో కంటే ఎక్కువగా నేతన్నలకు చేతినిండా ఆర్డర్లు ఇవ్వడమే కాకుండా గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బకాయిలను చెల్లిస్తోందన్నారు. శాశ్వతంగా నేతన్నల జీవన ప్రమాణాల పెరుగుదలకు దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రణాళికలను చేపట్టిందని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నేరవేర్చడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. గత ప్రభుత్వం చేనేత కార్మికులను ఏ మాత్రం పట్టించుకోలేదని కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత చేనేత కార్మికుల దీర్ఘకాలిక లబ్ధిచేకూరే పథకాల కోసం చర్యలు తెలిపారు. గత ప్రభుత్వం 2018లో పవర్ లూమ్ కార్మికులకు ఇన్పుట్ సబ్సిడీ లింక్డ్ వేతనాల పరిహార పథకం (10శాతంయార్న్ సబ్సిడీ) అనే పథకమును ప్రవేశపెట్టి, నిధులు విడుదల చేయలేదని, తమ ఈ ప్రభుత్వం వచ్చాక ఇప్పటీ వరకు రూ.33.23కోట్ల నిధులను నేత కార్మికులకు విడుదల చేశామన్నారు. అదేవిధంగా చేనేత మగ్గాల ఆధునీకరణకు బిసి వెల్ఫేర్ శాఖ ద్వారా 202425 సంవత్సరానికి కేటాయించబడిన రూ. 400 కోట్ల బడ్జెట్ వినియోగించుటకు ముఖ్యమంత్రి అంగీకరించినట్టు తెలిపారు. చేనేత ఉత్పత్తులకు తమ ప్రభుత్వం ఈమార్కెటింగ్ చేయుటకు కృతనిశ్చయంతోముందుకు సాగుతూ, చేనేత కార్మికుల ఉత్పత్తుల అమ్మకాలకుగాను వెసులుబాటు కల్పించి వారికి పూర్తి స్థాయిలో వృత్తిపై ఆదాయం పెంచే ప్రయత్నం చేయుచున్నామని మంత్రి చెప్పారు. అయితే నేతన్నలకు మేమే పని కల్పించామని గొప్పలు చెప్పుకుంటున్న అదే బిఆర్ఎస్ నాయకులు నేతన్నలను అనే విధాలుగా మోసం చేశారన్నారు.2023 బతుకమ్మ చీరల పథకము క్రింద టెస్కో కు చెల్లించవలసిన రూ. 351.52 కోట్లు గత ప్రభుత్వం చెల్లించకపోతే , వీటిని మా ప్ర భుత్వం వచ్చిన తర్వాత రూ.100 కోట్లు విడుదల చేసిందన్నారు. అదేవిధంగాసమగ్ర శిక్ష 202324 పథకము కింద గత ప్రభుత్వం బకాయి ఉన్న రూ. 108 కోట్లు, మా ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. అంతేకాకుండా గత ప్రభుత్వం నవంబర్ 2023 వరకు సుమారుగా రూ.488. 38 కోట్లు వివిధ ప్రభుత్వ శాఖలకు సరఫరాచేసిన వస్త్రముల బకాయిలు టెస్కోకు చెల్లించాల్సి ఉందని చెప్పారు.

# కెసిఆర్‌కు మారోసారి పవర్ కమిషన్ నోటీసులు

### 27లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ సంస్థల నిర్మాణం, ఛత్తీస్‌గడ్ విద్యుత్ కొనుగోళ్ల అంశంపై మరింత సమాచారం ఇవ్వాలని బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి పవర్ కమిషన్ మరో సారి నోటీసులు జారీ చేసింది. ఆయనతో పాటు విద్యుత్ శాఖ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, మరి కొంత మందికి పవర్ కమిషన్ రెండవ సారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 19న నోటీసులు జారీ చేసినట్టు ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. అయితే రెండవ నోటీసుకు ఈ నెల 27 లోపునే వివరణ ఇవ్వాలని కెసిఆర్‌ను పవర్ కమిషన్ ఆదేశించింది. గతంలో మొదటి లేఖ రాసి ఈ నెల 15 లోపు సమాధానం ఇవ్వాలని కోరడంతో 15వ తేదీన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సుధీర్ఘ సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత కమిషన్ ముందు పలువురు విద్యుత్ రంగ నిపుణులు, ప్రజాప్రతినిధులు హాజరై తమ వద్ద ఉన్న సమాచారాన్ని జస్టిస్ నరసింహారెడ్డికి తెలియజేశారు. విద్యుత్ రంగ నిపుణులు, ప్రజాప్రతినిధులు అందజేసిన సమాచారాన్ని, సందేహాలను జోడిస్తూ జస్టిస్ నరసింహా రెడ్డి ఈ నెల 19న మరోసారి కెసిఆర్‌కు లేఖ రాశారు. ఈ నెల 27 లోపు సమాధానం అందజేయాలని కోరారు. కెసిఆర్ లేఖ రూపంలో సమాధానం అందజేసినా, వ్యక్తిగతంగా తెలియజేసినా ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపినట్లు సమాచారం. కాగా గతంలో కమిషన్ నోటీసులకు కెసిఆర్ సైతం ఘాటు రిప్లై ఇచ్చారు. కమిషన్ విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదని, విచారణ నుండి కమిషన్ ఛైర్మన్ ఎల్. నర్సింహారెడ్డి తప్పుకోవాలని కెసిఆర్ సంచలన డిమాండ్ చేయడం తెలిసిందే. పవర్ కమిషన్ మరోసారి గులాబీబాస్‌కు నోటీసులు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పవర్ కమిషన్ నోటీసులపై తొలి సారి ఘాటుగా స్పందించిన కెసిఆర్.. మరి ఈ సారి ఏ విధంగా స్పందిస్తారోనని ఆసక్తి నెలకొంది.

## నిపుణుల సలహాలు పాటించాలి



ప్రజాపక్షం/వెల్దండ: రైతులు తమ వ్యవసాయ పంట పొలాల్లో విత్తనాలు , ఎరువులు తీసుకోవాల్సినప్పుడు నిపుణుల సలహాలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి మంజుల అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాచూర్ రైతువేదికలో రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతునేస్తం కార్యక్రమంలో ఏవో మంజులతోపాటు కల్వకుర్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కిరణ్‌కుమార్‌లు పాల్గొని రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి, రాష్ట్రస్థాయి అధికారులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులనుండి రైతుభరోసాకు సంబంధించిన విధివిధానాల గురించి అభిప్రాయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు , రైతులు పాల్గొన్నారు.

## సమాజసేవలో పాల్గొనాలి



ప్రజాపక్షం/వంగూర్ : ఉద్యోగ విరమణ తర్వాత ప్రతి ఒక్కరూ సమాజ సేవకు అంకితం కావాలని ఎంఎల్‌సి ప్రజాకవి గోరటివెంకన్న అన్నారు. మంగళవారం ఉద్యోగ విరమణ పొం దుతున్న బాల్య మిత్రు డు పులిజాల పరుషరాములు వీడ్కోల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన బాల్యమిత్రుడైన పరుషరాములు చిన్నతనంనుండి సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అన్నారు. విద్యార్థి దశ నుండి సామాజిక ఉద్యమాల్లో పాల్గొని నేటికి ఉపాధ్యాయవృత్తితోపాటు వివిధ ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, ఉపాధ్యాయ సంఘం నాయకులు మల్లయ్య, చిన్నయ్య, లింగమయ్య, జంగయ్య, నర్సింహ్మా, చెన్నకేశవులు, ఆయా ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆర్గానిక్ పంటలకు మంచి డిమాండ్

### జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి : ఆర్గానిక్ పంటలకు మంచిడి మాండ్ ఉందని, వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలను వేసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్, తూడుకుర్తి రైతు వేదికలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆర్గానిక్ పంటలకు మంచిడిమాండ్ ఉందని ఆదిశగా పంటలు సాగుచేయాలన్నారు. మార్కెటింగ్ అవకాశాలమేరకు వరికిబదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## సిఎంఆర్ రైస్‌ని అందజేయాలి



సిఎంఆర్ రైస్‌ను తక్షణమే అందజేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో మిల్లర్లతో జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన సిఎంఆర్ బియ్యాన్ని తక్షణమే ప్రభుత్వానికి అప్పజెప్పాలని మిల్లర్లను హెచ్చరించారు.వానకాలం 2023–24కు సంబంధించి 49048 మెట్రిక్ టన్నుల సిఎంఆర్‌ను ప్రభుత్వానికి చెల్లించగా ఇంకను 41458 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని చెల్లించాల్సి ఉన్నదని తెలిపారు. మిల్లర్లకు ఎన్నిసార్లు హెచ్చ రించిన సిఎంఆర్ బియ్యం అప్పజెప్పడం లేదని కనుక మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని తెలియజేశారు. జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు, డిఎస్ఓ స్వామికుమార్, డిస్ట్రిక్ట్ మేనేజర్ బాలరాజు, జిల్లాలోని మిల్లర్లు పాల్గొన్నారు.

## కొత్త మార్గదర్శకాలతో రైతు భరోసా

### ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



ప్రజాపక్షం/అడ్డాకుల : తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలుపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కొత్త మార్గదర్శకాలతో రైతు భరోసా పథకం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. అందులో భాగంగా మంగళవారం నాడు అడ్డాకుల మండలం కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్సులో వ్యవసాయ అధికా రులతో రైతులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి రైతు భరోసా పథకం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. అందులో భాగంగా రైతుల అభిప్రాయాలను సేకరించాలని డిసైడ్ అయింది. ఈ మేరకు వ్యవసాయ అధికారులకు రైతుల అభిప్రాయాలు సలహాలు సూచనలు సేకరిం చేలా చూడాలని వ్యవసాయ అధికారులకు ఆయన సూచించారు. అనంతరం వారి ఫీడ్ బ్యాక్ ను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు.మండలంలోని వివిధగ్రామాలకు సంబంధించిన రైతు బీమా కళ్యాణలక్ష్మి షాదిముబారక్, చెక్కులను అందజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో వర్నె గ్రామానికి రహదారి బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పై రైతులతో చర్చించి త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు అయ్యే విధంగా చూస్తానని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, మండల అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు తోట శ్రీహరి, జిల్లా కిషన్ సేల్ అధ్యక్షులు నాగిరెడ్డి, డిసిసి కార్యదర్శి గంగుల విజయ్ మోహన్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు శరత్‌కుమార్ రెడ్డి, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, వైస్ ఎంపీపీ రాధిక, ఎంపీటీసీ శకుంతలమ్మ, నాయకులు, కార్యకర్తలు వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు రైతులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

### పోషకాహారం లోపంతో రాకుండా చూడాలి

### మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ




ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి : చిన్నారుల ఆరోగ్యం ప్రత్యేక దృష్టి సాధించాలని మహిళా శిశు సంక్షేమ వయోవృద్ధుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణ సూచించారు మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఆమె మహిళా శిశు సంక్షేమ ,వయోవృద్ధులు , ట్రాన్స్ జెండర్ ల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యల పై అన్ని ,జిల్లాల కలెక్టర్లు అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ కాన్ఫ రెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మీడియా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు అనంతరం వాకాటి కరుణ మాట్లాడుతూ చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడకుండా చూడాలని పేర్కొన్నారు. వారు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు అంగన్వాడీలను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. తల్లిదండ్రులను పట్టించుకోని వారు ఎవరైనా ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి సంరక్షణకు తగిన సాయం అందేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశం జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ జిల్లా సంక్షేమ అధికారి జరీనా తదితరులు పాల్గొన్నారు.

## 'మహిళాశక్తి'పై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం 5 సంవత్సరాలలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆదాయ అభివృద్ధి చేసి కోటీశ్వరులు చేయాలనే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమం అమలులో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ అన్నారు. మంగళవారం జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా శక్తి కార్యక్రమంపై 15 మండల సమాఖ్య అధ్యక్షులకు డిపిఎంలకు, సిసిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024–25 సంవత్సంలో మహిళా శక్తి కార్యక్రమం లక్ష్యం నిర్ణయించిబ్యాంక్‌లింకేజి, స్త్రీ నిధి ద్వారా రుణ సౌకర్యం కల్పించి జిల్లాలో 14 కార్యక్రమాల అమలుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. మహిళా శక్తి ద్వారా 15 మండలాల్లో 158 గ్రామ సంఘాలతో 6747 మైక్రో ఎంటర్ ప్రైజెస్ జిల్లాలో 5 మహిళా శక్తి క్యాంటీన్‌లు సమీకృత కలెక్టరేట్, మహబూబ్‌నగర్ పట్టణం బస్టాండు, మూసాపేట్ హైవే సిసి కుంట, జడ్చర్ల బస్ స్టాండులలో 40 మంది తో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 21 మందితో శుభకార్యాలలో ఈ వెంట్ మేనేజ్‌మెంట్ ఒక యూనిట్ జిల్లా సమాఖ్య ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, 70 మీ సేవా కేంద్రాలు, 1000 పాలిచ్చే గేదెలు, పెరటి కోళ్ల పెంపకం 187 యూనిట్‌లు మొబైల్ చేపల రిటైల్ ఔట్‌లెట్ కోయిల్‌కొండలో, మిల్క్ పార్లర్ జడ్చర్లలోసోలార్ యూనిట్ జడ్చర్లలో, మండలంకు ఒకటి చొప్పున పౌల్ట్రీ మదర్ యూనిట్‌లు 15, ఫుడ్ ప్రాసెసింగ్ చొప్పున పౌల్ట్రీ మదర్ యూనిట్‌లు 15 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు 160 డ్వాక్రా మహిళా బజార్ జిల్లా కేంద్రం లో శిల్పారామంలో 2 మహిళా శక్తి కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈసమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ,డిఆర్‌డి ఓ నర్సింహులు అదనపు పిడి జోజప్ప జిల్లా సమాఖ్య అధ్యక్షురాల రజిత తదితరులు పాల్గొన్నారు .

## మొల్లమాంబ పోటరీ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రారంభం

### ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాబార్డు సిజెం సుశీల చింతల



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : అధునాతన పరికరాలతో మట్టి పాత్రల తయారీ కేంద్రం మొల్ల మాంబ పోటరీ ప్రొడ్యూసర్ లిమిటెడ్ కంపెనీని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియో జకవర్గ గాజులపేట గ్రామ దగ్గర నాబార్డు సిజిఎం సుశీల చింతల, నాబార్డు డీజీఎం శ్వేతా లు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన వారు కంపెనీ ప్రాంగణంలో మొక్కని నాటి బిల్డింగ్ ప్రారంభోత్సవం చేశా రు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వృత్తి చా లా పవిత్రమైనది, మట్టి కుండ వాడకం పెరిగితే అనారోగ్య సమస్యలు తగ్గుతాయని, ఈ కంపెనీ దేశంలో ఒక రోల్ మో డల్ మట్టికుండల తయారీ కేంద్రంగా ఏర్పడాలని మీ అందరి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షులు బుగ్గన్న మాట్లాడుతూ కుండలు వాడేవారు లేక కుల వృత్తిపై ఆధారపడి వారి జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందని, పాత పద్ధతిలో తయా రైన కుండలను తక్కువగా ఆదరిస్తున్న సమాజానికి ఆధునాతన మట్టి పాత్రలను తయారు చేసి కుమ్మరోళ్ల జీవనోపాధి మెరుగుపరచాలని, నియోజకవర్గంలో గల అన్ని మండలాల కుమ్మర కులవృత్తిపై ఆధారపడిన వారికి జీవనోపాధి మెరుగుపడే దిశగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అలీఫ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి రమాదేవితో పలుమార్లు చర్చించి నాబార్డు వారి ఆర్థిక సహకారంతో మూసాపేట్ మండల్ అయ్యప్ప టెంపుల్ దగ్గర రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. నాబార్డు వారి సూచనల మేరకు గాజులపేట దగ్గరలో ఒక ఎకరా స్థలాన్ని లీజుకు తీసుకుని అక్కడ కంపెనీ నిర్మించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎంతో మంది కుమ్మరులకు ఉపాధి కలిగే అవకాశం ఉంటుందని, ఈ క్లస్టర్ కు అవసరమైన మట్టి సమస్య గురించి శాసన సభ్యులు జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎమ్మెల్యే పరిష్కార మయ్యే దిశగా పలు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ మహబూబ్‌నగర్ డిడిఎం షణ్ముఖ చారి ,డిడిఎం మనోహర్ రెడ్డి ,అలీఫ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి అజయ్ బాబు ,రజివి ,స్వరూప,మహాలక్ష్మి ,కంపెనీ చైర్మన్ రామచంద్రయ్య, జిల్లా గౌరం అధ్యక్షులు రామచంద్రయ్య ,గాజులపేట గ్రామ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ ,ఎంపీటీసీ వెంకటయ్య అన్ని మండలాల కార్యవర్గ సభ్యులు కుల బంధువులు ఆకార్యక్రమంలో పాల్గొన్నారు.

## మూసాపేట్‌లో అభివృద్ధి పనులు తనిఖీ



ప్రజాపక్షం/మూసాపేట్ : ధరణి పోర్టల్ ద్వారా ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలు ననుసరించి పెండింగు దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం మూసాపేట్ మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. తొలుత తహసిల్దార్ కార్యాలయంలో ధరణి పెండింగ్ దరఖాస్తులు పై కలెక్టర్ సమీ క్షించారు. తాహసిల్దార్ కార్యాలయంకు వచ్చిన దరఖాస్తుదారులతో మాట్లాడారు. పౌర సేవలు ఎలా అందుతున్నాయి తెలుసుకున్నారు. తర్వాత ఎంపిడిఆర్ కార్యాలయం కు చేరుకుని కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రంలో ప్రజాపాలన దరఖాస్తులలో సవరణలు చేస్తున్న విధా నం పరిశీలించారు. దరఖాస్తులు సవరణకు టెక్నికల్ ఇబ్బందులు గమనించి పై స్థాయిలో మాట్లాడి సమస్య లేకుండా కలెక్టర్ పరిష్కరించారు. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులలో సవరణలకు ప్రభు త్వం ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా అవకాశం కల్పించిందని, గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు రాని వారు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ బిల్లు తీసుకువచ్చి సవరణ చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం మండల ప్రాథమిక పాఠశాలను పరిశీలించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల పనులు తనిఖీ చేశా రు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చే యాలని ఆమె ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ చేసి పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ, సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ బ్రహ్మం గౌడ్, ఎంపిడిఓ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు



ప్రజాపక్షం
మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
కరీంనగర్ | బుధవారం | 26 జూన్, 2024 | 11

## కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేత

**ప్రజాపక్షం/నాగారం:** మహిళలు అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ మంత్రి,ఎంఎల్ఏ చామకూర మల్లారెడ్డి అన్నారు.మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌సి కాలనీ కమ్యూనిటీ హాలులో ఎస్‌సి కార్పొరేషన్,ప్రొఫెషనల్ ఇన్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలు ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ అడ్వాన్స్ టైలరింగ్‌లలో ఉచిత శిక్షణ పొందిన 70 మంది ఎస్‌సి మహిళలకు సర్టిఫికెట్లు,కుట్టు మిషన్లను ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్ఏ అందజేశారు.సంవత్సరానికి 300 మందికి ట్రైనింగ్,కుట్టు మిషన్లను అందిస్తున్న సంస్థ అధ్యక్షురాలు ధీరం ఉషాని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ ఆర్గనైజర్ అనుముల నర్సింహారెడ్డి,మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, సభ్యులు సుచిత్ర రెడ్డి,టీచర్ షకీలా, సుష్మ,కమిషనర్,కౌన్సిలర్లుతదితరులుపాల్గొన్నారు.

## అనుమతులు లేని ప్రథమ చికిత్సా కేంద్రాలు సీజ్

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఎలాంటి విద్యార్హతలు, అనుమతులు లేకుండా వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న రెండు ప్రథమ చికిత్సా కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు మంగళవారం సీజ్ చేశారు. జిల్లా డిఎంహెచ్ఓ డా. రఘునాథస్వామి తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణా రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ అదేశాల మేరకు జిల్లాలో అనుమతులు లేని వైద్యశాలలు, డయాగ్నస్టిక్ సెంటర్లను తనిఖీలు చేస్తున్న క్రమంలో బోడుప్పల్‌లోని శివబాలాజీ, కోరెముల్‌లోని ఆర్‌ఆర్ ప్రథమ చికిత్సా



కేంద్రాలను వైద్య శాఖ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది తనిఖీలు చేశారు. నిర్వాహకుల వద్ద వైద్య శాల నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేనందున వారిపై పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదు చేశారు.

## ధరణి దరఖాస్తుల పరిష్కార పనుల్లో వేగం పెంచాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించటంలో అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కీసర మండలంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ కొనసాగుతున్న ధరణి దరఖాస్తుల పరిష్కార పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మాడ్యుల్స్‌లో దాఖలైన ధరణి దరఖాస్తులను ఏ మాత్రం పెండింగ్‌లో ఉంచరాదని, మరింత వేగవంతం చేయాలన్నారు. పపెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన మీదటే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జాకు పాల్పడ్డారన్న విషయం బయట పడితే క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిజమని దృవీకరణ అయితే వెంటనే కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.

## ఇసిఐఎల్ నుండి సికింద్రాబాద్‌కు మరో కొత్త ఆర్టీసి సర్వీస్ బస్సు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ప్రయాణీకుల సౌకర్యార్థం ఈసిఐఎల్ నుండి సికింద్రాబాద్ వరకు 38T/16CR నంబరుతో కొత్త ఆర్టీసీ సిటీ బస్సు సర్వీసును ఈ నెల 27 నుండి ప్రారంభిస్తున్నామని కుషాయిగూడ డిపో మేనేజర్ పి.చంద్రకాంత్ తెలిపారు. ఈసిఐఎల్ నుండి సాయినాథపురం, భరత్‌నగర్, ఆర్టీసీ కాలనీ, ఆస్ట్ ఆనంద్‌బాగ్, ఉత్తమ్‌నగర్, జ్యోతినగర్, తుకారాంగేట్, షెన్నాయి నర్సింగ్‌హోం మీదుగా సికింద్రాబాద్ చేరుకొంటుందన్నారు. ప్రతి రోజు ఈసిఐఎల్ ననుండి మొదటి బస్సు ఉ:7. 30 గంటలకు, చివరి బస్సు రాత్రి 8.50కు బయలు దేరుతాయని, ప్రతి అర గంట వ్యవధిలోఈ సర్వీసు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.

## వైద్యం కోసం రూ.1.5 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్యే మర్రి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** అనారోగ్యంతో బాధ పడుతున్న బిజెఆర్ నగర్ ప్రాంతవాసి ఎం.పద్మావతి వైద్య చికిత్సల నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన లక్షన్నర రూపాయల అనుమతి పత్రాలను మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి మంగళవారం ఆమెకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబ వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ కోసం అవసరమైన వారు తనను సంప్రదించాలని సూచించారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌కు చెందిన పార్టీ నేతలు శ్రీధర్, సుకేష్, సతీష్, టింకు, హ్యారీ, మహేష్, రవి, విజయ్, చందు, భాస్కర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వేతనాల కోసం మండల కార్యాలయం ఎదుట నిరసన

**ప్రజాపక్షం/కోట్‌పల్లి** :జీతాలమీదే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వక నానా ఇబ్బందులు పడుతున్నామని, జీతాలు ఇచ్చే వరకు నిరసనలు ఆగవని గ్రామ పంచాయతీ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని మండల పరిష్యత్తు కార్యాలయం ఎదుట 18 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఉద్యోగులు నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామ పంచాయతీలో ఉదయ, సాయంత్ర అంటు తేడా లేకుండా నిత్యం గ్రామ స్వచ్ఛతకై పని చేసే మాకు పట్టించుకోవడం లేదు, దాదాపుగా 7 నెలల నుండి మాకు జీతాలు ఇవ్వడం లేదని, రెక్కాడితేగానీ డొక్కాడని జీవడం సాగదీయాలంటే సకాలంలో జీతాలు చెల్లిస్తేనే జీవనం గడుస్తుందని ఆవేధన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రాజు, తదితరులున్నారు.

## మహిళలు స్వయం శక్తితో ఎదగాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మహిళలు స్వయం శక్తితో ఎదిగి ఆర్థికంగా స్థిర పడాలని బాబాగూడ గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం బాబాగూడలో మహిళాశక్తి ప్రత్యేక గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విదంగా ప్రభుత్వం మహిళాశక్తి అనే కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. మహిళా సంఘాల సభ్యులు తమ ఇండ్ల వద్దనే ఉంటూ యూనిట్లుగా ఏర్పడి ఉపాధి పొందేందుకు రూపకల్పనలు చేస్తుందన్నారు. కోళ్లు, పశువుల, చేపల పెంపకం, విస్తరాకుల తయారి, కుట్టు శిక్షణ కేంద్రాలు, ఎంబ్రాయిడరి, మీసేవా తదితర యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అందుబాటులో శిక్షణలు కూడ ప్రభుత్వం ఇస్తుందన్నారు. మహిళలు ముందుకు వచ్చి ఇట్టి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి, మహిళలు పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి శామీర్‌పేట మండంలంలో పలు గ్రామాల్లో మహిళశక్తి గ్రామసభలు నిర్వహించారు.

## కొంపల్లి శ్రీ చైతన్య స్కూల్లో విద్యార్థి అనుమానాస్పద మృతి

**ప్రజాపక్షం/పేట్ బషీరాబాద్:** కొంపల్లి లోని శ్రీచైతన్య (కె4 బ్రాంచ్)లో నిన్ననే అడ్మిషన్ పొందిన మల్లికార్జున్ తెల్లరేసరికి కానరాని లోకాలకు వెళ్లిన ఘటన స్థానికంగా కలకలం రేపుతుంది. మెదక్ జిల్లా, అల్లాదుర్గం మండలం చిల్వేర గ్రామానికి చెందిన వీరప్ప అనే తండ్రి తన కొడుకును 7వ తరగతి నిమిత్తం శ్రీచైతన్య స్కూల్ కొంపల్లిలో జాయిన్ చేశాడు. నిన్న రాత్రి స్కూల్‌లో డిన్నర్ చేసి పడుకున్న మల్లికార్జున్ (12) తెల్లారేసరికి విగతాజీవిగా పడి ఉన్నాడని పక్కనే ఉన్న రష్ హస్పిటల్ కి తరలించగా అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు చెప్పారని స్కూల్ సిబ్బంది చెప్తున్నారు. మల్లికార్జున్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాందీ హస్పిటల్ కి తరలించారు. మల్లికార్జున్ మృతిపై అనుమానులున్నాయని విద్యార్థి సంఘాలు అందోళన నిర్వహించి మల్లికార్జున్ చావుకు యాజమాన్యమే భాద్యత వాహించాలని డిమాండ్ చేశారు. మల్లికార్జున్ (సూసైడ్) చేసుకున్నాడని స్కూల్ సిబ్బంది, యాజమాన్యం ఈ చావును నామమాత్రపు చావుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో వసతులు శూన్యం

విద్యార్థులకు రక్షణలేని ప్రహరీగోడ

నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

కళావిహీనంగా పాఠశాల పరిసరాలు పట్టించుకోని అధికారులు

కుంటుపడుతున్న విద్యావ్యవస్థ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ పాఠశాలలో సకల వసతులు, హంగులు, ఆర్భాటాలతో పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామని ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకోవడం తప్పా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని పలు పాఠశాలల దుస్థితి దయనీయంగా మారింది. మూడుచింతలపల్లి మండలం కొల్తూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభంలో విద్యార్థులకు పూర్తి వసతులు కల్పిస్తామని మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఉపాద్యాయులు, అధికారులు బడిబాట కార్యక్రమం ద్వార విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తీరా చూస్తే ప్రభుత్వ పాఠశాలలో వసతులు



శూన్యమని చెప్పవచ్చు. పాఠశాలను పరిశీలిస్తే ప్రహరీగోడ పూర్తి స్థాయిలో లేకపోవడం, కనీసం ప్రధాన ద్వారంలో గేటు కూడ లేకపోవడంతో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మందుబాబులకు దొంగలకు అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా పాఠశాల ప్రాంగణం మారింది. బోజనం అనంతరం విద్యార్థులు చేతులు కడుక్కోవడానికి ఏర్పాటు చేసిన నల్లాలు విరిగిపోయి కనిపిస్తున్నాయి. విద్యార్థులకు తాగునీటి సరఫరాలో బాగంగా కనీసం నల్లా కనెక్షన్‌లు కూడ లేవు. దీంతో గ్రామపంచాయతి ట్యాంకర్ ద్వార నీటిని సరఫరా చేస్తుంది. పాఠశాలలో అడ్డగొలుగా గుంతలు ఉండటంతో చిన్నారులు ఆ గుంతల్లో పడి గాయాల పాలైతున్నారు. నీటి సంపు సరిగా లేక నీరు నిలవలేకుండా పోతుందని మద్యాహ్న బోజన కార్మికులు వాపోతున్నారు. అద్వాన్నంగా మూత్రశాలల పరిస్థితి కనిపిస్తుంది. మరుగుదొడ్ల ముచ్చటనే లేదు. ఇలా ఒకటేమిటి సమస్యలతో స్వాగతం అన్నట్లుగా విద్యార్థులు తమ చదువులను కొనసాగిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, విద్యార్థులకు వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైన మండల, జిల్లా ఉన్నతాధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులు పాఠశాలను సందర్శించి సమస్యలను తీర్చాలని విద్యార్థుల భవిష్యత్తుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## కొడంగల్ అభివృద్ధికి శ్రీకారం

అధికారులతో సమీక్షించిన తిరుపతిరెడ్డి

**ప్రజాపక్షం / కొడంగల్ :** అతిత్వరలోనే కొడంగల్ అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నట్లు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం కడ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడ ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, సంబందిత శాఖల అధికారులతో సమీక్షించిన అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతు రాష్ట్రముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఎన్నికల కోడ్ ఉన్నందున కొడంగల్‌లో అభివృద్ధి జరుగలేదని అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గ అభివృద్ధి అనేది యుద్ధప్రతిపాదికన జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్టీమెంట్‌లు, టెండర్‌లు కొనసాగుతున్నాయని పూర్తి అయిన వెంటనే పనులు ప్రారంబం అవుతాయన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో రెండు లక్షల రుణామాఫీ అనేది చరిత్రత్మకమైనదన్నారు. ఒకేదఫాలో రైతులందరిని సంతోషపెట్టడం ఇది రైతురాజ్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసేందుకు నాయకులు, కార్యకర్తలు ముందుండి సేవలు చేస్తారని అన్నారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని పోచమ్మతాండకు చెందిన పార్టీ నాయకుడు రాజునాయక్ అందరిని ఆకట్టుకునే విధంగా జిల్లా కలెక్టర్ మాటాలకు ఆకర్షితుడై షాలువలు, పూల బుకేలు కాకుండా నోటుపుస్తకాలు, పెన్నులను ఇచ్చి సత్కరించడంతో కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖలకు సంబందించిన అధికారులున్నారు.



## మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

ఎస్పీ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం / కొడంగల్ :**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికై స్థల పరిశీలనతో పాటు పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీలు చేశారు. మంగళవారం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పరిగి డిఎస్‌పి కరుణాసాగర్‌రెడ్డిలు కొడంగల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లోకి పలు రికార్డులను పరిశీలించారు. నేరాలు, యాక్సిడెంట్‌లపై ఆరా తీసి వాటిని కట్టడిచేసేందుకు సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని సిఐ,ఎస్ఐలకు సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలోని ఖాళీ స్థలంతో పాటు పక్కనే ఉన్న పాతస్టేషన్‌ను పరిశీలించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కావడంతో మోడల్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి ఎస్ఐ క్యాడర్‌ను సిఐగా ప్రమోట్ చేసి ఒక డిఎస్‌పి ర్యాంకు కార్యాలయం ఏర్పాటు కానున్నట్లు సమాచారం. దీనిపై సంబందిత రెవెన్యూ అధికారులచే రికార్డులను తెప్పించి విచారణ చేపట్టారు. అతిత్వరలోనే కొత్త పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు పోలీస్‌వర్గాలు పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఎస్పీగా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన మొదటి సారి కొడంగల్‌కు వచ్చిన ఎస్పీకి పోలీసులు ఘన స్వాగతం పలికి గౌరవ వందనం చేశారు.

## స్నేహితులతో కల్సి మైనర్ బాలికపై అత్యాచారం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మాయ మాటలతో మైనర్ బాలికను లోబరచుకోవటమే కాక మరో నలుగురు స్నేహితులతో కల్సి తరచు అత్యాచారానికి పాల్పడటంతో చివరికి ఆ అభాగ్యురాలు గర్భం దాల్చటంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితులు బాలిక నివాసిత ప్రాంతమైన కాచిగూడ ప్రాంతం నుండి నేరేడ్‌మెట్ సమీపంలోని వినాయకనగర్ ప్రాంతానికి తీసుకొని వచ్చి ఈ ఆఘాత్యానికి పాల్పడుతూ వచ్చారు. బాధితురాలు గర్భం దాల్చిన విషయం బయట పడటాన్ని గమనించిన తల్లి కుమార్తెను నిలదీయటంతో అసలు విషయం తెలియటంతో తమ నివాసిత ప్రాంత సమీపంలోని కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అత్యాచారానికి పాల్పడిన సంఘటనాస్థలం రాచకొండ కమిషనరేట్‌లోని నేరేడ్‌మెట్ పరిధిలోకి రావటంతో కాచిగూడ పోలీసులు కేసును నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కాచిగూడ, నేరేడ్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ మహిళ తన 15 సంవత్సరాల కుమార్తెతో కల్సి జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చి కాచిగూడ ప్రాంతంలో ఉంటూ కూలీ నాలీ పనులతో జీవనం గడుపుతోంది. ఆరవ తరగతిలోనే చదువు మధ్యలో మానేసిన ఆ బాలిక ఇంటి వద్దనే ఉంటుంది. బాలికకు అనుకోకుండా సెల్ ఫోన్‌లో నేరేడ్‌మెట్ సమీపంలోని వినాయకనగర్ ప్రాంతానికి చెందిన విజయకుమార్ (23)తో ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. అప్పటి నుండి బాలికకు అతడు మాయమాటలు చెబుతూ సరదాగా తిరుగుదామని చెప్పి గత ఏడాది ఆగస్టు నుండి బాలిక తల్లి ఇంట్లో లేని సమయంలో తన బైకుపై తీసుకొని వెళ్ళి పార్కులు, హోటళ్లు తిప్పసాగాడు. అతడి మాయమాటలను పూర్తిగా నమ్మిన బాలికను తానుంటున్న వినాయకనగర్ ప్రాంతానికి తీసుకొని వెళ్ళి అత్యాచారానికి పాల్పడటం ప్రారంభించాడు. తరచు తన వెంట వచ్చే బాలికను తాను లొంగదీసుకొన్న విషయాన్ని తన మరో స్నేహితులతో చెప్పి వారిని సైతం రప్పించి బెదిరించి తరచు సామూహిక అత్యాచారానికి పాల్పడసాగాడు. కొద్ది రోజుల క్రితం తన కుమార్తె అనారోగ్యంగా ఉండటం, బాలికకు నెలసరి రుతుస్రావం రాకపోవటాన్ని గమనించి అనుమానించిన తల్లి నిలదీయగా అసలు విషయం బాలిక రోదిస్తూ చెప్పింది. దీంతో సమీప వాసులతో కల్సి తాముంటున్న కాచిగూడ పోలీస్‌స్టేషన్‌కు నాలుగు రోజుల క్రితం వెళ్లి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ముందుగా భరోసా సెంటర్‌కు పంపగా బాలికతో మాట్లాడిన అనంతరం పోలీసులు కేసు నమోదు చేసారు. ఆ తర్వాత సంఘటనా ప్రాంతం పరిధి పోలీస్‌స్టేషన్ అయిన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేసారు. ప్రధాన నిందితుడైన విజయకుమార్‌తో పాటు అత్యాచారానికి పాల్పడిన నిందితులకు అతడి స్నేహితులైన బాలు(25), కృష్ణ(25), కిరణ్(24), అజయ్(25)లుగా గుర్తించి వారి కోసం గాలిస్తున్నారు.

## నిజాంపేట్ జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి మండలంలోని నిజాంపేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శనిగల దన్‌రాజ్ యాదవ్ సందర్శించారు. పాఠశాల లో తరగతి గదులను, పాఠశాల ఆవరణలో పర్యటించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్ పాఠశాలలో తరగతి గదులు, బోర్, తరగతి గదిలో బెంచ్‌లు తదితర మౌలిక వసతులను కల్పించాలని డిప్యూటీ మేయర్ దన్‌రాజ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దన్‌రాజ్ మాట్లాడుతూ తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కార్పొరేటర్ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నవాబుపేట్:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 27 తేదీన గురువారం ఉచిత కంటి పరీక్షలు చేయబడతాయని మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్ ఓ ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాదుకు చెందిన శ్రీ కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ శంకర కంటి ఆసుపత్రి వారు గురువారం 27వ తేదీన ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పిల్లలకి, పెద్దలకు, వృద్ధులకు,కూడా కంటి పరీక్ష చేయడం జరుగుతుందని తెలిపారు. కంటి లోపం (శుక్లాం) ఉన్నవారికి మరియు కంటి లోపల అద్దం (ఐఒఎల్) అమర్చి ఆపరేషన్ కూడా చేయడం జరుగుతుందన్నారు. ఇంతకుముందు ఈ శంకర్ ఆస్పత్రికి సంబంధించి ఎవరైనా కంటి పరీక్షలు చేయించుకొని ఉంటే వారు కూడా హాజరై ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్ష చేయించుకోవచ్చు అని అన్నారు. ఆసక్తి కలిగిన కంటి సమస్య ఉన్న వారందరూ పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి

**ప్రజాపక్షం/నవాబుపేట్:** అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేయడం కోసం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఆయా గ్రామాల ప్రధానోపాధ్యాయులతో స మావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో అనురాధ మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఇంకా పూర్తికానటువంటి పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న పనులన్నీ సత్వరమే పూర్తి చేయాలని తెలిపారు. ఆయా గ్రామాలలోని పాఠశాలల్లో ఉన్నటువంటి పనులను లిఖితపూర్వకంగా తెలిపిన పనులు పూర్తి చేయడం సులువుగా ఉంటుంది. కాబట్టి త్వరలోనే ఇంకా పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఈ పనులన్నీ ఇష్టముతో చేయాలి. ఎందుకంటే మన పిల్లల కోసం వారి భవిష్యత్తు కోసం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా చేస్తున్నటువంటి పనులు. మన ఇంటికి ఏదైనా సమస్య ఉంటే ఎలా వెంటనే పరిష్కరిస్తామో అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల యొక్క పని మన కుటుంబం యొక్క పని లాగా భావించి పూర్తి చేయాలన్నారు. మన పిల్లలు భవిష్యత్తు ఎరిగి వారు ప్రైవేట్ పాఠశాలలకు పోకుండా ప్రభుత్వ పాఠశాలలోనే ఉండే విధముగా మనము ఐక్యమత్యంతో కలిసి పాఠశాల పనులను లోపం లేకుండా సమర్థవంతంగా పనిచేసే ప్రైవేటుకు ఏ ఒక్క విద్యార్థి వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చేరే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఫీఓ విజయ్ కుమార్, విద్యాధికారి గోపాల్, అమ్మ ఆదర్శ పాఠశాల ఏ ఈ పరుశురాం, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, ఆయా గ్రామాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ గ్రామాన మహిళా శక్తి సదస్సులు

వివిధ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం, శిక్షణ

జిల్లాలో 16 మీ సేవా కేంద్రాలూ మహిళా గ్రూపులకే

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు గాను ప్రభుత్వ ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మంగళవారం మహిళా శక్తి కార్యక్రమాల పేరిట ప్రత్యేక మహిళా గ్రామ సభలు నిర్వహించారు. మహిళా స్వయం సహాయక సంఘాలలో ఆయా ప్రాంతాల్లో నివసించే మహిళలను ఒక చోట చేర్చి ఎక్కువ సంఖ్యలో సభ్యులుగా నమోదు చేయించటం ద్వారా వారికి స్వయంగా ఏదో ఒక సంపాదనా యూనిట్ ప్రారంభం చేసి వారే సమిష్టిగా పని చేస్తూ ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంగా ఈ గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య గ్రామ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. మహిళా స్వయం సహాయక కేంద్రాలను ప్రోత్సహించేందుకు గాను ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల యూనిఫారాల కుట్టు పనులను ఈ మహిళా స్వయం సహాయక కేంద్రాలకే అప్ప చెప్పారని గ్రామ సభల్లో మహిళలకు వివరించారు. పాడి పరిశ్రమల ఏర్పాటు, మదర్ యూనిట్ల ఏర్పాటు, మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌ల ఏర్పాటు, మిల్క్ పార్లర్లు, మొబైల్ చేపల రిటైల్ అమ్మక కేంద్రాల ఏర్పాటు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా క్యాంటిన్ల ఏర్పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ఇలా అనేకం అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ఏడాది జిల్లాలో 16 మీసేవా కేంద్రాలను మహిళా స్వయం సహాయక కేంద్రాలకు అప్ప చెప్పనున్నామన్నారు.

## వీధి కుక్కలను పట్టుకున్న బ్లూ క్రాస్ సొసైటీ

**ప్రజాపక్షం/దుండిగల్ :**మున్సిపల్ కమీషనర్ కే.సత్యనారాయణ రావు మల్లంపేట్ వార్డులో వీది కుక్కల వలన ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులకు రక్షణ చర్యలలో బాగంగా బ్లూ క్రాస్ సొసైటీ వారి బాగస్వామ్యంలో 18 కుక్కలను అప్పగించరు అనంతరం కమీషనర్ మాట్లాడుతూ వీది కుక్కల నివారణ చెర్యలు లో భాగంగా బ్లూ క్రాస్ సొసైటీ వారితో ఒప్పందం చేసుకోవడం జరిగినది అని, వారు వీది కుక్కలను తీసుకొని వెళ్లి పిల్లలు పుట్టకుండా ష్టిరలైజేషన్ ఆపరేషన్, యాంటి రేబీస్ టీకా వేసి వదిలిపెట్టడం జరుగుతందని వివరించారు. ఆహారం నీరు లేక కుక్కలు వింతగా ప్రవతిస్తాయా కావున వాటికీ కావలసిన త్రాగు నీటిని, ఆహారం ను పిల్లలు తిరగని ప్రదేశాశాలలో అందిచాలని సుచించారు. ఈ కార్యక్రమం లో కమీషనర్ కే.సత్యనారాయణ రావు బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షాన్నే..

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కార్మికుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ మున్సిపాలిటీ దొమ్మరపోచంపల్లి, సారేగూడెంలోని అల్కాలిక్ మెటల్స్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టియూసి) నూతన కమిటీ సభ్యులు షాపూర్ నగర్‌లో కూన శ్రీశైలం గౌడ్‌ని కలిశారు. ఈ సందర్భంగా కూన నూతనంగా ఎన్నికైన అల్కాలిక్ మెటల్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ముడిమాల రాముగౌడ్‌ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ పరిశ్రమలో కార్మికుల పక్షాన నిలబడుతూ వారి సమస్యలను నూతన కమిటీ పరిష్కరించాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం యూనియన్ పనిచేయాలని అందుకోసం తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని పేర్కొన్నారు. రాముగౌడ్ మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సదానందం, యాదగిరి, శంకర్ పాల్గొన్నారు.

## బలరాంనగర్‌లో రూ. 15 లక్షలతో సిసి పనులు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఎట్టకేలకు మల్కాజిగిరి డివిజన్ బలరాంనగర్ ప్రాంతంలో రూ. 15 లక్షల వ్యయంతో సిసి పనులు ప్రారంభమయ్యాయని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ తెలిపారు. చాలా కాలం నుండి అధికారులకు చెబుతున్నా పట్టించుకోకుండా తాత్సారం చేస్తూ చివరికి పనులు ప్రారంభించారని, దీంతో పాటు కృపా కాంప్లెక్స్ సమీపంలో నీటి శుద్ధి కేంద్రం వద్ద నాలా పూడిక తీత పనులను సైతం చేపట్టారన్నారు. త్వరితగతంగా అర్థాంతరంగా వదిలేయకుండా పూర్తి చేయాలని ఆయన కోరారు.జిహెచ్ఎంసిడిఈ మహేష్, ఏఈ దీపక్, వర్క్ ఇనస్పెక్టర్ దుర్గ ప్రసాద్, వనజ, బిజెపి నేతలు విజయకుమార్, సూరజ్, నాగరాజు, ప్రశాంత్, గిరి తదితరులు కార్పొరేటర్ వెంట ఉండి పనులను పరిశీలించారు.



# క్రీడ

# టీ20 వరల్డ్ కప్ చరిత్రలో శతకాలు



ఈ ఏడాది జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో ఇక మూడు మ్యాచ్‌లు మాత్రమే మిగిలున్నాయి. ఈనెల 29న శనివారం బార్బడోస్‌లో జరిగే ఫైనల్ మ్యాచ్‌తో టీ20 ప్రపంచ కప్ విజేత ఎవరో తేలిపోతుంది. టోర్నీలో 20 టీమ్‌లు పోటీ పడగా భారత్, ఆఫ్ఘనిస్తాన్, సౌతాఫ్రికా, ఇంగ్లాండ్ సెమీఫైనల్స్‌కి చేరాయి. సాధారణంగా టీ20 అనగానే బ్యాటర్ల ఆధిపత్యం గుర్తొస్తుంది. కానీ ఈ సీజన్‌లో బౌలర్లదే పైచేయి. ఇప్పటి వరకు టోర్నమెంట్‌లో ఒక్క సెంచరీ కూడా నమోదు కాలేదంటే అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు గత టీ20 వరల్డ్ కప్‌లలో నమోదైన సెంచరీల గురించి తెలుసుకుందాం.

**టీ20 ప్రపంచ కప్ 2007:** మొదటి టీ20 ప్రపంచకప్‌లో మొదటి సెంచరీని వెస్టిండీస్ బ్యాట్స్‌మెన్ క్రిస్ గేల్(117) చేశాడు. టోర్నీలో మొత్తంగా 2 మ్యాచ్‌లలో 117 పరుగులు చేశాడు. టీ20 ప్రపంచకప్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా రికార్డుకెక్కాడు.

**టీ20 ప్రపంచ కప్ 2009:** సెకండ్ ఎడిషన్‌లో ఏ బ్యాట్స్‌మెన్ కూడా సెంచరీ చేయలేదు. ఈ సీజన్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు శ్రీలంక బ్యాటర్ దిల్షాన్ (96*) సాధించాడు.

**టీ20 ప్రపంచ కప్ 2010:** మూడో ఎడిషన్‌లో భారత ప్లేయర్ సురేశ్ రైనా(101), శ్రీలంక ఓపెనర్ మహేల జయవర్ధనే (100) సెంచరీలు కొట్టారు. సీజన్‌లో సురేశ్ రైనా 5 ఇన్నింగ్స్‌లలో 219 పరుగులు, జయవర్ధనే 6 ఇన్నింగ్స్‌లలో 302 పరుగులు చేశారు.

**టీ20 వరల్డ్ కప్ 2012:** నాలుగో టీ20 ప్రపంచ కప్‌లో న్యూజిలాండ్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ బ్రెండన్ మెక్కల్లమ్ సెంచరీ(123) సాధించాడు. మొత్తం 5 మ్యాచ్‌ల్లో 212 పరుగులు చేశాడు.

**టీ20 ప్రపంచకప్ 2014:** ఐదో ఎడిషన్‌లో ఇంగ్లాండ్ ఓపెనర్ అలెక్స్ హేల్స్(116), పాకిస్తాన్ ప్లేయర్ షెహజాద్ అహ్మద్(111) సెంచరీలు చేశారు. సీజన్‌లో మొత్తంగా హేల్స్ 4 ఇన్నింగ్స్‌లలో 166 పరుగులు, షెహజాద్ 4 ఇన్నింగ్స్‌లలో 138 పరుగులు చేశాడు.

**టీ20 ప్రపంచ కప్ 2016:** ఆరో ఎడిషన్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ తమీమ్ ఇక్బాల్(103), వెస్టిండీస్ ఓపెనర్ క్రిస్ గేల్(100) సెంచరీలు బాదారు. తమీమ్ 6 ఇన్నింగ్స్‌లలో 295, గేల్ 4 మ్యాచ్‌లలో 113 పరుగులు చేశారు.

**టీ20 ప్రపంచ కప్ 2021:** ఏడో టీ20 వరల్డ్ కప్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్, వికెట్ కీపర్ జోస్ బట్లర్ సెంచరీ(101) చేశాడు. మొత్తంగా 6 మ్యాచ్‌ల్లో 269 పరుగులు చేశాడు.

**టీ20 ప్రపంచ కప్ 2022:** ఈ ఎనిమిదో ఎడిషన్‌లో న్యూజిలాండ్‌కు చెందిన గ్లెన్ ఫిలిప్స్ సెంచరీ(104) సాధించాడు. మొత్తంగా 5 ఇన్నింగ్స్‌లలో 201 పరుగులు చేశాడు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు వార్నర్ బైబై

అంతర్జాతీ క్రికెట్‌లో మరో దిగ్గజ ఆటగాడు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. టీ20 ప్రపంచకప్ నుంచి ఆస్ట్రేలియా జట్టు నిష్క్రమించిన తర్వాత కంగారు జట్టు ఓపెనర్ డేవిడ్ వార్నర్ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. సెయింట్ లూసియాలో భారత్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో, వార్నర్ 6 పరుగులే చేసి అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. బంగ్లాదేశ్‌పై అఫ్ఘానిస్థాన్ గెలవడం వల్ల టీ 20 ప్రపంచకప్ సెమీస్ చేరే అవకాశం ఆస్ట్రేలియాకు లేకుండా పోయింది. దీంతో అంతర్జాతీయ క్రికెట్ వీడ్కోలు పలుకుతున్నట్లు వార్నర్ ప్రకటించాడు. దాదాపు 15 ఏళ్ల పాటు ఆస్ట్రేలియా జట్టు ఓపెనర్‌గా ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడిన వార్నర్, టీ 20 ప్రపంచకప్ గెలిచి రిటైర్‌మెంట్ ప్రకటించుదామని అనుకున్నాడు. కానీ ఈ టోర్నీ వల్ల వార్నర్‌కు నిరాశ తప్ప లేదు. అయితే ఇప్పటికే వన్డేలు, టెస్టులకు వీడ్కోలు చెప్పిన వార్నర్, ఇప్పుడు టీ20 క్రికెట్‌కు వీడ్కోలు చెప్తున్నట్లు వెల్లడించాడు. భారత్‌లో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో భారత్‌తోనే వార్నర్ చివరి వన్డే ఆడాడు. జనవరిలో పాకిస్థాన్‌పై చివరి టెస్ట్ ఆడాడు. ఈ టీ20 ప్రపంచకప్ తనకు చివరి టోర్నమెంట్ అని ఈ టోర్నీకి ముందే వార్నర్ ప్రకటించాడు. అన్నట్లుగానే వార్నర్ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు.

**టీ20కి రిటైర్మెంట్ పలికాడు కానీ!**

టీ20 ప్రపంచక్‌కు వీడ్కోలు పలికినా వచ్చే ఏడాది జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులో ఉంటానని వార్నర్ తెలిపాడు. తన అవసరం ఉందనుకుంటే ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడతానని వార్నర్ తెలిపాడు. అయితే ఇది సాధ్యమయ్యే అవకాశాలు చాల తక్కువగా ఉన్నాయి. టెస్ట్ క్రికెట్, వన్డే, టీ 20ల్లో వార్నర్ లేనిలోటు కొన్నేళ్లపాటు ఉంటుందని హేజిల్ వుడ్ అన్నాడు. వార్నర్ కెరీర్ ముగియడం తనను నిరాశ పరిచేలా చేసిందని, కానీ తాము నిరాశలో మునిగిపోతే ముందుకు సాగలేమని హెడ్ అన్నాడు. అన్ని ఫార్మాట్లలో వార్నర్ ఓపెనర్‌గా ఎన్నో విలువైన ఇన్నింగ్స్‌లు ఆడాడని హెడ్ గుర్తు చేశాడు. ఆస్ట్రేలియా క్రికెట్‌కు వార్నర్ చేసిన సేవలు చాలా గొప్పవని కొనియాడాడు. 2011లో ఆస్ట్రేలియా తరుపున సుదీర్ఘ ఫార్మట్‌లో అరంగ్రేటం చేసిన వార్నర్, తన కెరీర్ మొత్తంలో 112 టెస్టులు ఆడి 205 ఇన్నింగ్స్‌లో 8786 పరుగులు చేశాడు. టెస్టుల్లో వార్నర్ 3 డబుల్ సెంచరీలు, 26 సెంచరీలు, 36 అర్థ సెంచరీలు ఉన్నాయి. టెస్టుల్లో వార్నర్ అత్యధిక స్కోరు 335. 161 వన్డేల్లో వార్నర్ 22 శతకాలు, 33 అర్థ శతకాలతో 6932 పరుగులు చేశాడు. 110 టీ20ల్లో ఓ సెంచరీతో 3277 పరుగులు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నా వార్నర్ లీగుల్లో కనిపించే అవకాశం ఉంది.

## బంగ్లాదేశ్ మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ చీటింగ్!

టీ20 ప్రపంచకప్ 2024 సూపర్ ఎయిట్‌లో బంగ్లాదేశ్ అఫ్ఘానిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. మధ్య మధ్యలో వర్షం అంతరాయం కలిగిస్తున్నా గెలుపు కోసం ఇరు జట్లు చివరి వరకూ పోరాడడంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. కానీ చివరికి అఫ్ఘాన్ అద్భుతం విజయం సాధించి సెమీస్ చేరింది. అయితే ఈ పోరులో అఫ్ఘాన్ జట్టు మైదానంలోనే కొన్ని డ్రామాలు ఆడిందన్న విమర్శలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. చీటింగ్ చేసిందంటూ అంతా ఆరోపిస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే ఈ మ్యాచ్‌లో గెలుపొందేందుకు అఫ్ఘానిస్థాన్ ఎంతకైనా తెగించేలా కనిపించింది! మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘానిస్థాన్ బంగ్లాదేశ్ ముందు 116 పరుగుల లక్ష్యం ఉంచింది. వర్షం అంతరాయం కలిగిస్తున్నప్పటికీ బంగ్లా మంచి శుభారంభమే చేసింది. కానీ ఆ తర్వాత రషీద్ ఖాన్ తన స్పిన్ మాయాజాలంతో మ్యాచ్‌ను ఆఫ్ఘాన్ వైపు తిప్పాడు. అయితే ఛేదనలో లిటన్ దాస్ తన బ్యాటింగ్‌తో అఫ్ఘానిస్థాన్‌కు కాస్త టెన్షన్ పెట్టాడు. దీంతో వర్షం మాత్రమే అఫ్ఘానిస్థాన్‌ను తిరిగి మ్యాచ్ విన్నింగ్ ట్రాక్‌లోకి తీసుకురాగలదని గ్రహించిన ఆ జట్టు కోచ్ జోనాథన్ ట్రాట్ మ్యాచ్ నెమ్మదించాలని ఆటగాళ్లకు సైలెంట్‌గా సంకేతాలు ఇచ్చాడు. దీన్ని ఫాలో అయిన గుల్బాదిన్ నైబ్ మైదానంలో అకస్మాతుగా కింద పడిపోయాడు. తాను గాయపడినట్లు నటించడం ప్రారంభించాడు. కానీ కొంత సేపు తర్వాత వేగంగా బౌలింగ్ చేస్తూ కనిపించాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. దీంతో మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ మోసం చేసిందంటూ సోషల్ మీడియాలో పోస్టులు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. అఫ్ఘాన్ కోచ్ జోనాథన్ ట్రాట్ సూచనల మేరకు ఆ జట్టు పేసర్ గుల్బదీన్ తొడ కండరాలు పట్టేసినట్లు నటించాడని నెటిజన్లు, క్రికెట్ ప్రియులు ఆరోపిస్తున్నారు.





## 'థీమ్ ఆఫ్ కల్కి' సాంగ్ రిలీజ్

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మైథాలజీ సైన్స్ ఫిక్షన్ మూవీ కల్కి 2898 ఏ.డి. దీపికా పదుకునే, దిశా పటానిలు కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో యూనివర్సల్ స్టార్ హీరో కమల్ హాసన్, బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ లు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలు సినిమా పై భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. ఇప్పటికే అన్ని చోట్ల భారీ బుకింగ్స్ జరుగుతున్నాయి. ఈ చిత్రం నుండి థీమ్ ఆఫ్ కల్కి సాంగ్ ను మేకర్స్ నేడు రిలీజ్ చేయడం జరిగింది. ఈ సాంగ్ ఆడియెన్స్ ను విశేషం గా ఆకట్టుకుంటుంది. వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీ దత్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. జూన్ 27, 2024 న వరల్ వైడ్ గా థియేటర్ల లోకి రానున్న ఈ చిత్రం పై భారీ అంచనాలు నెలకొన్నాయి.



మెగాస్టార్ చిరంజీవి

## మాగ్నమ్ ఓపస్ 'విశ్వంభర'

వశిష్ట దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. 'విశ్వంభర'తో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించడానికి విశ్వంభర టీమ్ అన్నీ క్రాఫట్స్ లో చాలా కేర్ తీసుకుంటుంది. ప్రస్తుతం అన్నపూర్ణ సెవెన్ ఎకర్స్ లో వేసిన మ్యాసీవ్ సెట్ లో షూట్ జరుగుతోంది. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ వివి వినాయక్ 'విశ్వంభర' సెట్స్‌లోకి వచ్చారు. ఈ సందర్భంగా చిరంజీవి గారితో ఆయనకున్న ప్రత్యేక అనుబంధాన్ని పంచుకుంటూ కాసేపు మాట్లాడుకున్నారు. చిత్ర యూనిట్ కి, డైరెక్టర్ వశిష్ట కి ఆల్ ది బెస్ట్ చెప్పారు. మెగాస్టార్ చిరంజీవి, వశిష్ట, వి వి వినాయక్ కలసివున్న ఫోటోని మేకర్స్ షేర్ చేశారు. విశ్వంభరలో త్రిష కృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఆస్కార్ అవార్డు విజేత ఎంఎం కీరవాణి సంగీతం అందించగా, ప్రముఖ డీవోపీ చోటా కె నాయుడు సినిమాటోగ్రాఫర్ గా పని చేస్తున్నారు. విశ్వంభర 2025 సంక్రాంతికి జనవరి 10న విడుదల కానుంది.

# రీల్

## యాక్షన్‌తో ఆకట్టుకుంటున్న 'బడ్డీ' ట్రైలర్





యంగ్ హీరో అల్లు శిరీష్ నటిస్తున్న తాజా చిత్రం 'బడ్డీ'పై ప్రేక్షకుల్లో మొదట్నుండి మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఈ సినిమా పోస్టర్స్, టీజర్ అంచనాలను రెట్టింపు చేశాయి. ఇక ఈ సినిమాను సామ్ ఆంటోన్ డైరెక్ట్ చేస్తుండగా, పూర్తి యాక్షన్ ఎంటర్టైనర్ మూవీగా ఇది రానుంది. తాజాగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'బడ్డీ' ట్రైలర్ ఆద్యంతం యాక్షన్ ఎలిమెంట్స్ తో ఆకట్టుకుంటుంది. అన్యాయంపై తిరగబడ్డ ఒక టెడ్డీ బియర్ అంటూ ఈ ట్రైలర్ మొదలవగా, ఇందులో ఓ టెడ్డీ బియర్ విలన్లను చితక్కొడుతూ కనిపించింది. అయితే, ఈ టెడ్డీ బియర్‌కు సాయంచేసే కెప్టెన్ పాత్రలో అల్లు శిరీష్ కనిపించాడు. అజ్మల్ విలన్ పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో యాక్షన్‌కు కొదువ లేకుండా డైరెక్టర్ దీన్ని తెరకెక్కించారు. ఇక ఈ సినిమాకు హిప్ హాప్ తమిళ సంగీతం అందిస్తుండగా, ఇప్పటికే రిలీజ్ అయిన సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ దక్కింది. ఈ సినిమాలో ప్రిషా రాజేష్ సింగ్, ముఖేష్ కుమార్, అలీ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను జూలై 26న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

## 'ఆయ్' రిలీజ్ డేట్ ఫిక్స్ చేశారుగా





యంగ్ హీరో నితిన్ నార్నె నటిస్తున్న తాజా చిత్రం 'ఆయ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ ను క్రియేట్ చేసింది. ఈ సినిమాను జిఏ2 పిక్చర్స్ బ్యానర్ పై నిర్మాత బన్నీ వాస్ ప్రొడ్యూస్ చేస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు మరింతగా పెరిగాయి. కాగా, ఈ సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్‌ను మేకర్స్ తాజాగా వెల్లడించారు. 'ఆయ్' చిత్రాన్ని ఆగస్టు 15న థియేటర్లలో రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. దీంతో ఆగస్టు 15న బాక్సాఫీస్ వద్ద మరోసారి గట్టి పోటీ నడవనుంది. ఇప్పటికే ఈ డేట్ ను పలు సినిమాలు లాక్ చేసుకున్నాయి. ఇక 'ఆయ్' సినిమాలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తోండగా రామ్ మిర్యాల ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. సమీర్ కళ్యాణి సినిమాటోగ్రఫీ అందిస్తున్న 'ఆయ్' సినిమాను అంజి కె.మణిపుత్ర డైరెక్ట్ చేస్తున్నారు.

## కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

### బెయిల్‌పై హైకోర్టు స్టే



**న్యూఢిల్లీ :** మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు మంగళవారం స్టే విధించింది. ఇడి సమర్పించిన ఆధారాలను పరిశీలించడంలో ట్రయల్ కోర్టు విఫలమైందని వ్యాఖ్యానించింది. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునేటప్పుడు జడ్జి సహేతుకంగా ఆలోచించలేదని జస్టిస్ సుధీర్ కుమార్ జైన్‌తో కూడిన హైకోర్టు వెకేషన్ బెంచ్ వ్యాఖ్యానించింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన కేసును వాదించడానికి ఇడికి తగిన అవకాశం ఇవ్వాలని పేర్కొంది. సిఎం కేజ్రీవాల్ బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే విధించడంపై కేజ్రీవాల్ తరపు న్యాయవాది రిషికేశ్ కుమార్ స్పందించారు. 'మేము ఇప్పటికే సుప్రీంకోర్టులో మధ్యంతర స్టేను సవాల్ చేశాం. బుధవారం ఆ కేసు లిస్ట్ అయ్యింది. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వు కాపీతో సుప్రీం కోర్టులో ఒక దరఖాస్తును దాఖలు చేస్తున్నాం. కోర్టు ఈ ఉత్తర్వును పరిగణనలోకి తీసుకోవాలి' అని పేర్కొన్నారు. కాగా, మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు జూన్ 20న రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష వ్యక్తిగత పూచీకత్తుపై ఆయన్ను విడుదల చేయవచ్చని స్పష్టం చేసింది. విచారణకు ఆటంకం కలిగించరాదని, సాక్షుల్ని ప్రభావితం చేయకూడదని షరతులు విధించింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఇడి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కింది కోర్టు ఉత్తర్వులను సవాల్ చేసింది. దిగువ న్యాయస్థానం తమ వాదనలు పూర్తిగా వినలేదని పేర్కొంది. ఆ తర్వాత కేజ్రీవాల్ బెయిల్ పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తాజా ఆదేశాలు ఇచ్చింది.

## మంత్రి ఆతిశీ ఆమరణ దీక్ష విరమణ



**న్యూఢిల్లీ:** ఢిల్లీ నీటి శాఖ మంత్రి ఆతిశీ తన అమరణ నిరాహార దీక్ష విరమించారు. తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో మంగళవారం తెల్లవారుజామున ఆమె స్థానిక లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ (ఎల్ఎన్‌జేపీ)ఆసుపత్రిలో చేరారు. మంత్రి ఆతిశీ షుగర్ లెవెల్స్ 36కి పడిపోయాయని, దీంతో ఆమెను ఆసుపత్రికి తరలించామని ఆమ్ ఆద్మీ పార్టీ వెల్లడించింది. ఢిల్లీలో మంచి నీటి సరఫరా డిమాండ్ చేస్తూ మంత్రి ఆతిశీ అయిదు రోజులుగా అమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆ క్రమంలో ఆమె ఆరోగ్యం క్షీణించింది. దీంతో సోమవారం రాత్రి వైద్యులు ఆమెను పరీక్షించారు. ఆరోగ్యం బాగా క్షీణించిందని, వెంటనే ఆసుపత్రిలో చేరాలని మంత్రి ఆతిశీకి వైద్యులు సూచించారు. లేకుంటే ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశముందన్నారు. దాంతో మంగళవారం తెల్లవారుజామున మంత్రి ఆతిశీ... తన దీక్ష విరమించారు. అనంతరం ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఐసీయూలో ఉన్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. హర్యానా నుంచి ఢిల్లీకి చట్టబద్ధంగా రావాల్సిన నీటిని విడుదల చేయాలంటూ మంత్రి ఆతిశీ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు ఢిల్లీలో మంచి నీటి కొరతపై ప్రధాని మోదీకి లేఖ రాస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ వెల్లడించారు. దేశ రాజధాని ఢిల్లీలో మంచి నీటి కొరత అంశాన్ని విపక్షాలతో కలిసి పార్లమెంట్‌లో లేవనెత్తుతామని ఆయన స్పష్టం చేశారు.

# పదేళ్లుగా దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ

### ఏకాభిప్రాయానికి మోదీ వ్యతిరేకం
### ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాలరాశారు
### కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మండిపాటు



**న్యూఢిల్లీ:** ఎమర్జెన్సీపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మంగళవారం ఎదురుదాడి చేసింది. గత పదేళ్లుగా దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని అమలు చేశారని విమర్శించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 'ఎక్స్' వేదికగా మాట్లాడుతూ... ప్రధాని తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే గతాన్ని తవ్వుతున్నారు. ఏకాభిప్రాయం, సహకారం గురించి సుద్దులు చెబుతారే గానీ దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. గత 10 సంవత్సరాల్లో మోదీ 140 కోట్ల మంది భారతీయులకు అప్రకటిత ఎమర్జెన్సీ అంటే చూపించారని... ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి తీవ్ర గాయం చేసిందని పేర్కొన్నారు. 'పార్టీలను చీల్చడం, ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేయడంతో పాటు 95 శాతం మంది ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థల చేత అక్రమ కేసులు పెట్టించడం, ఎన్నికల ముందు ముఖ్యమంత్రులను జైల్లో పెట్టడం... ఇదంతా అప్రకటిత ఎమర్జెన్సీ కాదా' అని ఖర్గే ప్రశ్నించారు. ఎమర్జెన్సీ విధించిన వారికి రాజ్యాంగంపై ప్రేమను చాటుకునే హక్కు లేదని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలకు ఖర్గే పై విధంగా స్పందించారు. 146 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటు నుండి సస్పెండ్ చేసినప్పుడు, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లను మార్చడానికి మూడు కొత్త చట్టాలను తీసుకువచ్చినప్పుడు, ఛత్రపతి శివాజీ, మహాత్మాగాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయుల విగ్రహాలను ఏకపక్షంగా పార్లమెంట్ కాంప్లెక్స్ నుంచి తరలించినప్పుడు ఏకాభిప్రాయం ఎక్కడ ఉందని ఖర్గే ప్రశ్నించారు. 15 కోట్ల రైతు కుటుంబాలపై మూడు కొత్త వ్యవసాయ చట్టాలను బలవంతంగా రుద్దడంతో పాటు నెలరోజుల పాటు రోడ్లపై కూర్చొని నిరసనకు దిగిన వారిపై దౌర్జన్యాలకు పాల్పడినప్పుడు ఏకాభిప్రాయం ఉందా అంటూ మోదీని నిలదీశారు. ప్రభుత్వ ఏకపక్ష చర్యలకు నోట్ల రద్దు, లాక్‌డౌన్, ఎలక్టోరల్ బాండ్ల చట్టం సహా అనేక ఇతర ఉదాహరణలు ఉన్నాయని ఖర్గే అన్నారు. ప్రతిపక్షాల గురించి ఏం మాట్లాడాలని, మీ స్వంత నేతలను కూడా చీకట్లో ఉంచారని ఆరోపించారు. 17వ లోక్‌సభలో కేవలం 16 శాతం బిల్లులు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలకు పంపబడ్డాయని... లోక్‌సభలో తీసుకొచ్చిన 35 శాతం బిల్లులు గంట వ్యవధిలో ఆమోదం పొందగా, రాజ్యసభలో గంట వ్యవధిలో 34 శాతం బిల్లులు ఆమోదం పొందాయని ఖర్గే పేర్కొన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని విస్మరించిందని... కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి అండగా నిలుస్తుందని, అలాగే కొనసాగుతుందని ఖర్గే స్పష్టం చేశారు.

**రాజ్యాంగాన్ని మార్చలేనివిధంగా ప్రజల తీర్పు: చిదంబరం**

కాంగ్రెస్ సీనియర్ నేత, ఆర్థికశాఖ మాజీ మంత్రి పి.చిదంబరం 'ఎక్స్' వేదికగా మాట్లాడుతూ... రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఏ 'దైవిక పాలకుడూ' మార్చలేని రీతిలో దేశ ప్రజలు 18వ లోక్‌సభకు ఓటు వేశారని అన్నారు. రాజ్యాంగంపై బీజేపీ కుట్రలు అమలవకుండా చేసే విధంగా ప్రజలు ఓటు వేశారని అన్నారు. 'రాజ్యాంగాన్ని రక్షించాలని ఎమర్జెన్సీ గుర్తుచేస్తుంది' అని పధానమంత్రి అనడంలో నిజముందని చిదంబరం చెబుతూ... మరో ఎమర్జెన్సీని నివారించాలని రాజ్యాంగం ప్రజలకు గుర్తు చేసిందన్నారు. ప్రజలు బీజేపీ దుష్ట ఆలోచనలకు గండి కొడుతూ 18వ లోక్‌సభకు ఓటు వేశారన్నారు. ఎవరూ రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని మార్చలేరన్నారు. 'భారతదేశం ఉదారవాద, ప్రజాస్వామ్య, లౌకిక రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుంది' అని స్పష్టం చేశారు.

## బెయిల్ పిటిషన్లపై విచారణను అనవసరంగా వాయిదా వేయొద్దు



**న్యూఢిల్లీ :** బెయిల్ అంశాలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వాటిని అనవసరంగా వాయిదా వేయకూడదని ఢిల్లీ హైకోర్టును ఉద్దేశిస్తూ పేర్కొంది. మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ బెయిల్ విజ్ఞప్తిపై తదుపరి విచారణలో నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై స్టే విధించడం అసాధారణంగా పరిగణించిన సుప్రీం కోర్టు.. మరో కేసులోనూ ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం తీరుపై ఇలా వ్యాఖ్యానించింది. తన బెయిల్ పిటిషన్‌ను విచారించకుండా ఢిల్లీ హైకోర్టు సుదీర్ఘకాలం వాయిదా వేయడంపై మాజీ మంత్రి సత్యేందర్ జైన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిని పరిశీలించిన జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీలతో కూడిన ధర్మాసనం.. 'బెయిల్ వ్యవహారాలను అనవసరంగా వాయిదా వేయకూడదని చెప్పనవసరం లేదు. అందుకే తదుపరి విచారణ తేదీన హైకోర్టు నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం' అని పేర్కొంది. జులై 9న హైకోర్టు విచారణ చేపట్టనుంది. మరోవైపు, అరవింద్ కేజ్రీవాల్‌కు సంబంధించి ట్రయల్ కోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర నిలిపివేత ఉత్తర్వులు ఇవ్వటంపైనా సుప్రీంకోర్టు ఇటీవల ఆశ్చర్యం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. హైకోర్టు తీర్పును రిజర్వులో ఉంచడాన్ని 'అసాధారణ నిర్ణయం'గా అభిప్రాయపడింది. కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే ఇస్తూ హైకోర్టు నిర్ణయం వెలువడిన నేపథ్యంలో జూన్ 26న సుప్రీంకోర్టు విచారణ జరపనుంది.

## ప్రజ్వల్‌పై మరో ఎఫ్ఐఆర్

### పోలీసు కస్టడీ మరో నాలుగు రోజులు పొడిగింపు

**బెంగళూరు :** మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపులు, వేధింపులు, బెదిరింపుల ఆరోపణలపై మరో ఎఫ్ఐఆర్ నమోదయినట్లు పోలీసు వర్గాలు మంగళవారం తెలిపాయి. అలాగే అతని పోలీసు కస్టడీని మరో నాలుగు రోజులు పొడిగించారు. బాధితురాలిపై లైంగిక వేధింపుల సమయంలో ప్రజ్వల్ తీసిన చిత్రాలను వీడియో కాల్‌లో పంచుకున్నందుకు అతనితో పాటు హసన్‌లోని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రీతమ్ గౌడ్‌తో సహా మరో ముగ్గురిని కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు వారు తెలిపారు. తాజా ఎఫ్ఐఆర్‌తో ప్రజ్వల్‌పై నమోదయిన నాలుగో కేసు ఇది. 'ప్రజ్వల్, మరో ముగ్గురిపై సిట్ తాజా కేసు నమోదు చేసింది. ఎఫ్ఐఆర్‌లో బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రీతమ్ గౌడ పేరు కూడా ఉంది' అని పోలీసు వర్గాలు ధ్రువీకరించినట్లు పీటీఐ తెలిపింది. భారత నేర శిక్షాస్మృతిలోని సెక్షన్‌లు 355 ఎ (లైంగిక వేధింపులు), 354 బి (మహిళపై దా డి చేయడం), 354 సి (వెంబడించడం), 506 (నేరపూరిత బెదిరింపు), 66 ఇ (గోప్యతను ఉల్లంఘించినందుకు శిక్ష) కింద కేసు నమోదు చేసిన ట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. కాగా, ప్రజ్వల్ రే వణ్ణ పోలీసు కస్టడీని జూన్ 29 వరకు నాలుగు రోజుల పాటు పొడిగించారు. ప్రజ్వల్ అనేక మ ంది మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డార ని, అసభ్యకరమైన వీడియోలు తీశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. బాధితుల వీడియోల రి కార్డు కోసం సీఐడీ సైబర్ క్రైమ్ కేసులో మాజీ ప్ర ధాని హెచ్‌డీ దేవెగౌడ మనవడు ప్రజ్వల్‌కు జూన్ 29 వరకు పోలీసు కస్టడీని పొడిగించినట్లు సం బ ంధిత వర్గాలు తెలిపాయి. 33 ఏళ్ల ప్రజ్వల్ జ ర్మ నీ నుంచి తిరిగి వచ్చిన వెంటనే మే 31న అరెస్టయ్యాడు. ప్రజ్వల్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని కర్నాటక పోలీసులు విచారణ చేపట్టారు.

## ఎమర్జెన్సీపై మోదీ పోరాడలేదు: సుబ్రమణ్యస్వామి

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీపై కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి కొంతకాలంగా విమర్శలు గుప్పిస్తున్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అప్పట్లో విధించిన ఎమర్జెన్సీ గురించి మోదీ మాట్లాడటంపై ఆయన స్పందించారు. 'ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా మోదీ పోరాడలేదు. ఆ సమయంలో ఆయన గుజరాత్‌లో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ఉన్నారు. బాబుభాయ్ నేతత్వంలోని జనతా మోర్చా సర్కార్ గుజరాత్‌లో ఉన్న కారణంగా రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు రాలేదు. ఇలాంటి అంశాల్లో క్రెడిట్ కొట్టేయాలనే ఓ చెడ్డ అలవాటు మోదీకి ఉంది' అని సుబ్రహ్మణ్య స్వామి ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. దేశ వ్యాప్తంగా నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ సంచలనం సష్టిస్తున్న వేళ సుబ్రమణ్య స్వామి బీజేపీపై విమర్శలు గుప్పించారు. 'పార్లమెంటులో మెజారిటీ లేని ప్రభుత్వం ఉంది. దేశంలో నిరుద్యోగుల సంఖ్య భారీగా పెరిగిపోతోంది. ఎవరు గెలిచినా విద్యార్థుల కష్టాలు పట్టించుకోరు. పిల్లల జీవితాలతో ఆడుకోవడం, వారి కలలు నాశనం చేయడమే వారి పని' అని సుబ్రమణ్య స్వామి తీవ్రంగా స్పందించారు.

## 'నీట్' రద్దు చేయండి మోదీకి మమత విజ్ఞప్తి



**కోల్‌కతా:** నీట్ పరీక్షను పూర్తిగా రద్దుచేయాలని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోరారు. ప్రశ్నపత్రం లీకేజీపై సమగ్ర నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని ప్రధాని మోదీకి ఆమె లేఖ రాశారు. నీట్‌ను రద్దు చేసి... ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా మెడికల్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులను ఎంపిక చేసే స్వేచ్ఛను రాష్ట్రాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని ప్రధానిని కోరారు. తక్షణమే పాత పద్ధతి పునరుద్ధరించాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు. కాగా, భారత్, బంగ్లాదేశ్ మధ్య నీటి పంపకాలకు సంబంధించి రెండు దేశాల ప్రధానులు నరేంద్ర మోదీ, షేక్ హసీనా మధ్య జరిగిన చర్చలకు కేంద్రం తనను ఆహ్వానించకపోవడంపై మమతా బెనర్జీ మండిపడ్డారు. పశ్చిమబెంగాల్ ప్రమేయం లేకుండా రెండు దేశాలు నీటి పంపకాలపై చర్చలు జరపడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా, అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా చర్చలు, సంప్రదింపులు జరపడం ఆమోదయోగ్యం కాదు' అని మమత పేర్కొన్నారు. తీస్తా నదీ జలాల పరిరక్షణనిర్వహణ, 1996 నాటి గంగా జలాల ఒప్పందం పునరుద్ధరణ అంశాలపై ఇటీవల మోదీ, హసీనా చర్చలు జరిపారు. అనంతరం మోదీ మీడియాతో మాట్లాడుతూ త్వరలో సాంకేతిక బందాన్ని బంగ్లాదేశ్‌కు పంపనున్నట్టు తెలిపారు. ఒప్పందం ప్రకారం తీస్తా జలాల పరిరక్షణ, నిర్వహణకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెద్ద రిజర్వాయరు నిర్మించడానికి భారత్ సిద్ధంగా ఉంది. అయితే భారత్, బంగ్లాదేశ్ మధ్య నీటి పంపకాల ఒప్పందాన్ని చాలాకాలంగా మమత వ్యతిరేకిస్తున్నారు.